సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 63

గురువారం 25-5-2023



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు.. నా జన్మ ధన్యమైనట్టే'



సజావుగా నోట్లు వెనక్కి...

రూ. 2వేల నోటు ఉపసంహరణను పర్యవేక్షిస్తున్నామన్న శక్తికాంత దాస్ -13లో



ఆకాశ్ (5/5) అద్భుతం...

ఎలిమినేటర్ మ్యాచ్‌లో లక్నోపై ముంబై ఇండియన్స్ ఘనవిజయం. -12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాస్‌పోర్టు కోసం ఎన్‌ఓసీ ఇవ్వండి

పాస్‌పోర్టు పొందడానికి ఎన్‌ఓసీ జారీ చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని సుబ్రహ్మణ్య స్వామిని ఢిల్లీ కోర్టు ఆదేశించింది. - 6లో




బంధాన్ని భంగపరిస్తే సహించం

ఆస్ట్రేలియా, భారత్ బంధానికి భంగం కల్గించేలా ఖలిస్తాన్ వేర్పాటువాద మూకలు ఆస్ట్రేలియాలో ఆలయాలపై దాడులకు తెగబడటాన్ని మోదీ ఖండించారు. - 6లో



మా పోరాటానికి మద్దతివ్వండి

ఢిల్లీలో పాలనాధికారాలపై నియంత్రణ కోసం కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని ఉద్ధవ్ ఠాక్రేను కేజ్రీవాల్ కోరారు. - 6లో



'రాజదండం' సాక్షిగా...

అధికార బదిలీకి ప్రతీకగా చోళ రాజులు తమ వారసుని చేతికందిస్తూ వచ్చిన రాజదండాన్ని లోక్‌సభలో ప్రతిష్టించనున్నట్టు అమిత్ షా ప్రకటించారు. - 6లో

న్యూస్‌రీల్

కోటిన్నర ఎకరాల్లో పంటల సాగు



రాష్ట్రంలో వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ పంటల ప్రణాళికను ఖరారు చేసింది. ఇందులో భాగంగా కోటిన్నర ఎకరాల్లో పంటలు సాగయ్యేలా చూడాలని నిర్ణయించింది.

- వివరాలు 3లో


నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం కేసీఆర్ సమీక్ష



గురువారం నూతన సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, హరితహారం, తదితర అంశాలపై చర్చిస్తారు.

- వివరాలు 3లో

రామప్పపై ఏఎస్‌ఐ మంట!



సింగరేణి సంస్థ ప్రతిపాదించిన 'పీవీ నరసింహారావు భూఉపరితల గనుల (ఓపెన్ కాస్ట్ మైన్)' అంశం వివాదానికి కారణమైంది. ఇప్పటికే ప్రతిపాదిత గనులతో ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి ముప్పు వస్తుందన్న అభ్యంతరాలు ఉన్నాయి.

- వివరాలు 14లో

ఎర్రర్..టైమ్ అవుట్!



వెబ్‌సైట్ సతాయింపులు, సర్వర్ సమస్యలు గురుకుల కొలువుల అభ్యర్థులకు తలనొప్పిగా మారాయి. దరఖాస్తు ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగిసింది. కానీ గడువు ముగిసే చివరి నిమిషంవరకు సాంకేతిక సమస్యలు వెంటాడాయి.

- వివరాలు 14లో

ఇదండీ.. జగత్



ఇక ఆగొద్దు సార్! సీబీఐ డ్రస్‌లో మనమే వెళ్లి అరెస్టు చేద్దాం!

రెవె'న్యూ' ప్రాబ్లమ్!

వీఆర్ఏలను ఇతర శాఖలకు పంపితే గ్రామాల్లో సేవలకు ఆటంకం

ఇప్పటికే వీఆర్వో వ్యవస్థ రద్దు.. వీఆర్ఏలూ లేకుంటే ఇబ్బందేనంటున్న అధికారులు

56 రకాల రెవెన్యూ విధులతో పాటు అన్ని శాఖల్లోనూ 'సహాయకుల' ముఖ్యపాత్ర

నేర విచారణ నుంచి పంట నష్టం అంచనాల దాకా ప్రాథమిక సమాచారం ఇచ్చేది వారే

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులోనూ కీలకమే..



సాక్షి, హైదరాబాద్: వీఆర్ఏ.. గ్రామ రెవెన్యూ సహాయకుడు.. పేరుకే రెవెన్యూ ఉద్యోగి. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల కార్యకలాపాల్లోనూ భాగస్వామ్యం ఉంటుంది. వీఆర్ఏలు అంటే గ్రామస్థాయిలో ప్రభుత్వ ప్రతినిధి లాంటి వారనే అభిప్రాయమూ ఉందంటే వారిదెంతటి కీలక పాత్రో అర్థమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారి వ్యవస్థను రద్దు చేశాక.. వీఆర్ఏలే గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు ఏకైక దిక్కుగా మిగిలారు. అలాంటి వీఆర్ఏల సేవలు గ్రామాల్లో అవసరం లేదని, వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదన గందరగోళానికి దారితీస్తోంది. వీఆర్ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, పేస్కేల్ అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంపై హర్షం వ్యక్తమవుతున్నా.. వారిని ఇతర శాఖలకు పంపితే క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులకు పరిష్కారం ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వీఆర్ఏల విధులెన్నో..

వీఆర్ఏలు రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ వీరి జాబ్‌చార్ట్ మాత్రం మిగతా ఉద్యోగులకు భిన్నంగా ఉంటుంది. గ్రామాల్లోని చెరువులు, కుంటల సంరక్షణతో పాటు ఏ చెరువు కట్ట తెగినా, వాగులు పొంగినా, అలుగులు పోసినా నీటిపారుదల శాఖ ఏఈ, డీఈలకు వీఆర్ఏలే ప్రాథమిక సమాచారం ఇస్తుంటారు. గతంలో అయితే నీటి పంపకం (తైబందీ) కూడా వీరి పర్యవేక్షణలోనే జరిగేది. ఇక, గ్రామపంచాయతీ సమావేశాల ఏర్పాట్లు చేసేది, గ్రామంలోకి ఏ శాఖకు చెందిన అధికారి వచ్చినా దగ్గరుండి గ్రామానికి

మిగతా 3వ పేజీలో ▶

విద్యార్హతలపై కిరికిరి?

➤ ఇతర శాఖలకు పంపే మాట అటుంచితే కేబినెట్ ఆమోదించిన విధంగా వీఆర్ఏల క్రమబద్ధీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వీరిని క్రమబద్ధీకరించే విషయంలో రెవెన్యూ ఉన్నతాధికారులు పెట్టిన నిబంధనలు చాలామందిని పేస్కేల్ నుంచి దూరం చేస్తాయనే వాదన వినిపిస్తోంది. రెవెన్యూ శాఖ సేకరించిన వివరాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వీఆర్ఏలలో కేవలం 9,008 మందికి మాత్రమే 10వ తరగతి, అంతకన్నా ఎక్కువ విద్యార్హతలున్నాయి. మిగిలిన 12,426 మంది వీఆర్ఏలు పదో తరగతి కన్నా తక్కువ చదువుకోగా, వీరిలో 5వేల మందికి పైగా నిరక్షరాస్యులు ఉన్నారు. ఒకవేళ విద్యార్హతలే క్రమబద్ధీకరణకు ప్రామాణికమైతే తగిన విద్యార్హతలు లేని వీఆర్ఏల కుటుంబాల్లో అర్హతలు ఉన్న వారికి ఉద్యోగాలివ్వాలని వీఆర్ఏల జేఏసీ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) డిమాండ్ చేస్తున్నాయి. కానీ రెవెన్యూ వర్గాలు మాత్రం.. 10వ తరగతి కంటే తక్కువ విద్యార్హతలు ఉన్న మెజారిటీ వీఆర్ఏల విషయంలో ఏం నిర్ణయం తీసుకునేదీ స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

వివేకాను హత్య చేసిన వాళ్లు విచ్చలవిడిగా బయట తిరుగుతున్నారు

- వాళ్లను వదిలి అవినాశ్‌ను టార్గెట్ చేయటం బాధాకరం
- సునీత వెనకాల కొన్ని దుష్టశక్తులున్నాయి..
- గతంలో హత్య వెనక కుటుంబీకులు లేరని ఆమె చెప్పింది
- మరిప్పుడు మాట ఎందుకు మార్చిందో తెలియటం లేదు
- ఇది తప్పని చెప్పినా... ఆమె ఏమీ మాట్లాడటం లేదు
- టీవీ చానళ్లలో అన్యాయంగా మాట్లాడుతున్నారు
- అవినాశ్ తల్లి ఈ వ్యవహారంతో తల్లడిల్లిపోతోంది
- వైఎస్ సోదరి విమలమ్మ ఆవేదన; ఆసుపత్రిలో పరామర్శ



కర్నూలు(రాజ్‌విహార్): ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల కారణంగా తమ కుటుంబం పరిస్థితి భయంకరంగా తయారయిందని, తన సోదరుడు వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన వారు మాత్రం బయట విచ్చలవిడిగా తిరుగుతున్నారని వైఎస్ వివేకా సోదరి వైఎస్ విమలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఏ తప్పు చేయలేదనే వాళ్లు మాత్రం జైలులో ఉన్నారంటూ... ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సీబీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తుండటం బాధ కలిగిస్తోందన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రిలో

మిగతా 10వ పేజీలో ▶



మేం రాం రాం!

- పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి విపక్షాలు దూరం
- బహిష్కరిస్తున్నట్లు 19 పార్టీల సంయుక్త ప్రకటన
- రాష్ట్రపతి కాకుండా ప్రధాని ప్రారంభించడం ప్రజాస్వామ్యంపై దాడేనంటూ మండిపాటు

ప్రారంభ 'గౌరవం'పై... పెను దుమారం

- పార్లమెంటు భవన ప్రారంభంపై రాజకీయ రగడ
- గతానుభవాలు, సంప్రదాయాలు చెబుతున్నదేంటి?

6లో

బైడెన్‌ను హత్య చేసి అధ్యక్షుడినవుతా!



- మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉందో లేదో గానీ అమెరికాలో తెలుగు సంతతి యువకుడు కందుల సాయివర్షిత్ ఏకంగా అధ్యక్షుడు జో బైడెన్ హత్యకు పన్నాగం పన్ని, తీవ్ర కలకలం సృష్టించాడు. బైడెన్‌ను హత్య చేసి, అధ్యక్ష పదవిని దక్కించుకోవడమే తన లక్ష్యమని అతడు చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. - 3లో

'కమలం' కార్యాచరణ మారాలి సారూ!

- ఢిల్లీ బీజేపీ పెద్దలకు తెలంగాణ నేతల ఫీడ్‌బ్యాక్
- కీలకమైన ఎన్నికల దృష్ట్యా విధానాలు మార్చాలని విన్నపం
- త్వరలోనే ఈటలకు రాష్ట్ర ఎన్నికల కమిటీ లేదా ప్రచార కమిటీ సారథ్య బాధ్యతలిస్తారంటూ ప్రచారం..

5లో



'స్టెమ్ క్యూర్స్' కంపెనీ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్‌లో 'స్టెమ్ సెల్' ల్యాబ్!

- లైఫ్ సైన్సెస్ రంగంలో దేశంలోనే అతి పెద్ద స్టెమ్ సెల్ తయారీ ప్రయోగశాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు 'స్టెమ్ క్యూర్స్ కంపెనీ' ప్రకటించింది. సుమారు 54 మిలియన్ డాలర్ల (సుమారు రూ.440 కోట్లు) పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ తయారీ యూనిట్‌తో 150 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- వివరాలు 3లో

టెండర్ ధరలో 10% చెల్లించలేని ఐఆర్‌బీకి ఓఆర్ఆర్!: రేవంత్



- నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థకే వంత పాడుతున్న కేటీఆర్
- అక్రమ సొమ్ముతో పెట్టుబడులు పెట్టడానికే కేటీఆర్ విదేశీ పర్యటనలు - 2లో

ఎన్నికల డబ్బు కోసమే జీవో 111 రద్దు!

- బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపణలు
- భూముల ద్వారా సంపాదించిన డబ్బులతో రాజకీయం చేస్తున్నారు
- జీవో 111 రద్దు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలి - 2లో

లక్షన్నర కుటుంబాలు

4 లక్షల ఎకరాలు

తుది దశకు చేరిన పోడు భూమి లెక్కలు.. పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం

జూన్ 25 నుంచి ప్రారంభం

అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,51,195 ఎకరాలకు..

అత్యల్పంగా పెద్దపల్లిలో ఎకరం భూమికి..



సాక్షి, మహబూబాబాద్: పోడు భూముల పట్టాల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుంది. మంత్రి వర్గ ఉపసంఘం, అనుభవజ్ఞులైన అధికారులు, గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులతో సీఎం కేసీఆర్ పలుమార్లు జరిపిన చర్చలు, సమీక్షల ఫలితంగా పట్టాల పంపిణీ ప్రక్రియ పట్టాలెక్కుతోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి 4 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది.

ఇతర రాష్ట్రాల్లో పరిశీలించి..

పోడు పట్టాల పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పరిశీలించారు. పట్టాలు ఎవరికి ఇవ్వాలి? ఏ ప్రాతిపదికన అర్హులను గుర్తించాలనే తర్జనభర్జన పడ్డారు. ఇందులో భాగంగా 2016, 2021లో దేశంలో ఎక్కడెక్కడ పోడు రైతులకు పట్టాలు ఇచ్చారనే వివరాలు సేకరించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎంతమంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు? అందులో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఎంతశాతం భూమికి పట్టాలు ఇచ్చాయి.. ఇతర వివరాలు పరిశీలించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణలోని హైదరాబాద్ మినహా తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన 99,486 మంది రైతులు సాగుచేసుకునే 3,31,070 ఎకరాలకు అటవీ హక్కుల చట్టం ద్వారా భూ హక్కు పత్రాలను అందజేశారు. దీనిని కూడా పరిగణనలోకి తీసుకుని, అప్పుడు అర్హులను గుర్తించిన విధానం, పట్టాల పంపిణీ తర్వాత గిరిజనుల్లో మార్పు మొదలైన అంశాలను పరిశీలించినట్లు సమాచారం.

23 వరకు వచ్చిన అర్జీలు పరిగణనలోకి..

ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు సాగుచేసుకుంటున్న 4,05,601 ఎకరాలకు

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

కాంగ్రెస్, బీఆర్ఎస్ ముమ్మాటికీ ఒక్కటే

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని, ఆ రెండు పార్టీలూ ముమ్మాటికీ ఒకే గూటి పక్షులని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలు కలసి నడుస్తూ, రాష్ట్రంలో వేరు వేరుగా పోరాడుతున్నట్లు నటిస్తున్నాయని దుయ్యబట్టారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మే 30 నుంచి జూన్ 30 వరకు జన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అందులో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా స్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు తీసుకెళ్తామని తెలిపారు.

కర్ణాటక ఫలితాలతో మోదీకి దిమ్మదిరిగింది

సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి



సిరిసిల్లటౌన్/జగిత్యాల అగ్రికల్చర్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ప్రధాని నరేంద్ర మోదీకి దిమ్మదిరిగిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల కార్మిక భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రూ. 2 వేల నోట్ల రద్దుపై కేంద్ర సర్కారు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. జూన్ 4న కొత్తగూడెంలో సీపీఐ గర్జనసభ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు అన్యాయం

ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే రైతులకు అన్యాయం జరుగుతోందని చాడ వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ మార్కెట్ యార్డులోని ధాన్యం కుప్పలను ఆయన బుధవారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు.

దళితులకు సీఎం బహుమతి ఇదేనా?

న్యాయవాది యుగంధర్‌ను పరామర్శించిన షర్మిల



బోడుప్పల్: బంగారు తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న దళితులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇచ్చే బహుమతి ఇదేనా అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్ అనుచరుల చేతిలో గాయపడి బోడుప్పల్ అభయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాది యుగంధర్‌ను బుధవారం ఆమె పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ...తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఇసుక దందా, దళిత బంధు, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల అక్రమాలపై ఆధారాలతో నిరూపిస్తే దాడులు చేశారని ఆరోపించారు.

ఆ 12 మంది ఎమ్మెల్యేలకు ఓటమే..

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన 12 మంది ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం వికారాబాద్ జిల్లా తాండూరులో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పార్టీ మారడంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. అధిష్టానం తాండూరులో నిర్వహించిన సర్వేలో తనకే అనుకూలంగా ఉందన్నారు. కేసీఆర్ సర్వేల ఆధారంగానే పార్టీ టికెట్లు కేటాయిస్తారని చెప్పారు. తాండూరులో బీఆర్ఎస్ టికెట్ తనదే.. గెలిచేది తానేనని ధీమా వ్యక్తం చేశారు.

పెట్రోల్ బంకులకు తాకిడి

రూ.2 వేల నోట్లకు చిల్లర కోసం వాహనాల్లో పెట్రోల్

సాక్షి, హైదరాబాద్: పెట్రోల్ బంకులకు రూ.2 వేల నోట్ల తాకిడి పెరిగింది. బంకుల్లో నోట్లు వినియోగానికి వెసులుబాటు ఉండటంతో వాహనదారులు ఇంధనం పేరిట నోట్ల మార్పిడికి ప్రయత్నిస్తున్నారు. బంకుకు వచ్చే వాహనదారుల్లో సగానికి పైగా రూ. 2 వేల నోటు ఇస్తుండటంతో పెట్రోల్ బంకుల డీలర్లకు చిల్లర సమస్యగా తయారైంది. దీంతో కనీసం రూ.1000 ఇంధనం వాహనంలో పోయించుకుంటే తప్ప రూ. 2వేల నోట్లు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. కొన్ని బంకుల్లో మాత్రం నోటుకు చిల్లర యూపీఐ, బీమ్, పేటీఎం ద్వారా చెల్లిస్తున్నారు. మరికొన్ని పెట్రోల్ బంకులు మాత్రం రూ.2వేల పైనే విలువగల ఇంధనం పోయిస్తేనే రూ, 2 వేల నోట్లు తీసుకుంటామని ఏకంగా బోర్డులు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఆర్‌బీఐ రూ.2 వేల నోట్లు పూర్తిగా రద్దు చేయడంతో వాటిని మార్చుకోవడానికి నగరవాసులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో సెప్టెంబర్ 30 వరకు మార్చు కోవడానికి అవకాశం ఉండటంతో అక్కడ రద్దీ పెరిగింది.

మహిళను చంపి.. ముక్కలు చేసి.. ఫ్రిజ్‌లో దాచి!

- మలక్‌పేటలో మహిళ తల దొరికిన కేసును తేల్చిన పోలీసులు
- హతురాలు ప్రముఖ ఆస్పత్రి మాజీ హెడ్ నర్సు
- చంపింది ఆమెతో సన్నిహిత సంబంధమున్న వ్యక్తే
- ఆర్థిక లావాదేవీల్లో విభేదాలతో ఈ దారుణం



అనురాధారెడ్డి



చంద్రమోహన్

సాక్షి, హైదరాబాద్/మలక్‌పేట: హైదరాబాద్‌లోని మలక్‌పేటలో మూసీ నది సమీపంలో మహిళ తల దొరికిన కేసు మిస్టరీ వీడింది. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని, హతురాలు ఓ ప్రముఖ ఆస్పత్రిలో మాజీ హెడ్ నర్సు అని తేలింది. ఆమెతో సన్నిహిత సంబంధమున్న వ్యక్తే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని.. చంపిన తర్వాత ఆమె శరీరాన్ని ముక్కలు చేసి దాచాడని, ప్రతి పది రోజులకో శరీర భాగాన్ని బయట పారేయాలని పథకం వేశాడని వెల్లడైంది. ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, డీఐ ఎల్.భాస్కర్‌రెడ్డిలతో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేశ్ ఈ కేసు వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు.

తండ్రికి వైద్యం నేపథ్యంలో పరిచయం

హైదరాబాద్‌లోని చైతన్యపురి ప్రాంతానికి చెందిన బి.చంద్రమోహన్ అవివాహితుడు. తమ సొంతింట్లో తల్లిదండ్రులతో కలిసి మొదటి అంతస్తులో నివసిస్తుంటాడు. తన వద్ద ఉన్న సొమ్మును వడ్డీలకు ఇవ్వడంతోపాటు షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడుతుంటాడు. 2007లో చంద్రమోహన్ తండ్రికి ప్రముఖ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ జరిగింది. అప్పట్లో సదరు ఆస్పత్రి తరఫున తమ ఇంటికి సేవలు చేయడానికి వచ్చిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు చెందిన హెడ్ నర్సు వై.అనురాధారెడ్డితో చంద్రమోహన్‌కు పరిచయం ఏర్పడింది. 2009లో అతడి తండ్రి చనిపోయినా.. నర్సుతో పరిచయం కొనసాగి ఇద్దరూ సన్నిహితంగా మారారు. చాన్నాళ్ల క్రితమే భర్తకు విడాకులివ్వడం, కుమార్తె ఆస్ట్రేలియా వెళ్లడంతో.. అనురాధ ఒంటరిగా ఉంటోంది. దీంతో చంద్రమోహన్ రెండేళ్ల క్రితం ఆమెను తన ఇంట్లో కింద ఉన్న రెండు పోర్షన్లలో ఒక దాంట్లోకి తీసుకు వచ్చాడు. అయితే చంద్రమోహన్ 2018 నుంచి వివిధ దఫాల్లో అనురాధ నుంచి రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తం తిరిగి చెల్లించే విషయంలో వీరి మధ్య స్పర్థలు వచ్చాయి. డబ్బు తిరిగి ఇవ్వాలంటూ ఇటీవల తీవ్రంగా ఒత్తిడి చేయడంతో ఆమెను అంతం చేయాలని చంద్రమోహన్ పథకం వేశాడు.

ఒక్కో కెమెరా ఫీడ్‌ను పరిశీలిస్తూ..

మూసీ సమీపంలో తల దొరికిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేవు. దీనితో పోలీసులు 300 మీటర్ల దూరంలో ఉన్న సీసీ కెమెరాల ఫీడ్‌ను ఆధారంగా తీసుకున్నారు. 17న ఉదయం తల లభించడంతో 16వ తేదీ ఫీడ్‌ను పరిశీలించారు. ఎలాంటి ఆధారం లభించకపోవడంతో 15వ తేదీకి సంబంధించిన దృశ్యాలు చూస్తుండగా.. ఓ వ్యక్తిని గుర్తించారు. ముఖానికి మాస్క్, తలపై టోపీ పెట్టుకుని వచ్చిన అతను.. ఆటో దిగి చేతిలో ఓ కవర్‌తో మూసీవైపు వెళ్లాడు. తిరిగొచ్చి ఆటో ఎక్కిన అతను ఎక్కడి వరకు వెళ్లడానేది ఒక్కో సీసీ కెమెరాలో ఫీడ్‌ను పరిశీలిస్తూ వెళ్లారు. ఈ క్రమంలో చైతన్యపురిలోని ఇంటికి వెళ్లడాన్ని గుర్తించారు. చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది.

13 రోజులైనా వాసన గది దాటలేదు..

ఈ నెల 15న రాత్రి అనురాధ తలను చెత్త కవర్‌లో పెట్టుకుని ఆటోలో వెళ్లి మూసీ సమీపంలో పడేశాడు. 17న ఉదయం దాన్ని చూసిన జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదైంది. ఇక హతురాలి సెల్‌ఫోన్‌ను తన వద్దే ఉంచుకున్న చంద్రమోహన్ ఆస్ట్రేలియాలోని ఆమె కుమార్తెతో అనురాధ మాదిరిగా చాటింగ్ చేస్తూ వచ్చాడు. రోజూ ఉదయం, సాయంత్రం అనురాధ పోర్షన్‌లోకి వచ్చి మృతదేహం ముక్కల మీద ఫినాయిల్, డెట్టాల్, కర్పూరం తదితరాలు చల్లి వెళ్లేవాడు. ఇలా 13 రోజుల పాటు వాసన ఆ గది దాటకుండా జాగ్రత్త పడ్డాడు. అయితే ఓ సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేసిన మలక్‌పేట పోలీసు లు చంద్రమోహన్‌ను పట్టుకున్నారు. మృతదేహం మిగిలిన ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.




శరీర భాగాలను భద్రపరిచిన ఫ్రిజ్

యూట్యూబ్‌లో చూసి.. ముక్కలు చేసి..

తన ఇంటి కింద ఉన్న పోర్షన్లలో ఒకదానిలో ఉండే కుటుంబం వేసవి సెలవుల నేపథ్యంలో ఊరికి వెళ్లింది. మరో పోర్షన్‌లో ఉంటున్న అనురాధను హత్య చేయడానికి ఇదే సరైన సమయమని చంద్రమోహన్ భావించాడు. ఈ నెల 12న మధ్యాహ్నం ఆమె వద్దకు వెళ్లి గొడవకు దిగాడు. ఇంట్లో ఉన్న కత్తితో దాడి చేసి చంపేశాడు. పోలీసులకు చిక్కకుండా మృతదేహాన్ని ఎలా మాయం చేయాలో, వాసన బయటికి రాకుండా ఏం చేయాలో.. యూట్యూబ్‌లో సెర్చ్ చేశాడు. ఆ వీడియోల ఆధారంగా.. రెండు చిన్న సైజు స్టోన్ కట్టర్లు, నాలుగు మటన్ కత్తులు, దాదాపు 40 వరకు ఫినాయిల్, డెట్టాల్, వివిధ కెమికల్ బాటిళ్లు, అగరుబత్తీలు, అత్తర్లు కొనుక్కొచ్చాడు. మొండెం నుంచి తల, కాళ్లు, చేతులు వేరుచేశాడు. కాళ్లు, చేతులు, తల ఫ్రిజ్‌లో, మొండాన్ని ఓ పెట్టెలో పెట్టి మూడు రోజుల పాటు అలానే ఉంచాడు.

కవిత షెల్ కంపెనీల నుంచి మారిషస్‌కు నిధులు

- కేజ్రీవాల్ ఫర్నిచర్ నిమిత్తం రూ.80 కోట్లు బదిలీ చేశా..
- ఢిల్లీ సీఎం ఆదేశాలతోనే జైల్లో నన్ను వేధిస్తున్నారు
- తాజా లేఖలో సుకేశ్ ఆరోపణలు



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత షెల్ కంపెనీల నుంచి మారిషస్‌లోని గ్రీన్ హస్క్ ఇండస్ట్రీస్‌కు రూ.80 కోట్లు బదిలీ చేసినట్లు ఓ మనీలాండరింగ్ కేసులో నిందితుడు సుకేశ్ చంద్రశేఖర్ ఆరోపించారు. ఢిల్లీ సీఎం కార్యాలయ నివాసం ఫర్నిచర్ నిమిత్తం ఈ సొమ్ము మూడు విడతలుగా బదిలీ చేశానని పేర్కొన్నారు. తనపై వస్తున్న కథనాలకు సంబంధించి కొన్ని వివరణలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆదేశాలతోనే జైలు అధికారులు తనని వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం సుకేశ్ తరఫు న్యాయవాది మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. కేజ్రీవాల్ ఎంత ప్రయత్నించినా తాను వెనక్కి తగ్గేది లేదని, ఫర్నిచర్‌కు సంబంధించి అన్ని బిల్లులు ఈడీ, సీబీఐలకు అందజేస్తానని స్పష్టంచేశారు. కేజ్రీవాల్ సూచన మేరకు కల్వకుంట్ల కవిత షెల్ కంపెనీ ఖాతా నుంచి మారిషస్‌లోని మంత్రి కైలాశ్ గెహ్లోత్ బంధువుల ఖాతాకు రూ.80 కోట్లు (రూ.25 కోట్లు+ రూ.25 కోట్లు + రూ.30 కోట్లు) బదిలీ చేసినట్లు చెప్పారు. ఆ సొమ్ము యూఎస్ డాలర్‌టిటిహెర్ (యూఎస్‌డీటీ), క్రిప్టో కరెన్సీల్లోకి మార్చి అబుదాబికి పంపినట్లు సుకేశ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఫేస్‌టైమ్‌లో జరిపిన చాట్‌ల స్క్రీన్ షాట్లు కూడా ఉన్నాయన్నారు. ఫోన్ ట్యాంపరింగ్ చేస్తున్నానంటూ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన తల్లికి తప్పించి మరో కాల్ చేశానని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనని, అది తప్పయితే, కేజ్రీవాల్ బహిరంగ క్షమాపణలు చెబుతారా అని లేఖలో ప్రశ్నించారు. కేజ్రీవాల్ ఎలా అవినీతికి పాల్పడ్డారో, ఏ స్థాయికి దిగజారగలరో తెలుసుకోవడానికి మరో ఎపిసోడ్ కోసం సిద్ధంగా ఉండాలన్నారు. జైలు అధికారులందరూ కేజ్రీవాల్ రాకకోసం ఎదురుచూస్తున్నారని సుకేశ్ ఎద్దేవా చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి.. అయినా అధికారంలోకి వస్తుంది

- వాగ్దానాలను అమలు చేయకపోవడంతో కొన్ని వర్గాల్లో అసమ్మతి
- 70 నుంచి 80 సీట్లు రావొచ్చు
- వామపక్షాల తోడ్పాటుతో బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు వస్తాయి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: వాగ్దానాలను అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై కొన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమే అయినా.. ఆ పార్టీనే మళ్లీ అధికారంలోకి వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభిప్రాయపడ్డారు. పదేళ్ల నుంచి అధికారంలో ఉండడం వల్ల సహజంగానే ఈ అసంతృప్తి ఉంటుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశానంతరం బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రాజకీయ బలాబలాలను సమావేశంలో అంచనా వేశామన్నారు. ప్రస్తుతానికి బీఆర్ఎస్ మొదటి స్థానంలో, కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంటాయని తమ్మినేని వివరించారు. బీఆర్ఎస్ చెప్తున్నట్టుగా వందకుపైగా సీట్లు సాధించే అవకాశం లేదనీ 70 నుంచి 80 సీట్లతో అధికారంలోకి వస్తుందని చెప్పారు. అయితే కమ్యూనిస్టుల తోడ్పాటు ఉంటే బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు వచ్చే అవకాశముందన్నారు. కేంద్ర విధానాలపై వామపక్షాలను కలుపుకొని ప్రజాఉద్యమాలను నిర్మించడంలో బీఆర్ఎస్ చొరవ చూపడం లేదని, ఈ లోపాన్ని సరిచేసుకోవాలన్నారు. కర్ణాటక ఫలితాల ప్రభావం ఇక్కడి కాంగ్రెస్‌లో తాత్కాలికమే తప్ప రాబోయే ఎన్నికల్లో ఆ ప్రభావం ఉండబోదని తమ్మినేని స్పష్టం చేశారు. జేడీఎస్ దెబ్బతినడం వల్ల అక్కడ కాంగ్రెస్ ఎక్కువ సీట్లు సాధించిందని చెప్పారు. ఆర్నెల్ల కిందటే బీజేపీ పెరుగుదల ఆగిపోయిందని వ్యాఖ్యానించారు.

అచ్యుతరామయ్య సేవలు స్ఫూర్తిదాయకం...

సీపీఎంకు, రైతు సంఘానికి, పార్టీ ఆడిట్ కమిటీకి గత 70 ఏళ్లుగా సేవలందిస్తున్న 98 ఏళ్ల అన్నె అచ్యుతరామయ్యను బుధవారం రాష్ట్ర కమిటీ కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం శాలువాతో సన్మానించారు. అచ్యుత రామయ్య వయస్సు రీత్యా బాధ్యతల నుండి రిలీవ్ అవుతున్నారు కానీ, పార్టీ నుంచి కాదని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

కమిటీల నివేదికలు రాగానే జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వపరంగా కమిటీల నివేదికలు రాగానే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) రెగ్యులరైజ్ చేస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేసేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు నివేదికలను ఇస్తాయన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ నిర్ణయం తర్వాత సీఎస్‌తో తాను, ఆర్థికమంత్రి హరీశ్‌రావు సమావేశమై, విధి విధానాలపై చర్చించినట్టు తెలిపారు. బుధవారం జేపీఎస్‌లు మంత్రిని కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జేపీఎస్‌లతో కలసి మంత్రి ఎర్రబెల్లి, సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'పీఆర్'పునర్వ్యవస్థీకరణపై కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వం పీఆర్ ఇంజనీరింగ్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించినందుకు మంత్రి ఎర్రబెల్లికి ఆ విభాగం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి ఎర్రబెల్లి వారికి సూచించారు.

మోదీ విజయాలపై యూఎస్‌లో ప్రసంగాలు

సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను అమెరికాలోని ప్రవాస భారతీయులకు బీజేపీ నేత ఎన్.రామచంద్రరావు వివరించనున్నారు. ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ ఆహ్వానం మేరకు ఆయన అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో ప్రసంగిస్తారు. ఈ నెల 30న వాషింగ్టన్ డీసీలో, 31న వర్జీనియా, మేరీలాండ్, జూన్ 1న అట్లాంటా, 2న డల్లాస్, 3న ఛార్లెట్, 4న రాలేయ్, 6న న్యూజెర్సీలో పాల్గొంటారు. రామచంద్రరావు గురువారం అర్ధరాత్రి ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్తారు.

రెండ్రోజులు సాధారణ ఉష్ణోగ్రతలే



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండ్రోజులు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాలు మినహా రాష్ట్రమంతటా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. పశ్చిమ మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, ఉత్తర కర్ణాటక మీదుగా దక్షిణ కర్ణాటక ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున కిలోమీటర్ల ఎత్తులో ఉంది. దీని ప్రభావంతో గురువారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రానికి పశ్చిమ, నైరుతి దిశల నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41డిగ్రీల సెల్సియస్ నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 38డిగ్రీల సెల్సియస్ నుంచి 41డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతుందని వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండ జిల్లా దామరచర్లలో 45.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
దామరచర్ల	నల్లగొండ	45.2
రామగుండం	పెద్దపల్లి	45.1
రంగంపల్లి	పెద్దపల్లి	45.1
మహదేవపూర్	భూపాలపల్లి	45.1
నేలకొండపల్లి	ఖమ్మం	45.0

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	42.8	28.7	మెదక్	41.2	23.2
నిజామాబాద్	42.2	30.0	మహబూబ్‌నగర్	39.9	27.0
రామగుండం	42.2	26.6	హకీంపేట్	38.8	24.3
నల్లగొండ	42.0	23.3	భద్రాచలం	39.4	27.0
హనుమకొండ	42.0	30.5	దుండిగల్	39.0	25.2
ఖమ్మం	42.0	28.6	హైదరాబాద్	39.0	26.2

ఎన్నికల డబ్బు కోసమే జీవో 111 రద్దు!

బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపణలు

- డబ్బులున్నోళ్ల కొమ్ము కాస్తూ కోర్టుల్లో కేసులు ఓడిపోతున్నారు..
- భూముల ద్వారా సంపాదించిన డబ్బులతో రాజకీయం చేస్తున్నారు
- జీవో 111 రద్దు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసేందుకు, దేశంలోనూ ఎన్నికల సందర్భంగా డబ్బు పంపిణీ నిమిత్తమే జీవో 111 రద్దుతో సీఎం కేసీఆర్ అక్రమ సంపాదనకు తెరలేపారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆరోపించారు. కేసీఆర్ వందిమాగధుల ఆస్తుల సంపాదనకు, ఆయనకు డబ్బులిచ్చే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం చేకూర్చడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. హైదరాబాద్ మహానగర పర్యావరణ వ్యవస్థను దెబ్బతీసి, నగరాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చేసి, వరదలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈటల బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు.

భూముల్ని కాపాడాల్సిన వారే..

జీవో 111 పరిధిలో 18 వేల ఎకరాల అసైన్డ్ భూములున్నాయని ఈటల చెప్పారు. దళితులకు ఇస్తామన్న మూడెకరాలు ఇవ్వలేదు కానీ.. హైదరాబాద్ శివార్లలో 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 5,800 ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుని 300-400 గజాల ప్లాట్‌లు మాత్రం ఇస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న భూములతో డబ్బులు సంపాదించవచ్చునని కేసీఆర్ గుర్తించడంతోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు. మియాపూర్ భూ కుంభకోణం ఏమైంది? కూకట్‌పల్లి ఎల్లమ్మ బండ భూముల కేసు సర్కార్ ఎందుకు ఓడిపోయింది? అని ప్రశ్నించారు. చట్టాన్ని, భూములను కాపాడాల్సిన ప్రభుత్వం డబ్బులు ఉన్నవారికి కొమ్ము కాస్తూ కోర్టులలో కేసులు ఓడిపోతోందని ఆరోపించారు. భూముల ద్వారా సంపాదించిన డబ్బుల్నే పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు, తన లాంటి వారిని ఓడించేందుకు ఖర్చు పెడుతున్నారని, ఇతర రాష్ట్రాల్లో రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదలకు ఒక్క గజం కూడా ఇవ్వడం లేదు..

కాళేశ్వరంలో నీళ్ళు ముందే నింపిపెడితే.. వర్షాకాలంలో వచ్చిన వరదలకు కాళేశ్వరం నుండి ఎల్లంపల్లి వరకు పొలాలు మునిగిపోయాయని ఈటల విమర్శించారు. జీవో 111 రద్దుతో జంట జలాశయాలను నిర్లక్ష్యం చేస్తే హైదరాబాద్ కూడా మునిగిపోతుందని హెచ్చరించారు. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం లక్షలాది ఇళ్లు నిర్మించి ఇస్తుంటే, కేసీఆర్ సర్కార్ మాత్రం డబుల్ బెడ్‌రూమ్‌లతో సహా, పేదలు సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు ఒక్క గజం జాగా కూడా ఇవ్వడం లేదని చెప్పారు. దీనిని నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ధరణిలో తప్పులు సరిదిద్దేందుకు 18 లక్షల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే ఇప్పటికీ పరిష్కారం లభించలేదని విమర్శించారు.

అధ్యక్షుడి మార్పు అధిష్టానం చూసుకుంటుంది

ఎన్నికల ఏడాదిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు విషయంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకోవాలో ఆ నిర్ణయం తీసుకుంటుందని ఒక ప్రశ్నకు ఈటల బదులిచ్చారు. బండి సంజయ్ తన శక్తి మేరకు పని చేస్తున్నారని, అయితే పార్టీ ఇంకా విస్తరించడంతో పాటు కొత్తవాళ్లు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కర్ణాటకలో గెలవగానే కాంగ్రెస్ దేశమంతా గెలుస్తుందా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముందు తన పార్టీని, నాయకులను కాపాడుకోవాలని సూచించారు.

భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కారు

- నిర్వాసితులపై బెదిరింపులు.. కక్ష సాధింపు చర్యలా?
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి
- నేడు జడ్చర్లలో భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న హిమాచల్ సీఎం సుఖ్వీందర్, ఠాక్రే, రేవంత్ తదితరులు



ఉదండాపూర్ బాధితుల గోడు వింటున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసే గ్రామాల్లో కుటుంబ వ్యవస్థ దెబ్బతినకుండా సామాజిక బాధ్యతతో ప్రభుత్వాలు వ్యవహరించాలి. కానీ ఉదండాపూర్‌లో ఇందుకు భిన్నంగా బీఆర్ఎస్ సర్కారు అంతా అడ్డగోలుగా చేస్తోంది. 2013 భూసేకరణ చట్టాన్ని పూర్తిగా తుంగలో తొక్కింది.'అని కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం 69వ రోజుకి చేరుకుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌ను భట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు తీసుకోవాలని కోరిన ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులపై బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు, అధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. చట్టం అమలు చేయాలని కోరిన రైతుల భూమిని ప్రొహిబిటెడ్ లిస్టులో పెడుతున్నారని విమర్శించారు. కోర్టు ఆర్డర్ ఉన్న భూముల్లో పనిచేయొద్దని కోరుతున్న నిర్వాసితులను అధికారులు తిప్పించుకుంటున్నారని, కలెక్టర్ సైతం ఎమ్మెల్యే వద్దకు వెళ్లమని చెప్పడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు., సాగునీటి ప్రాజెక్టులకు భూములు తీసుకున్నప్పుడు భూమికి భూమి ఇవ్వాలన్న నిబంధన ఉందని.. పేదల నుంచి భూములు తీసుకుంటున్నప్పుడు వారి భూమికి భూమి ఎందుకు ఇవ్వరని భట్టి ప్రశ్నించారు.

మేం వ్యతిరేకం కాదు.. గడువులోగా పూర్తి చేయాలి..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా సాగునీళ్లు ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా భ్రమలు కల్పించిందని భట్టి విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరిగే విధంగా ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని.. ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతోపాటు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు జడ్చర్లలో భారీ బహిరంగ సభ

పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం జడ్చర్ల పట్టణం సిగ్నల్‌గడ్డలోని డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్‌తో పాటు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

టెండర్ ధరలో 10% చెల్లించలేని ఐఆర్‌బీకి ఓఆర్ఆర్!

- నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థకే వంత పాడుతున్న కేటీఆర్
- అక్రమ సొమ్ముతో పెట్టుబడులు పెట్టడానికే కేటీఆర్ విదేశీ పర్యటనలు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: నిబంధనల మేరకు 10 శాతం అడ్వాన్స్ నిధులు కూడా చెల్లించలేని ఐఆర్‌బీ సంస్థకు కీలకమైన ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టెండర్ ఎలా ఇస్తారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి నిలదీశారు. తక్షణమే ఈ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్ల కాలానికి ఓఆర్ఆర్ టెండర్‌ను రూ.7,388 కోట్లకు దక్కించుకున్న ఐఆర్బీ లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చిన 30 రోజుల్లో చెల్లించాల్సిన 10 శాతం అడ్వాన్స్ రూ.738 కోట్ల కోసం గడువు కోరుతోందని ఆరోపించారు. ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంస్థపై చర్యలు తీసుకోకుండా దానికి అనుకూలంగా ఉండేలా అధికారులపై మంత్రి కేటీఆర్ ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి బుధవారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ పర్యవేక్షణలో ఓఆర్ఆర్‌ను ముంబైకి చెందిన ఐఆర్బీకి తెగనమ్మారని ఆరోపించారు. లక్ష కోట్ల విలువైన ఓఆర్ఆర్ ప్రాజెక్టును 7 వేల కోట్లకే దక్కించుకున్న సంస్థ 10 శాతం నిధులు చెల్లించేందుకు తమ దగ్గర నిధులు లేవని, 120 రోజుల సమయం కావాలని హెచ్ఎండీఏకు లేఖ రాసిందన్నారు. ఇటీవలి కాలంలో వివిధ నిర్ణయాలు విమర్శలపాలు కావటంతో అర్వింద్ కుమార్ సంతకాలు పెట్టడానికి సంశయిస్తుంటే.. ఐఏఎస్ అధికారి సంతోష్ స్థానంలో హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా పని చేసి రిటైరైన బీఎల్ఎన్ రెడ్డిని హెచ్‌జీసీఎల్ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్) ఎండీగా తీసుకొచ్చి సంతకాలు చేయించారని ఆరోపించారు. గతంలో ఇదే అధికారి తెల్లాపూర్‌లో రూ.10 వేల కోట్ల విలువ చేసే 400 ఎకరాల భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని, అప్పటి నుంచి కేటీఆర్, బీఎల్ఎన్ రెడ్డి మధ్య బంధం బలపడిందని మండిపడ్డారు.

సింగపూర్ వెళ్లినప్పుడు ఎక్కడున్నారు..?

భారీగా సంపాదించిన అక్రమ సొమ్ముతో పెట్టుబడులు పెట్టడానికే కేటీఆర్ విదేశీ పర్యటనలు చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. కేటీఆర్ సింగపూర్ వెళ్లినప్పుడు తేజరాజు, రాజేష్‌రాజులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఆ వివరాలను ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పెట్టుబడుల కోసం యూకే, యూఎస్ పర్యటనలకు అంటూ కేటీఆర్ చెబుతున్న మాటలు అవాస్తవాలన్నారు. ఐఆర్‌బీ సంస్థకు టెండర్ ఇవ్వగానే సింగపూర్ కంపెనీ వచ్చిందని, ఆ తరువాత షెల్ కంపెనీలు ముందుకొస్తాయని చెప్పారు. షెల్ కంపెనీల వెనక ఉన్న రాజులు ఎవరో.. యువరాజులు ఎవరో తేలాలని డిమాండ్ చేశారు. టెండర్‌లో జరిగిన అవినీతిపై కాగ్, సెంట్రల్ విజిలెన్స్, ప్రధాని, హోం మంత్రికి ఫిర్యాదు చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంత దోపిడీ జరుగుతున్నా బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

క్లుప్తంగా...

1,061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను వైద్య ఆరోగ్యశాఖ భర్తీ చేసింది. ఈ మేరకు వారందరికీ నియామకాలను ఖరారు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీ జోన్-1, మల్టీ జోన్-2లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో భర్తీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టింది. జాబితా విడుదల అనంతరం ఖాళీల వారీగా పోస్టులను భర్తీ చేసి ఆయా కళాశాలలకు కేటాయించింది. 1,442 పోస్టులకు 1,061 మందికే పోస్టింగ్‌లు ఇచ్చారు. పరిశీలనలో మిగిలిన అభ్యర్థులు అర్హత సాధించలేదని వైద్య వర్గాలు వెల్లడించాయి.

వైభవోపేతంగా 'దశాబ్ది ఉత్సవాల' ప్రారంభ వేడుక



సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయం ప్రాంగణంలో తొలి కార్యక్రమంగా...తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను కోరారు. వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో బుధవారం డీజీపీ అంజనీ కుమార్ తో కలసి ఆమె ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయం, రాజ్‌భవన్, అసెంబ్లీ, చార్మినార్, క్లాక్ టవర్ ఇతర ముఖ్య భవనాలను 21 రోజులపాటు విద్యుద్దీపాలతో, గన్ పార్కులోని అమరవీరుల స్తూపాన్ని పుష్పాలతో అలంకరించాలని కోరారు.

బీసీ బంధు పథకం ప్రవేశ పెట్టాలి: ఆర్. కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విధంగా 'బీసీ బంధు పథకం' ప్రవేశపెట్టి ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కలిసి బీసీల సమస్యలపై చర్చించారు. అనంతరం బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఇటీవల 5 కులాలకు ప్రకటించిన లక్ష రూపాయల పథకాన్ని బీసీ జాబితాలోని 130 కులాలకు వర్తింప చేయాలని అన్నారు. బీసీల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి గంగుల ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

'టీఎస్‌పీఎస్సీ లీకేజ్' కేసులో మరో ముగ్గురు అరెస్టు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పోటీ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజ్ కేసులో సిట్ అధికారులు బుధవారం మరో ముగ్గురిని అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 39కి చేరింది. లీకేజ్ వ్యవహారంలో సూత్రధారులుగా ఉన్న కమిషన్ మాజీ ఉద్యోగులు పులిదిండి ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి ద్వారా అనేక ప్రశ్న పత్రాలు ఒకప్పుడు కమిషన్‌లో పని చేసిన వీరి స్నేహితుడు సురేష్‌కు చేరాయి. ఇతగాడు వీటిలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పేపర్లను తన అపార్ట్‌మెంట్‌లో నివసించే వారికి మధ్యవర్తి ద్వారా విక్రయించాడు. ఈ వ్యవహారంలో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పూల రవికిశోర్ మధ్యవర్తిగా వ్యవహరించాడు. ఏఈ పేపర్‌ను తన సమీప బంధువైన కారు డ్రైవర్ రాయపురం విక్రమ్‌కు, డీఏఓ పేపర్ అతని సోదరి రాయపురం దివ్యకు అమ్మాడు. సాంకేతిక ఆధారాలు గుర్తించిన సిట్ పోలీసులు బుధవారం మధ్యవర్తి రవి కిశోర్‌తో పాటు అభ్యర్థులు దివ్య, విక్రమ్‌లను అరెస్ట్ చేశారు.

రాష్ట్రంలో పదేళ్ల అభివృద్ధిపై దేశవ్యాప్త చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ...తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో అభివృద్ధిపై ప్రజలందరూ సంబరాలు ఊరువాడ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్, మంత్రి తలసాని ఆధ్వర్యంలో జూన్ 9 నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. గొర్రెల పంపిణీ పట్ల యాదవ, కురుమల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

హైదరాబాద్‌లో 'స్టెమ్ సెల్' ల్యాబ్!

- తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు స్టెమ్ సెల్ థెరపీతో పరిష్కారం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: లైఫ్ సైన్సెస్ రంగంలో దేశంలోనే అతి పెద్ద స్టెమ్ సెల్ తయారీ ప్రయోగశాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు 'స్టెమ్ క్యూర్స్ కంపెనీ'ప్రకటించింది. సుమారు 54 మిలియన్ డాలర్ల (సుమారు రూ.440 కోట్లు) పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ తయారీ యూనిట్‌తో 150 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్‌తో స్టెమ్ క్యూర్స్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిరాం అట్లూరి బోస్టన్ నగరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అత్యంత తీవ్రమైన వైద్య, ఆరోగ్య సమస్యలకు స్టెమ్ సెల్ థెరపీతో పరిష్కారం లభిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అత్యాధునిక చికిత్సా విధానాలు మన దేశంలో విస్తృతంగా అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కాగా ప్రపంచ వైద్య ఆవిష్కరణలకు తన సొంత నగరమైన హైదరాబాద్ హబ్‌గా మారిందంటూ సాయిరాం సంతోషం వ్యక్తం చేశారు.

నల్లగొండలో సొనాటా కార్యకలాపాలు

నల్లగొండలో ప్రారంభం కానున్న ఐటీ టవర్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సొనాటా సాఫ్ట్‌వేర్ ముందుకు వచ్చింది. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ పరిశ్రమను విస్తరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఈ ఐటీ టవర్‌లో సొనాటా సాఫ్ట్‌వేర్ 200 ఉద్యోగాలు కల్పిస్తుంది. బోస్టన్‌లో మంత్రి కేటీఆర్‌తో భేటీ సందర్భంగా సొనాటా సాఫ్ట్‌వేర్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు శ్రీని వీరవెల్లి ఈ మేరకు ప్రకటన చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్‌నాథ్‌రెడ్డి ఇందుకూరి తదితరులు భేటీలో పాల్గొన్నారు.



సౌత్ కరోలినా గవర్నర్ నిక్కీ హేలీకి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి కేటీఆర్


నగరానికి ఫ్లూమ్, సనోఫీ, పై హెల్త్

కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రొవైడర్స్ (సీఎస్‌పీ), వారి సబ్‌స్క్రైబర్లకు సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) అనుభూతిని కలిగించిన వేదిక 'ఫ్లూమ్'హైదరాబాద్‌లో వంద మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించనుంది. జయేశ్ రంజన్‌తో ఫ్లూమ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిరణ్ ఈదర భేటీ సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. అంతర్జాతీయ ఫార్మా సంస్థ సనోఫీ 350 ఉద్యోగులతో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో సమగ్ర కేన్సర్, పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కేటీఆర్‌తో భేటీ సందర్భంగా 'పై హెల్త్'సహ వ్యవస్థాపకులు డాక్టర్ బాబీ రెడ్డి ప్రకటించారు.

నిక్కీ హేలీతో కేటీఆర్ భేటీ

ఐక్యరాజ్య సమితి మాజీ రాయబారి, సౌత్ కరోలినా గవర్నర్ నిక్కీ హేలీతో కేటీఆర్ భేటీ అయ్యారు. భారత్, యూఎస్ సంబంధాల్లో హైదరాబాద్, తెలంగాణకు ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యతపై చర్చించారు. ఆర్థిక, ఎన్నికలకు సంబంధించిన అంశాలపైనా లోతుగా చర్చించడంతో పాటు అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్న నిక్కీ హేలీని మంత్రి అభినందించారు.

ఈ కాల్స్‌తో జాగ్రత్త..!



- +254, +84, +63, +374...తో ప్రారంభమయ్యే నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్, మెసేజ్‌లతో జరభద్రం
- ఆ మెసేజ్‌లు నమ్మవద్దంటున్న సైబర్ నిపుణులు
- ఆ నంబర్లతో కాల్స్, మెసేజ్ లింకులతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ మోసగాళ్లు..

సాక్షి, హైదరాబాద్: వాట్సాప్ వాడకం పరిపాటిగా మారింది. ఇప్పుడు వాట్సప్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. అంతర్జాతీయ ఫోన్ నంబర్ల నుంచి స్పామ్ కాల్స్, మెసేజీలు చేస్తూ మోసాలకు తెరతీస్తున్నారు. ప్రధానంగా +254, +84, +63, +374 , +1(218), +1(803) ...తో ప్రారంభయ్యే నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్, మెజేస్‌లు నమ్మవద్దంటున్న సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నంబర్ల నుంచి వచ్చే మిస్డ్‌కాల్స్‌కు సైతం స్పందించవద్దని వారు సూచిస్తున్నారు. స్పామ్ కాల్స్‌తో సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి బ్యాంకు ఖాతా వివరాలు సేకరిస్తున్నారని, తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. అదేవిధంగా విదేశీ కోడ్‌తో ఉంటున్న ఈ నంబర్ల నుంచి వస్తున్న వాట్సాప్ సందేశాల్లో లింక్‌లను పంపుతున్న సైబర్ కేటుగాళ్లు వాటిపై క్లిక్ చేస్తే మన ఫోన్‌లోకి మాల్‌వేర్‌ను పంపించి, మన ఫోన్‌ను వారి కంట్రోల్‌కి తీసుకుంటున్నారు. దాని నుంచి మన బ్యాంకు లావాదేవీల వివరాలు, పాస్‌వర్డ్‌లు చోరీ చేసి డబ్బులు కొల్లగొడుతున్నట్టు వారు హెచ్చరించారు. ఇలాంటి కోడ్ నంబర్‌తో వచ్చే వాట్సాప్ కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని, అలాంటి నంబర్లను బ్లాక్ చేయడంతోపాటు పోలీసులకు సమాచారం అందించాలని కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) సూచించింది.

సింగపూర్, వియత్నాంల నుంచి ఆ ఫోన్లు

ప్రధానంగా ఈ ఫోన్ కాల్స్ సింగపూర్, వియత్నాం, మలేషియా ప్రాంతాల నుంచి వస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ తరహా నంబర్ల నుంచి వాట్సాప్ కాల్స్ ఎక్కువగా ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య, లేదంటే తెల్లవారుజామున వస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ తరహా స్పామ్‌కాల్స్ బెడద నుంచి కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే బయటపడొచ్చని సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ప్రసాద్ తెలిపారు.

ఈ జాగ్రత్తలు మరవొద్దు..

- → కొత్త కొత్త కోడ్ నంబర్లలో వచ్చే అంతర్జాతీయ ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దు.
- → అనుమానాస్పదంగా ఉండే అంతర్జాతీయ ఫోన్ నంబర్లను వెంటనే బ్లాక్ చేయాలి.
- → ఫోన్‌కాల్, లేదా చాటింగ్‌లో మన వ్యక్తిగత, బ్యాంకు ఖాతా సమాచారాన్ని, అడిగితే పంచుకోవద్దు.
- → సైబర్ క్రైం పోలీసులకు లేదా సైబర్ క్రైం వెబ్‌సైట్‌లో సంబంధిత నంబర్లపై ఫిర్యాదు చేయాలి.
- → మొబైల్‌ఫోన్, కంప్యూటర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, యాంటి వైరస్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

వాటినిబ్లాక్ చేయాలి..

మనకు కొత్త కొత్త కోడ్ నంబర్లతో వచ్చే స్పామ్ కాల్స్‌ను ఎప్పటికప్పుడు బ్లాక్ చేయాలి. పదేపదే ఇలాంటి కాల్స్ వస్తుంటే ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైం సిబ్బంది దృష్టికి తేవాలి. అదేవిధంగా వాట్సాప్‌లో ఇతర దేశాల కోడ్ నంబర్లతో మొదలయ్యే నంబర్ల నుంచి వచ్చే వీడియో, ఆడియోకాల్స్‌కి ఆన్సర్ చేయవద్దు. ఆ నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లో ఉండే లింక్‌లను ఓపెన్ చేయవద్దు.

\- శ్రీనివాస్ , ఇన్‌స్పెక్టర్

బైడెన్‌ను హత్య చేసి అధ్యక్షుడినవుతా!

- వైట్‌హౌజ్ కంచెను ట్రక్కుతో ఢీకొట్టిన కందుల సాయివర్షిత్
- అమెరికాలో తెలుగు సంతతి యువకుడి అరెస్టు



వైట్‌హౌజ్ కంచెను ఢీకొట్టిన ట్రక్కు

వాషింగ్టన్: మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉందో లేదో గానీ అమెరికాలో తెలుగు సంతతి యువకుడు కందుల సాయివర్షిత్ అధ్యక్షుడు జో బైడెన్ హత్యకు పన్నాగం పన్ని, కలకలం సృష్టించాడు. బైడెన్‌ను హత్య చేసి, అధ్యక్ష పదవిని దక్కించుకోవడమే తన లక్ష్యమని అతడు చెప్పడంతో పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. సాయివర్షిత్ మాటల్లో నిజమెంత? అతడి వెనుక ఎవరున్నారు? అనేది తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానిక మీడియా కథనం ప్రకారం.. మిస్సోరీలోని చెస్టర్‌ఫీల్డ్‌లో నివసించే సాయివర్షిత్(19) సోమవారం సెయింట్ లూయిస్ నుంచి విమానంలో రాజధాని వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు. యూ-హాల్ అనే సంస్థ నుంచి ట్రక్కును అద్దెకు తీసుకున్నాడు. ట్రక్కును నడుపుతూ వైట్‌హౌజ్ వద్దకు చేరుకొని, రాత్రి 10 గంటల సమయంలో వైట్‌హౌజ్ తూర్పు వైపున సెక్యూరిటీ కంచెను రివర్స్‌లో రెండుసార్లు ఢీకొట్టాడు. ఈ కంచె వైట్‌హౌస్ గేటుకు సమీపంలోనే ఉంది. ట్రక్కు వేగం ధాటికి కంచె ధ్వంసమయ్యింది. దీంతో జనం పరుగులు తీశారు. ఎవరూ గాయపడలేదు. వెంటనే భద్రతా సిబ్బంది సాయివర్షిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. హే-ఆడమ్స్ హోటల్‌ను ఖాళీ చేయించారు.

అడ్డొచ్చేవారిని చంపడమే లక్ష్యం

సాయివర్షిత్‌ను పోలీసులు విచారించగా, దిమ్మతిరిగే విషయాలు వెల్లడయ్యాయి. జో బైడెన్‌ను హతమార్చి, అమెరికా పాలనను తన చేతుల్లోకి తీసుకోవడానికి ఆరు నెలల క్రితమే ప్రణాళిక సిద్ధం చేశానని చెప్పాడు. తన మొత్తం ప్లాన్ 'గ్రీన్‌బుక్'లో ఉందని వెల్లడించాడు. తన మార్గానికి అడ్డొచ్చేవారిని చంపడమే తన లక్ష్యమని వివరించాడు. సాయివర్షిత్‌పై కేసు నమోదు చేయడంతోపాటు 1,000 డాలర్ల విలువైన అమెరికా ఆస్తిని(సెక్యూరిటీ కంచె) ధ్వంసం చేశాడని అభియోగం మోపారు. అతడి వద్దనున్న సంచిలో స్వస్తిక్ గుర్తు ఉన్న నాజీ జెండా లభించింది. ఆ జెండాను ఆన్‌లైన్‌లో కొన్నానని, నాజీలకు గొప్ప చరిత్ర ఉందని, వారిని ఆరాధిస్తానని, హిట్లర్ బలమైన నాయకుడని సాయివర్షిత్ విచారణలో బదులిచ్చాడు. అతడి మానసిక ఆరోగ్యం సరిగ్గా లేకపోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతడికి గతంలో ఎలాంటి నేరచరిత్ర లేదని గుర్తించారు.

నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు

- ఎజెండాలో దశాబ్ది ఉత్సవాలు, హరితహారం, పోడు పట్టాలు, ఇళ్ల స్థలాల పంపిణీ
- ఇతర అంశాలను సైతం సమీక్షించనున్న సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయంలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు గురువారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సదస్సు నిర్వహించనున్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, హరితహారం, గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ తదితర అంశాలపై సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలకు పరిష్కారం, వానాకాలం పంటల సాగు, ఎరువులు, విత్తనాల పంపిణీ, నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం, వానాకాలం పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీగా రైతుబంధు పంపిణీ తదితర అంశాలను సీఎం కేసీఆర్ సమీక్షించి కీలక ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. కాగా, కొత్త సచివాలయంలో ఇదే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో తొలి సదస్సు కావడం గమనార్హం.

కోటిన్నర ఎకరాల్లో పంటల సాగు

- వ్యవసాయ శాఖ వానాకాలం పంటల ప్రణాళిక ఖరారు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ పంటల ప్రణాళికను ఖరారు చేసింది. ఇందులో భాగంగా కోటిన్నర ఎకరాల్లో పంటలు సాగయ్యేలా చూడాలని నిర్ణయించింది. అత్యధికంగా 60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాలని ప్రతిపాదించింది. ఇక 55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని వ్యవసాయశాఖ రైతులకు పిలుపునిచ్చింది. కంది, మొక్కజొన్న 8 లక్షల ఎకరాల చొప్పున, సోయాబీన్ 5 లక్షల ఎకరాలు, పెసర లక్ష ఎకరాలు, మినుములు 50 వేల ఎకరాల్లో సాగును ప్రతిపాదించారు. మొత్తం సాగుకు ప్రతిపాదించిన కోటిన్నర ఎకరాల్లో 10 లక్షల ఎకరాలు ఉద్యాన పంటలున్నాయని వ్యవసాయ శాఖ తెలిపింది. గతేడాది 1.46 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని వెల్లడించింది.

18.47 లక్షల క్వింటాళ్ల విత్తనాలు..

ఉద్యాన పంటలను మినహాయించి చూస్తే 1.40 కోట్ల ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలు సాగవుతాయి. అందుకోసం 18.47 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని వ్యవసాయశాఖ పేర్కొంది. విత్తనాలకు కొరత లేదని, 1.82 కోట్ల ఎకరాలకు సరిపడా 22.50 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

అకాల వర్షాల నుంచి బయటపడేలా ముందస్తు నాట్లు..

ఈ ఏడాది యాసంగిలో రెండు దఫాలు పెద్ద ఎత్తున అకాల వర్షాలు రావడంతో లక్షలాది ఎకరాల పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో వానాకాలం, యాసంగి సీజన్లను ముందుకు జరపడం వల్ల నష్టాన్ని నివారించవచ్చని భావిస్తున్న ప్రభుత్వం ఆ మేరకు చర్యలు చేపట్టింది. సీజన్‌ను ముందుకు జరపడంతో పాటు తక్కువ కాలపరిమితి కలిగిన విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని, అకాల వర్షాలు, వడగళ్లను తట్టుకునే రకాలను రైతులకు ఇవ్వాలని నిర్ణయించింది. ఎక్కువ సమయం తీసుకునే పంట రకాలను ప్రోత్సహించకూడదని ప్రభుత్వం భావిస్తోంది. 135 రోజుల మధ్యస్థం, 125 రోజుల తక్కువ కాలపరిమితి వెరైటీలను రైతులు వేసుకోవాలని సూచించింది. కాగా, ఐదు రకాల మధ్యస్థ కాల పరిమితి కలిగిన వరి వంగడాలు, స్వల్పకాలిక వ్యవధి కలిగిన 10 రకాల వరి వెరైటీలను వేసుకోవాలని రైతులకు సూచించింది. వానాకాలంలో జూన్ 10-20వ తేదీల మధ్య నారు వేయాలని చెప్పింది. ఈ మార్పులవల్ల ఇబ్బందులు ఉండవని పేర్కొంది. అలాగే యాసంగిలో స్వల్పకాలిక రకాలను మాత్రం వేయాలని స్పష్టం చేసింది. వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయాలని సూచించింది. యాసంగిలో నవంబర్ 15 నుంచి డిసెంబర్ 10 మధ్య నార్లను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

ప్రపంచానికి విత్తన భాండాగారం.. తెలంగాణ

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



విత్తనాలను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఏజీవర్సిటీ (హైదరాబాద్)/ సాక్షి, నాగర్ కర్నూల్: నూతన రాష్ట్రం తెలంగాణ ప్రపంచానికి విత్తన భాండాగారంగా నిలవబోతోందని ఇది నూతన హరిత విప్లవమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫె సర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విత్తన మేళా-2023ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికీ రాష్ట్రం కొన్ని విత్తనాలను దిగుమతి చేసుకుంటోందని.. భవిష్యత్తులో దీన్ని అధిగమించాలన్నారు. తెలంగాణ ప్రాంతం విత్తనోత్పత్తికి అనుకూలమైందని, రైతాంగం ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణలో తయారయ్యే విత్తనాలకు ఇతర ప్రాంతాలలో విపరీతమైన ఆదరణ ఉందని, భవిష్యత్తులో తెలంగాణ ప్రపంచానికంతటికీ విత్తనాలు సరఫరా చేసే స్థితికి చేరుకోవాలని మంత్రి సూచించారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వినియోగం తగ్గించి భూసారాన్ని పరిరక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆహార శుద్ధి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టిందని వివరించారు.

యాసంగి పంట కాలం ముందుకు

- మంత్రివర్గ ఉపసంఘంలో చర్చ
- లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: యాసంగి పంట కాలాన్ని ముందుకు జరిపేందుకు ఏ రకమైన విధానాలు అవలంబించాలన్న దానిపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. దీనిపై లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించింది. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డిలు హాజరయ్యారు. యాసంగి పంట కాలం మూడు నుంచి నాలుగు వారాలు ముందుకు జరిపి అకాల వర్షాల నుంచి రైతులు పంట నష్ట పోకుండా కాపాడడం, మార్చి నెలాఖరు వరకు యాసంగి పంట కోతలు పూర్తయ్యేలా రైతులను చైతన్యం చేయడం వంటి అంశాలపై ఇందులో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాకతో వ్యవసాయ రంగ స్వరూపం మారిపోయిందని, సాగు నీరు, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా, ధాన్యం కొనుగోళ్లతో రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగిందని తెలిపారు. కానీ యాసంగి వరి కోతలు ఆలస్యమై అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని, ఇది రైతుకే కాదు ప్రభుత్వానికీ నష్టమేనని చెప్పారు. యాసంగి సాగులో యాజమాన్య పద్ధతులు, తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి ఇచ్చే వరి రకాల సాగు, ఇతర అంశాలపై చర్చ జరిగిందన్నారు. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు, నిపుణులు, అధికారులతో మంత్రివర్గ ఉప సంఘం చర్చించిందని, మరింత అధ్యయనం చేసి తదుపరి సమావేశంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించామన్నారు.

రెవె'న్యూ' ప్రాబ్లమ్!

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన సమాచారం ఇచ్చేది వీఆర్‌ఏలే. ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలకు సంబంధించిన వసతుల కల్పన బాధ్యత కూడా వీరిదే. పదో తరగతి నుంచి అన్ని స్థాయిల్లోని పరీక్షలకు సంబంధించి పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాట్లు చేస్తుంటారు. ప్రకృతి విపత్తులు, పంట నష్టం, శాంతిభద్రతలు, అగ్ని ప్రమాదాలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం కోసం వీఆర్‌ఏలపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఎన్నికల (పోలింగ్) ప్రక్రియలో సైతం తెరవెనుక పనిచేస్తుంటారు. పోలింగ్ స్టేషన్ల గుర్తింపు నుంచి ఆయా స్టేషన్లలో వసతుల కల్పన, పోల్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ బాక్సుల పర్యవేక్షణ (స్ట్రాంగ్ రూంలకు తరలించేంతవరకు) చేసేది వీఆర్‌ఏలే.

గ్రామాల్లో 'ప్రభుత్వ ప్రతినిధి'!

ఇక గ్రామాల్లో హత్యలు జరిగినప్పుడు, గుర్తుతెలియని మృతదేహాలు కనిపించినప్పుడు, దోపిడీలు, ఆత్మహత్యల్లాంటి ఘటనలు జరిగినప్పుడు వీఆర్‌ఏలే పోలీసులకు ప్రాథమిక సమాచారం అందిస్తారు. గంజాయి రవాణా, స్మగ్లింగ్ లాంటి ఘటనలు జరిగినప్పుడు సాక్ష్యాలు బలంగా ఉండేలా పోలీసులు నిర్వహించే పంచనామాలో సాక్షులుగా (పంచ్) వ్యవహరిస్తుంటారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమల్లోనూ కీలక పాత్ర పోషిస్తారు. వీటితో పాటు 56 రకాల రెవెన్యూ విధులను వీరు నిర్వహిస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వం తరఫున గ్రామాల్లో ఉండే వ్యక్తి వీఆర్‌ఏ. అలాంటి వీఆర్‌ఏలను ఇతర శాఖల్లోకి పంపిస్తే రెవెన్యూ శాఖ పునాదులు కదలడం ఖాయమని, ఆ వ్యవస్థ మనుగడే కష్టసాధ్యమవుతుందనే అభిప్రాయం రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇతర శాఖలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. వీరి నిష్క్రమణ కారణంగా ఎదురయ్యే సమస్యలకు గ్రామస్థాయిలో పరిష్కారమే ఉండదని అంటున్నారు. ఇంతటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వీరిని.. ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే విషయంలో ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం దీనిపై మౌనం పాటిస్తున్నారు.

వీఆర్‌ఏల గణాంకాలివీ..

- మొత్తం రెవెన్యూ గ్రామాలు: 10,416
- మొత్తం వీఆర్‌ఏ పోస్టుల సంఖ్య: 23,046
- విధుల్లో ఉన్న వీఆర్‌ఏలు: 21,434
- డిగ్రీ, ఆపైన చదువుకున్నవారు: 2,909
- ఇంటర్ విద్యార్హతలున్నవారు: 2,343
- పదో తరగతి చదివినవారు: 3,756
- పదో తరగతిలోపు చదువుకున్నవారు: 7,200
- నిరక్షరాస్యులు: 5,226

వారు వెళితే కష్టమే..

వీఆర్‌ఏల జీవితాల్లో వెలుగులు నింపేలా వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. అయితే వారికి పేస్కేల్ ఇచ్చి రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని కోరుతున్నాం. అలా కాకుండా వారిని ఇతర శాఖల్లోకి బదలాయిస్తే.. క్షేత్రస్థాయిలో పనిచేసే వారుండరు. రెవెన్యూ పాలనే కాదు.. ఇతర శాఖల పరిధిలోని సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలు కూడా కష్టతరమవుతుంది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారు.

\- కె.గౌతమ్‌కుమార్, ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మిల్లర్లు సహకరించకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు ధాన్యం

- అధికారులకు మంత్రి గంగుల ఆదేశాలు
- ధాన్యం సేకరణపై కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి గంగుల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోందని, ఈ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం అన్‌లోడింగ్ సమస్య ఉత్పన్నం కాకుండా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం విక్రయాల కోసం రైతులు రోడ్లపైకి రాకుండా చూడాలని, మిల్లుల వద్ద స్టోరేజీ లేని చోట, మిల్లులు సహకరించని చోట తక్షణమే ఇంటర్మీడియట్ గోడౌన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాల వారీగా అవసరమైన చోట ఇంటర్మీడియట్ గోడౌన్లలో మిల్లర్లతో సంబంధం లేకుండా అన్‌లోడింగ్ చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని స్పష్టం చేశారు. రైతులు కేంద్రం నిర్దేశించిన ఎఫ్‌ఏక్యూ ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా అవగాహన పెంపొందించాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్‌ఏక్యూ ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలని, తాలు, తరుగు సమస్య ఉత్పన్నం కాకూడదన్నారు. పక్క రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు లేనందున అక్కడి ధాన్యం తెలంగాణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కోసం అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను ఎంచుకొని, అవసరమైన చోట స్థానిక ట్రాక్టర్లను సైతం వాడుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర సరిహద్దులకు సమీపంలోని జగ్గయ్యపేట, రాయ్ చూర్, బీదర్ తదితర ప్రాంతాల్లో సైతం ఇంటర్మీడియట్ గోదాంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, కమిషనర్ అనిల్ కుమార్, జీఎంలు రాజారెడ్డి, శ్రీనివాసరావులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



చట్టాలు సాలెగూళ్ల లాంటివి. పెద్ద ఈగలు వాటి గుండా వెళ్లిపోతాయి. చిన్నవి దొరికిపోతాయి.
– హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 25 మే 2023

వరస తప్పిన ముఖ్యమైన లెక్క

దేశ జనన, మరణాల రిజిస్టర్‌ను ఓటర్ల జాబితాతో అనుసంధానించేలా త్వరలోనే పార్లమెంట్‌లో ఒక బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర సర్కార్ యోచిస్తోంది. దేశ పౌరులెవరికైనా సరే 18 ఏళ్ళు నిండగానే వారి పేరు ఓటర్ల జాబితాలో చేరిపోయేలా ఆ బిల్లుతో వీలు కల్పించాలని భావిస్తోంది. సోమవారం ఢిల్లీలో భారత జనగణన కమిషనర్ కార్యాలయ ప్రారంభోత్సవ వేళ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వెల్లడించిన ఈ సంగతి మారుతున్న కాలమాన పరిస్థితుల్లో మంచి ఆలోచనే. మరణించినవారి పేర్లను తక్షణం తొలగించడానికీ, ఓటుహక్కు వయసు రాగానే జాప్యం లేకుండా కొత్త ఓటర్లు జాబితాలో చేరడానికీ ఈ అనుసంధాన ప్రక్రియ ఉపకరిస్తుంది. అయితే, అదే సమయంలో పదేళ్ళకోసారి నిర్వహించాల్సిన కీలక జనగణనను ఈ దఫా ఎప్పుడు జరిపేదీ ప్రస్తావించకపోవడమే ఆశ్చర్యం.

నిజానికి, 1948 జనగణన చట్టం ప్రకారం ప్రభుత్వం ఈ ప్రక్రియను నిర్వహిస్తుంది. అలాగని ప్రతి పదేళ్ళకూ జనగణన చేయాలని చట్టమేమీ లేదు. ఎప్పుడు జనగణన చేయాలో, ఫలితాలెప్పుడు వెల్లడించాలో నిర్ణీత కాలవ్యవధి అందులో లేదు. అయితే, ఈ లెక్కల ప్రయోజనం అపారం. బ్రిటీష్ ఇండియాలో 1881లో వందల మంది శ్రమించి, 25 కోట్లకు పైగా జనాభా నుంచి జవాబులు సేకరించారు. అప్పటి నుంచి 130 ఏళ్ళ పాటు యుద్ధాలు సహా ఎన్ని సంక్షోభాలు వచ్చినా, మన పాలకులు ఒక క్రమం తప్పని యజ్ఞంగా ఈ జనగణన ప్రక్రియను సాగించారు. తీరా ఈసారి ఆ క్రమం తప్పింది. దేశంలో తాజా జనగణన 2021లో జరగాల్సి ఉంది. 2020 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ దాకా అందులో తొలి దశ జరపాలని భావించారు. కరోనాతో అది నిరవధిక వాయిదా పడింది. జనం లెక్కను ప్రోదిచేసి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక తదితర అంశాలతో ఒక సమాచార గనిగా, ప్రభుత్వ – ప్రజా కార్యాచరణకు కీలక సూచికగా ఉపకరించాల్సిన ఆ ప్రక్రియ ఈసారి అలా ఆలస్యమైంది.

జాప్యానికి కరోనాయే కారణమన్న ప్రభుత్వ వాదన తర్కానికి నిలవదు. అత్యధికులు కరోనా టీకాలు వేయించుకున్నా, 2022లో మూడో వేవ్ ముగిసి జనజీవనం కుదుటపడినా, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు సైతం సాగుతున్నా సరే... సర్కార్ ఎందుకనో ఇప్పటి దాకా మళ్ళీ జనగణన ఊసే ఎత్తలేదు. జిల్లాలు, తాలూకాలు, పోలీస్ స్టేషన్ల పాలనా సరిహద్దుల్ని స్తంభింపజేసే తుది గడువును ఈ జూన్ 30 వరకు కేంద్రం పొడిగించింది గనక లెక్కప్రకారం ఆ తర్వాత మూడు నెలలైతే కానీ జనగణన చేపట్టరాదు. అంటే, కనీసం ఈ సెప్టెంబర్ దాకా జనగణన లేనట్టే. ఇక, సాధారణంగా జనసంఖ్యను లెక్కించడం జనగణన చేసే ఏడాది ఫిబ్రవరిలో చేస్తారు. మార్చి 1కి ఇంత జనాభా అంటారు. కానీ, వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 2024 చివర ఎప్పటికో కానీ ప్రక్రియే మొదలు కాకపోవచ్చు. పైకి మామూలు గానే అనిపించినా, ఈ ఆలస్యం విస్తృత పర్యవసానాలకు దారి తీస్తుంది. ఎందుకంటే, పుష్కరకాలం గడిచిపోయినా ఇప్పటికీ మన విధాన రూపకర్తలు పాత 2011 నాటి జనాభా లెక్కల ఆధారంగా సంక్షేమ పథకాల నుంచి సాయాల దాకా నిర్ణయాలు తీసుకోవాల్సి రావడం విచిత్రం, విషాదం.

అసలు కరోనాతో ఆలస్యమవడానికి ముందే ఈ 2021 జనగణన వివాదాస్పదమై కూర్చుంది. జనగణనతో పాటు జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను నవీకరించేలా జనాభా సర్వే చేపడతామంటూ ప్రభుత్వం తేనెతుట్టె కదిల్చింది. అప్పటికే, ముస్లిమ్‌లే లక్ష్యంగా వివాదాస్పద 'పౌరసత్వ చట్టం–2019' తెచ్చారంటూ, దేశవ్యాప్తంగా నెలల తరబడి నిరసనలు సాగాయి. ఆ చట్టానికి, ఇప్పుడు భారతీయులమని నిరూపించుకోవాల్సిన ఈ 'ఎన్పీఆర్' జత చేరిందని విమర్శలు రేగాయి. మరో పక్క ఇప్పటికే ప్రతిపక్షాల్లోని అనేక రాజకీయ పార్టీలు, ప్రాంతీయ నేతలు దేశంలో కులగణన సాగాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆ లెక్కలు కూడా తీస్తే తమ ఓటుబ్యాంకులో చీలికలు రావచ్చనీ, అది తమకు దెబ్బ కావచ్చనీ అధికార పార్టీ భయపడుతోంది. వివిధ వర్గాల నుంచి ప్రత్యేక కోటాలకు డిమాండ్లు తలెత్తుతాయని ఆందోళన చెందుతోంది. అయిన ఆలస్యం ఎలాగూ అయింది గనక వచ్చే ఎన్నికల్లో లెక్క తప్పకుండా ఉండాలంటే, ఈ లెక్కలు పక్కనపెట్టాలనుకుంటే ఆశ్చర్యమేమీ లేదు.

జనగణన అంటే కేవలం భౌగోళిక ప్రాంతాల్లో తలకాయలు లెక్కపెట్టడం కాదు. సమాజంలోని భిన్న వర్గాల ఆకాంక్షలకు పునాదిగా నిలిచే ప్రక్రియ. గ్రామీణ – పట్టణ జనాభా వాటా, వలసలు, మాతృభాష, ఆయుఃప్రమాణం, గృహవసతులు వగైరా అనేక గణాంకాలను అందించే సమాచార నిధి. ఆర్థిక జీవిత అంశాలపై దృష్టి పెట్టే అనేక సర్వేలకు మాతృకైన 'జాతీయ శాంపిల్ సర్వే', ఆరోగ్యం – సామాజిక స్థితిగతులపై ఇంటింటి సర్వే అయిన 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే' వగైరాలు శాంపిల్స్ తీసుకోవడానికి జనగణనే ఆధారం. ఇంతటి ముఖ్యమైన వ్యవహారంపై ఈ సుదీర్ఘ అనిశ్చితి సమంజసం కాదు. జనగణన ప్రక్రియ ఎప్పుడు జరిగినా – ఆధునికతనూ, ఎప్పటికప్పుడు లెక్కల్లో మార్పుల్ని పొందుపరుచుకొనే లక్షణాన్నీ సంతరించుకోవాలన్న ప్రభుత్వ యోచన ఆహ్వానించదగినదే. కాకపోతే ఎప్పుడో డిజిటల్ వేదికల్ని ఆశ్రయిస్తామనీ, వ్యక్తులు తమకు తామే ఎలక్ట్రానిక్‌గా సమాచారం పూర్తిచేసే హక్కు కల్పిస్తామనీ, అందులో సామాజిక – ఆర్థిక హోదాను లెక్కించే 35కు పైగా పరామితులు ఉంటాయనీ అంటూ... ఇప్పుడు అమితమైన జాప్యం చేయడం అర్థరహితం. అసలుకే మోసం. అయితే, జనగణన ఎప్పుడు చేస్తామో చెప్పకున్నా, ఎలా చేయాలనుకుంటున్నదీ పాలకుల నోట వినపడడమే ప్రస్తుతానికి దక్కిన సాంత్వన.

ఉక్రెయిన్ ఆత్మస్థైర్యం పెరిగిందా?

విశ్లేషణ



కేపీ నాయర్

రష్యాతో యుద్ధం ప్రారంభమైనప్పుడు కనిపించినంత బలహీనంగా ఇప్పుడు ఉక్రెయిన్ లేదు. అజేయంగా కనిపిస్తూ రాత్రి పూట మీదపడే రష్యన్ ఆయుధాల నుంచి ఉక్రెయిన్ తనను తాను కాచుకుంటోంది. ఇది కీవ్‌లో వ్యక్తమవుతున్న కొత్త ఆత్మవిశ్వాసంలో కొంతభాగం మాత్రమే. రష్యాలోని తమ స్లీపర్ సెల్స్‌ను క్రియాశీలం చేయడంలో ఉక్రెయిన్ యంత్రాంగం సఫలీకృతం అయినట్లే కనిపిస్తోంది. క్రెమ్లిన్ ఆకాశం మీదుగా ప్రయోగించిన మానవ రహిత డ్రోన్స్ వాస్తవానికి ఉక్రెయిన్ పంచమాంగ దళం పేల్చినవే అయివుండవచ్చని వార్తలు! తూర్పు ఆసియా పర్యటనలో భాగంగా హిరోషిమాలో జెలెన్‌స్కీని కలవడానికి మోదీ అంగీకరించడం 15 నెలల యుద్ధం తర్వాత ఉక్రేనియన్ దౌత్యం పురోగమించిందనటానికి సాక్ష్యం.

మే 24 నాటికి రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలై 15 నెలలు. అవే శీర్షికలు, అవే చిత్రాలతో విసిగిపోయిన చాలామందికి యుద్ధ అలసట అకస్మాత్తుగా ముగిసిపోయినట్లుగా ఉంది. ఒకే రాత్రి రాజధాని కీవ్‌పై ప్రయోగించిన 30 రష్యన్ క్షిపణుల్లో 29 క్షిపణుల్ని తాము పేల్చివేసినట్లు ఉక్రెయిన్ చేసిన అద్భుత ప్రకటన కారణంగా ఈ అలసట ముగియలేదు. ఈ క్షిపణుల్లో అడ్డుకోడానికి 'వీల్లేని' కింజాల్ హైపర్‌సోనిక్ బాలిస్టిక్ ఆయుధాలు, ఇంకా భూమి, సముద్రం, గగనతలం నుంచి పేల్చిన అదేవిధమైన ఇతర ఆయుధాలు ఉన్నాయి. సముద్రంలోనూ, కీవ్ చరిత్రాత్మక సంప్రదాయ చర్చీల నేపథ్యంలో గగనమార్గాన తాము కూల్చిన క్షిపణుల వీడియోలను, కొన్ని ఫోటోలను ఉక్రెయిన్ ప్రదర్శించినప్పుడు ఆ ప్రకటనలను ప్రపంచం పాక్షికంగానైనా ఎత్తిపట్టింది.

యుద్ధం ప్రారంభం నుంచి తన ట్రేడ్ మార్క్ డ్రెస్‌గా మారిన రౌండ్ నెక్ కాలర్ లేని టీ షర్టును ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ వదిలిపెట్టినప్పుడు ఈ యుద్ధకాలపు అలసటకు కాస్త విరామం లభించింది. గత శుక్రవారం జెలెన్‌స్కీ సైనిక ఛాయలు కలిగిన పోలో షర్టు ధరించి జెడ్డాలో దిగారు. ఇది కుట్టుపని విషయంలో స్వాగతించదగిన మార్పు. డ్రెస్ కోడ్ విషయంలో సంప్రదాయ సున్నితత్వాలకు రాయితీలాగా జెలెన్‌స్కీ ధరించిన పోలో షర్ట్ పొడవాటి చేతులను కలిగి తన అరచేతులు, తల, మొహం మినహా చర్మాన్ని పూర్తిగా కప్పి ఉంచింది. అరబ్ లీగ్ సదస్సుకు తగిన మర్యాదను జెలెన్‌స్కీ ప్రదర్శించారనే చెప్పాలి. గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్య సమితి 77వ సర్వసభ్య సమావేశంలో గుండ్రని నెక్ లైన్, 'ప్లాకెట్ స్లీవ్'లతో కూడిన ముడతలు పడిన హెన్లీ షర్ట్ ధరించి ప్రసంగించి ప్రోటోకాల్, దౌత్యపరంగా చూపిన అమర్యాదకు ఇది భిన్నం.

రష్యన్ గగనతల దాడులను తోసిరాజనడం, రాజధాని కీవ్ వీధుల్లో మడత నలగని దుస్తులు ధరించిన ప్రపంచ దేశాల నేతల ముందు బాగా నలిగిన టీ షర్టులతో కనిపించడం అనేది జెలెన్‌స్కీ తనదైన ప్రకటన చేసే విధానం కావచ్చు. కానీ సంవత్సర కాలంగా ఒక పదవిలో ఉన్న అధ్యక్షుడి ఇటువంటి చేష్టలు విసుగు పుట్టించాయి. దేశాధ్యక్షుడు తన కండపుష్టిని అలా ప్రదర్శించడం ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్న ఉక్రెనియన్ల విశ్వాసాన్ని పెంపొందించవచ్చు లేదా పెంపొందించకపోవచ్చు. కానీ ప్రపంచ ప్రజలకు మాత్రం అది సరైన అభిరుచిగా తోచలేదు.

ఇటీవల సంభవించిన మార్పులు కాకతాళీయంగా జరిగినవి కాదు. నిదానంగానే కానీ కచ్చితంగా రష్యా నుండి వచ్చినదానికి ఉక్రెయిన్ తగినట్టుగా స్పందించడం ప్రారంభించింది. గత ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనప్పుడు రష్యాకు వ్యతిరేకంగా కనిపించినంత బలహీన స్థితిలో ఉక్రెయిన్ ఇప్పుడు కనిపించడం లేదు. ఇప్పటివరకు అజేయంగా కనిపిస్తూ రాత్రి పూట మీదపడే ఆయుధాల



నుంచి ఉక్రెయిన్ తనను తాను కాచుకుంటోంది. ఇది కీవ్‌లో వ్యక్తమవుతున్న కొత్త ఆత్మవిశ్వాసంలో కొంతభాగం మాత్రమే.

ఆ డ్రోన్లు రష్యా లోపలి నుండి పేల్చినవే!

రష్యాలో నిత్యం ఉనికిలో ఉండే తమ వేలాది 'స్లీపర్ సెల్స్'ను క్రియాశీలం చేయడంలో జెలెన్‌స్కీ యంత్రాంగం సఫలీకృతం అయినట్లే కనిపిస్తోంది. విశ్వసనీయమైన గణాంకాల ప్రకారం రష్యాలో దాదాపు 60 లక్షలమంది ఉక్రెయిన్ జాతి ప్రజలు నివసిస్తున్నారు. సామీప్యత, ఇంకా రాజకీయాల వల్ల శతాబ్దాల పరస్పర ఏకీకరణ చరిత్ర మిగిల్చిన ఫలితం ఇది. ఇలాంటి పరిస్థితుల్లో తమ మాతృభూమి కోసం పంచమాంగ దళంగా పనిచేయడానికి రష్యాలోని వేలాది మంది ఉక్రెయిన్ వాసులు సంసిద్ధతతో ఉండటం కద్దు. ఈ నెల మొదట్లో క్రెమ్లిన్ ఆకాశం మీదుగా ప్రయోగించిన మానవ రహిత డ్రోన్స్ వాస్తవానికి రష్యాలోని ఉక్రెయిన్ పంచమాంగ దళం పేల్చినవే అయివుండవచ్చని వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్ భూభాగం నుంచి ఈ డ్రోన్స్‌ను ప్రయోగించి ఉంటే వాటిని రష్యా తప్పకుండా కనిపెట్టే అవకాశం ఉండేది. దేశం లోపలి నుంచి వీటిని పేల్చారు కాబట్టి వాటిని రష్యా కనుగొనలేకపోయిందని చెప్పాలి. రష్యాలో విద్రోహ చర్యలు, ఆస్తి విధ్వంసక చర్యలు పెరుగుతుండటం... రష్యా లోపలి ఉక్రెయిన్ స్లీపర్ సెల్స్ కార్యాచరణ విజయవంతమవుతోందని సూచిస్తోంది. ఈ పరిస్థితి భారత్‌లోకి పాకిస్తాన్ ఎగుమతి చేస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని పోలి ఉంది.

చిట్టచివరకు పాశ్చాత్య మిత్ర దేశాల నుంచి జెలెన్‌స్కీ అత్యాధునికమైన ఆయుధ సామగ్రిని అందుకుంటున్నారు కాబట్టి కూడా యుద్ధం ఉక్రెయిన్ వైపునకు తిరుగుతున్నట్లుంది. నాటో సైనిక దళాలు రహస్యంగా యాంటీ మిస్సైల్ బ్యాటరీస్ వంటి హైటెక్ రక్షణ సామగ్రిని నిర్వహిస్తున్నట్లుంది. రష్యా సైనిక లక్ష్యాలను అత్యంత నిర్దిష్టతతో కూల్చడం కూడా నాటో బలగాల జోక్యాన్ని ఎత్తి చూపుతుంది.

ఈ యుద్ధం తనకు అనుకూలంగా పరిణమిస్తున్నదానికి సరితూగేట్టుగా జెలెన్‌స్కీ ఆహార్యం కనబడుతోంది. హుడ్‌తో కూడిన ముదురు గోధుమ రంగు విండ్‌బీటర్‌లో జెలెన్‌స్కీ హిరోషిమాలో జరిగిన జి–7 దేశాల సదస్సులో (మే 19–21) పాల్గొనడానికి వచ్చారు. అయితే ఇంకా టైతో కూడిన జాకెట్ ధరించలేదు. అంతకు రెండు రోజుల క్రితం పోలో షర్టులో ఆయన జెడ్డాలో దిగినప్పుడు, ఆయన భార్య, ప్రథమ మహిళ ఒలెనా జెలెన్‌స్కా మందపాటి, పాక్షికంగా సైనిక శైలి ఆకుపచ్చ దుస్తులు ధరించి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో అత్యంత ప్రముఖ మీడియా కార్యక్రమంలో ప్రసంగించారు. ఆ డ్రెస్ ఆమె మెడ కింది భాగం నుంచి ఆమె మోకాళ్ల కిందివరకు పాకి ఉంది. ఆ తర్వాత సియోల్ మెట్రోపాలిటన్ ప్రభుత్వంతో ఒక సాంస్కృతిక మార్పిడి ఒప్పందంపై సంతకం చేసినప్పుడు మెరిసే తెల్ల షర్టు, దానికి వ్యత్యాసంగా నల్ల ప్యాంట్స్, దానికి తగినట్లుగా నడుముకు బెల్టు, ఏక ఆభరణంతో అత్యంత సొగసుగా ఆమె కనిపించారు. తమ దేశానికి ప్రాణాంతకం కాని సైనిక సహాయం మాత్రమే కావాలంటూ దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సక్ యోల్ వైపు వేలు చూపి మరీ ఆమె అడిగిన సమయంలో దక్షిణ కొరియా ప్రజలపై ఆమె గట్టి ముద్ర వేశారు.

జెలెన్‌స్కీ ఈ నెలలో యూరప్ వ్యాప్తంగా దౌత్య పర్యటనలకు వెళ్లారు. తాము మాత్రం స్వదేశంలోనే ఉంటూ తమ స్థాయి విదేశీ నాయకులను కీవ్‌లోనే కలవడం అనే ఉక్రేనియన్ నాయకుల మునుపటి విధానంలో ఆయన మార్పు తెచ్చారు. మే 1వ తేదీ నుంచి ఆయన ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, బ్రిటన్‌లలో పర్యటించారు. మే మధ్యలో ఆయన వాటికన్ సందర్శన అత్యంత భావోద్వేగపూరితమైనదిగా నిలిచింది.

భారత్ శాంతి ప్రణాళిక?

ప్రధాని నరేంద్ర మోదీ గత సంవత్సరం ఫిబ్రవరికి ముందు జెలెన్‌స్కీకి సమయం కేటాయించలేదు. ఉక్రెయిన్ ఒక అస్థిరమైన దేశంగా ఉండేది. భారత్‌కు దాంతో ఉపయోగం లేదు. పైగా ఉక్రెయిన్‌లోని వరుస ప్రభుత్వాలు భారత్‌పై ఉపయోగించేందుకు పాకిస్తాన్ కు ఆయుధాలను విక్రయించడానికి ప్రయత్నించాయి. అయితే, తన తూర్పు ఆసియా పర్యటనలో భాగంగా హిరోషిమాలో జెలెన్‌స్కీని కలవడానికి మోదీ అంగీకరించడం, 15 నెలల యుద్ధం తర్వాత ఉక్రేనియన్ దౌత్యం పురోగమించిందనటానికి గుర్తింపుగా నిలిచింది. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి తన విధానానికి ఎప్పటికప్పుడు చురుకైన సర్దుబాట్లు చేసుకోవాలని భారతదేశం గుర్తించింది. అయితే ఇదేమైనా భారత శాంతి ప్రణాళికలో భాగమా అని కొన్ని వర్గాలు అనుకుంటున్నాయి.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శభాష్ కశ్మీర్



యూపీఎస్సీ సివిల్ సర్వీసుల పరీక్షల్లో అర్హత పొందిన అందరికీ శుభాభినందనలు. ప్రత్యేకించి జమ్ము కశ్మీర్ అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించడం ఉత్సాహాన్ని ఇచ్చింది. వసీమ్ (7), ప్రసేన్‌జిత్ (11), నవీద్ ఎహసాన్ భట్ (84)– ఇలా జమ్ము కశ్మీర్ అభ్యర్థులు ఈ సంవత్సరం మంచి ఫలితాలు పొందారు.

– షా ఫజల్, ఐఏఎస్ అధికారి

తేదీ వెనుక...



నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని మే 28గా మోదీ నిర్ణయించడానికి కారణం అది వీర్ సావర్కర్ జయంతి. కాంగ్రెస్, ప్రతిపక్షాలు... మోదీ, సావర్కర్‌లను ఇద్దరినీ ద్వేషిస్తాయి. కాబట్టి ప్రారంభోత్సవానికి దూరంగా ఉండటానికి అవి రెండూ కారణాలు.

– సమీర్, బ్లాగర్

అర్థం కాదు



నీలి చిత్రాల నటి మియా ఖలీఫా ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ప్రసంగించిందని వార్త. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆక్స్‌ఫర్డ్‌లో చేర్పించడానికి ఎంతో కష్టపడతారు; కానీ వాళ్లకు లెక్చర్ ఇవ్వడానికి ఒక పోర్న్‌స్టార్ వస్తే ఎలా ఉంటుందో ఊహించండి! ఈ ప్రపంచం పిచ్చిది.

– బుష్రా షేక్, వ్యాఖ్యాత

అనుమానం



అంటే ఇప్పుడు ఈ పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించేవాళ్లు పార్లమెంట్ సమావేశాలకు కూడా హాజరు కారా?

– సుహేల్ సేఠ్, నటుడు

ఏం మోడల్?



చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సరైన 'ద్రావిడ' నమూనా. జట్టులో ఏ ఒక్కరూ తమిళం మాట్లాడలేరు. బయటివాళ్లు అందరూ జట్టు కోసం ఆడుతుంటే, ద్రావిడ ఫ్యాన్లు వాళ్లకు కేరింతలు కొడుతున్నారు.

– అరుణ్ కృష్ణన్, రచయిత

చెరిగిపోని జ్ఞాపకం

''వీరులను విస్మరించవద్దు. పోరాట యోధులు చిరస్మరణీయులు. మన కోసం, తమ కోసం, మానవజాతి సమస్తం కోసం ప్రాణాలను పణంగా పెట్టే పోరాటయోధులను గురించిన చిన్న చిన్న వివరాలను సైతం సేకరించండి'' అంటూ 80 ఏళ్ల కింద బెర్లిన్‌లో ఉరి తీయబడ్డ జూలియస్ ఫ్యూజిక్ మాటలు కామ్రేడ్ రిక్కల సహదేవ్ రెడ్డి స్మృతులను తట్టి లేపుతున్నాయి. 'రిసారె' అంటూ పిలిచిన పిలుపుకు నిలువెల్లా పులకరించే బక్క పలుచని నగుమోము 35 ఏళ్లు అవుతున్నా ఇంకా నాకు సజీవంగా కదలాడుతున్నట్లే ఉంటుంది. 'ఫాసిజానికి మృత్యువు కమ్యూనిజానికి భవితవ్యం' అన్న జూలియస్ ఫ్యూజిక్ భావనలతో కామ్రేడ్ రిక్కల సహదేవ్ రెడ్డిని తిరిగి స్మరించుకునే సందర్భానికి కూడా ఇది అతికినట్టుగా ఉన్నది. పీడీఎస్‌యూ (విజంభణ) కార్యకర్తగా, విప్లవ రచయితల సంఘం సభ్యుడిగా 1988 మే 25న సిరిసిల్ల పట్టణంలోద్రోహంతో అరెస్టు కాబడిన రిసారెను 3 రోజుల చిత్రహింసల తర్వాత మే 28న కాల్చి చంపి సమీపంలోని ధర్మారం గ్రామంలో పడేసి ఎన్‌కౌంటర్ కట్టు కథలల్లారు. సరిగ్గా జూలియస్ ఫ్యూజిక్ 35వ వర్ధంతి కలిసొచ్చేలా రిసారె కవితలను ఆయనపై వచ్చిన పాటలు కవితలు కలిపి 1988 సెప్టెంబర్‌లోనే విరసం సిటీ యూనిట్ 'రక్తచలన సంగీతం' పుస్తకంగా వేసింది. మరో 35 ఏళ్ల యినా చెరిగిపోని రిక్కల సహదేవ్ రెడ్డి జ్ఞాపకాలతో నేడు దీనిని పునర్ముద్రించడం సంతోషకరం. విప్లవోద్యమానికి వ్యతిరేకంగా 'ఫియర్ వికాస్' అనే సంస్థ పుట్టిన హుస్నాబాద్ నుండి కామ్రేడ్ రిక్కల సహదేవరెడ్డి... అమరుడు కామ్రేడ్ పిట్టల వెంకన్నతో కలిసి 1980ల్లోనే విప్లవోద్యమంలో అడుగిడినాడు. ఆయన పేద వ్యవసాయక కుటుంబంలో పుట్టాడు.



ఆయన దారుణ హత్యకు గురయ్యే సమయంలో విద్యార్థి రంగ కార్యకర్తగా అనేక మందితో డైరెక్ట్‌గా కాంటాక్ట్‌లో ఉన్నాడు. ప్రాణ త్యాగానికి సిద్ధమయ్యాడు తప్ప ఎలాంటి ద్రోహపు ఆలోచన ఆయన దరిచేరనీయలేదు. 1988 జనవరిలో ఒంగోలులో జరిగిన విరసం మహాసభల్లో పాల్గొన్నాడు. అంతేకాకుండా కరీంనగర్ జిల్లాలో నూతన సాహితీ సంస్థ ఏర్పరచి ఒక సాహిత్య పత్రిక నడపడంలోనూ భాగమయ్యాడు. నేడు ఉద్యమ నష్టాలను సమీక్షించే క్రమంలో ఉన్నత ఆలోచనలు విముక్తి పోరాట అవశ్యకతను రెట్టిస్తున్నాయి. విప్లవోద్యమాన్ని నెత్తురుటేరుల్లో ముంచిన తర్వాత పాలకులు కొండల్ని పిండి చేస్తూ, బొగ్గుగుటల పేరిట ఓపెన్ కాస్టుల్ని తవ్వుతూ గాలినీ, ధూళినీ విషమయం చేశారు, చేస్తున్నారు. ఆలోచించాల్సిన యువతను మద్యం మత్తులో, గంజాయి దమ్ముల్లో ముంచి వేస్తున్నారు. ఇది చాలదన్నట్లు మతం మత్తులోనూ ముంచి చిత్తు చేస్తున్నారు. భూమిని ఉత్పత్తి సాధనానికి బదులు అంగడి సరుకుగా మారుస్తున్నారు. జూలియస్ ఫ్యూజిక్ గురించి 1981లో ఉషా ఎస్. డానీ రాసిన మాటలు ఒకసారి గుర్తు చేసుకుందాం. నేటి మన రిసారెకు సైతం అవి అచ్చంగా సరిపోలుతాయి.

''మనుషులందరిని ప్రేమించిన మనిషతను. కమ్యూనిస్టు అతను. వెలుగును ప్రేమించాడు. స్వేచ్ఛను ప్రేమించాడు. తన జీవితం మరణానికి దారితీస్తున్నప్పుడు ఘోరమైన చిత్రహింసలను అనుభవిస్తున్నప్పుడు కూడా తన మనుషుల సుఖాన్ని కాంక్షిస్తున్న మనిషతను.'' కామ్రేడ్ రిసారె అలాంటి మనుషులను, సమసమాజాన్ని సృష్టించుకోవడానికి ఎలా పయనించాడో అలా నేర్చుకోవడానికి, నేర్పడానికి సన్నద్ధమవుదాం.

– అమర్

(మే 28న హైదరాబాద్ ఎస్వీకేలో ఆవిష్కరించనున్న 'రక్తచలన సంగీతం' పునర్ముద్రణ ముందుమాట నుంచి)

ఈ 'బేటీ'ల గోడు పట్టదా?

అభిప్రాయం



జి. అనురాధ

దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన మన మహిళా రెజ్లర్లు నేడు వీధిన పడ్డారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన తమ ఫెడరేషన్ అధ్యక్షునిపై చర్యలు తీసుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తున్నారు. అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు.

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొంటూ ఏడుగురు మహిళా రెజ్లర్లు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 2023 జనవరిలో నిరవధిక దీక్షలు చేపట్టారు. వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ వంటివారు లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. బీజేపీకి చెందిన ఉత్తరప్రదేశ్ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్‌తో పాటు కొందరు కోచ్‌లు కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రాతపూర్వకంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేధింపులకు గురైన వారిలో ఒక మైనర్ బాలిక కూడా ఉంది. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఈ ఫిర్యాదును స్వీకరించేందుకు, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరించారు. దీనితో న్యాయం చేయాలని ఏడుగురు బాధిత మహిళా రెజ్లర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశంతో పోలీసులు పిటిషన్ తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన అంశాన్ని చాలా తీవ్రమైన విషయంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

'బేటీ పఢావో' 'బేటీ బచావో' అంటూ నినాదాలిస్తున్న బీజేపీ పాలకులు ప్రఖ్యాత క్రీడాకారిణులకే లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించలేక పోతుంటే ఇక సాధారణ ఆడపిల్లలకు ఏం చేయగలుగుతారు?

మొట్టమొదటగా 2023 జనవరి 18న జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు నిరవధిక ధర్నాలు చేపట్టారు. వారికి మద్దతుగా అనేక మంది సీనియర్ రెజ్లర్లు, ఇతర క్రీడా విభాగాల మిత్రులు సంఘీభావంగా ఉద్యమంలోకి వచ్చారు. దీంతో పీటీ ఉష నేతృత్వంలోని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) జనవరి 23న ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేసి ఏడుగురు సభ్యులతో ఒక విచారణ కమిటీని నియమించింది. మేరీ



కోమ్ కన్వీనర్‌గా నియమించిన ఈ విచారణ కమిటీకి విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించడానికి ముందు నాలుగు వారాల గడువు ఇచ్చారు. ఆ తర్వాత మరో రెండు వారాలు కమిటీ సభ్యుల కోరిక మేరకు పొడిగించారు. ఈ కమిటీలో మేరీకోమ్, యోగేశ్వర్ దత్‌లు (రెజ్లింగ్); ఆర్చర్ డోలా బెనర్జీ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు సహదేవ్ యాదవ్, మాజీ షట్లర్ అలకానంద అశోక్, ఇద్దరు న్యాయ వాదులు సభ్యులుగా ఉన్నారు. కేంద్రం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ కమిటీ ఇచ్చే నివేదికను అనుసరించి చర్యలు తీసుకుంటుందనే నమ్మకంతో రెజ్లర్లు ఆందోళన విరమించారు. అయితే లైంగిక వేధింపులకు పాల్పడిన దోషులపై చర్యలు తీసుకోకుండా నివేదికను చెత్త బుట్టలో పడేసింది ప్రభుత్వం.

తప్పు చేసినవారిని శిక్షించకపోగా... ఫిర్యాదు చేసిన వారిపై మరింత ఒత్తిడి చేయడం, వేధించడం ప్రారంభించారు. కేంద్ర క్రీడల శాఖ లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను సమర్థిస్తూ, ఆయనపై ఆరోపణలు చేసిన మహిళా మల్లయోధులను తప్పుపడుతూ వ్యాఖ్యానాలు చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసినా లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై విచారణ జరిపి దోషులను అరెస్టు చేయలేదు. బ్రిజేష్ భూషణ్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పూనుకున్నాయనీ, తమకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధంగా లేవనీ... మహిళా మల్ల యోధులకు అర్థమయింది. ఈ స్థితిలో వారు న్యాయం కోసం మూడు నెలల తరువాత ఏప్రిల్ 11 నుండి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రెండవ దఫా నిరవధిక ధర్నాకు పూనుకున్నారు.

ఈ సందర్భంగా బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు కేంద్రం ఎందుకు సిద్ధంగా లేదనే విషయంపై కొంత చర్చించాలి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఎంపీ అయిన బ్రిజ్‌భూషణ్ అత్యంత నమ్మకమైన కార్యకర్త. బాబ్రీమసీద్ కూల్చివేతలోనూ పాల్గొన్నవాడు. బీజేపీలో అత్యంత పలుకుబడి గల యోగికి నమ్మకమైన అనుచరుడుగా ఉన్నందునే ఆయనకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలూ కేంద్రం తీసుకోవడం లేదనే విమర్శ ఉంది.

ఇప్పుడు ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులకు మద్దతు తెలపడం ద్వారా పాలకులకూ, లైంగిక వేధింపులకు పాల్పడే వారికీ దేశ ప్రజలు ఒక హెచ్చరిక చేయాలి.


వ్యాసకర్త ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు
మొబైల్: 99596 32366

రుణ విముక్తి

ఇతరుల వద్ద తీసుకున్న ధనం, వస్తువులను రుణంగా భావిస్తూ, తిరిగి వాటిని చెల్లించడంతో రుణ విముక్తి కలుగుతుందని భావిస్తారు జనులు. కానీ గృహస్థులు తీర్చాల్సిన అయిదు రుణాలను హిందూ ధర్మం వివరించింది. ఈశ్వరార్పణ బుద్ధితో ధర్మాన్ని, కర్తవ్యాన్ని ఆచరించడం ద్వారా రుణ విముక్తులు కావచ్చని తెలిపింది.

దేవ రుణం: బతుకునిచ్చే ప్రాణవాయువు, జనుల భారం మోస్తూ ఆహార ధాన్యాలనిచ్చే భూమి, దప్పికను తీర్చే జలం మొదలైన పంచభూతాలు మానవ జీవితానికి ఆధారాలు. ఎలాంటి ప్రతిఫలం ఆశించని ప్రత్యక్ష దైవాలైన పంచభూతాల పట్ల కృతజ్ఞతాభావంతో మెలుగుతూ భగవదారాధన చేసినప్పుడే వాటి రుణం తీరుతుంది.

రుషి రుణం: సకల శాస్త్రాలకు, సంస్కృతికి మూలం రుషులు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను రుషుల ప్రతిరూపంగా భావించి సద్బుద్ధితో సేవిస్తూ, వారందించిన శాస్త్రాలను అధ్యయనం చేస్తూ ఆచరించడం వల్ల రుషి రుణం తీరుతుంది.



పితృ రుణం: జన్మకు కారకులైన తల్లిదండ్రుల రుణం తప్పక తీర్చాల్సిందే. వారు జీవించినంతకాలం కష్టపెట్టకుండా ప్రేమగా చూసుకుంటూ, వారి తదనంతరం శ్రాద్ధ కర్మలు, పిండ ప్రదానాల వంటి కర్మలను విధిగా నిర్వర్తిస్తే పితృ రుణం తీరుతుంది.

భూత రుణం: ఎన్నో జీవుల సహకారం లేనిదే మానవ జీవనం సాధ్యం కాదు. అందుకే క్రిమి కీటకాల వంటి అల్ప జీవుల పట్ల కూడా దయ, జాలితో మెలగాలి. ప్రకృతిలో జీవించే సర్వ హక్కులు వాటికీ ఉన్నందున హింసించడం, చంపడం చేయ కూడదు. వాటి జీవనానికి సహకరించాలి. అప్పుడే భూత రుణం తీరుతుంది.

అతిథి రుణం: తిథి, వార, నక్షత్రాలు చూడకుండా వచ్చేవాడే అతిథి. ఇంటికి వచ్చే అతిథులను ప్రేమతో సేవించాలి. సేవా భాగ్యం కలిగించిన అతిథిని అభినందించాలి. ఆశ్రమ వాసులైన బ్రహ్మచారులను, వానప్రస్థులను, సన్యాసులను ఆదరించాలి. అలా అతిథి రుణం తీరుతుంది.

ఈ ఐదు రుణాలను తీర్చుకుంటూ, పెద్దల పట్ల బాధ్యతలను నెరవేరుస్తూ, సద్గురువులు ఉపదేశించిన బోధనలతో జీవితాన్ని సంస్కరించుకున్నప్పుడే మానవజన్మ ధన్యమవుతుంది.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.3.10 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పుష్యమి సా.4.22 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.46 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.20 నుండి 11.04 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.23.

వట్టెంలో రూ.3.14కోట్ల ఆల్ప్రాజోలం పట్టివేత

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని బిజినేపల్లి మండలం వట్టెం గ్రామ శివారులో కల్తీకల్లుకు ఉపయోగించే ఆల్ప్రాజోలం మత్తు పదార్థాలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు బుధవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వట్టెం శివారులోని ఫౌల్ట్రీ ఫామ్‌లో భారీగా ఆల్ప్రాజోలంను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 31.42 కిలోల ఆల్ప్రాజోలం నిల్వలను, ల్యాబొరేటరీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3.14 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఫౌల్ట్రీ ఫారం నిర్వాహకుడు హన్మంత్‌రెడ్డిని ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం అదుపులోకి తీసుకున్నారు.

'కమలం' కార్యాచరణ మారాలి సారూ!

ఢిల్లీ బీజేపీ పెద్దలకు తెలంగాణ నేతల ఫీడ్‌బ్యాక్

- కీలకమైన ఎన్నికల దృష్ట్యా విధానాలు మార్చాలని విన్నపం
- రాష్ట్ర నేతల మధ్య సమన్వయ లేమి, అతి హిందుత్వ ఎజెండాతో ఇబ్బందులని స్పష్టం చేసిన నేతలు
- త్వరలోనే ఈటలకు రాష్ట్ర ఎన్నికల కమిటీ లేదా ప్రచార కమిటీ సారథ్య బాధ్యతలిస్తారంటూ ప్రచారం



సాక్షి, హైదరాబాద్: జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పార్టీకి కీలకంగా మారిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధినాయకత్వం యాక్షన్ ప్లాన్ ఎలా ఉండబోతుందన్న దానిపై అంతర్గత చర్చ సాగుతోంది. ప్రాంతీయ పార్టీగా ఆర్థికంగా, ఇతరత్రా రూపాల్లో బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను, రాజకీయ చతురుడు సీఎం కేసీఆర్ వ్యూహాలను ఢీకొనేందుకు ప్రస్తుతం ఇక్కడ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, పని పద్ధతులు సరిపోవనే అభిప్రాయంతో కొందరు ముఖ్య నేతలున్నట్టు సమాచారం. ఇటీవల పలువురు నేతలను ఢిల్లీకి పిలిపించి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ వివిధ అంశాలపై సమాలోచనలతో పాటు, ముఖ్యమైన విషయాలపై అభిప్రాయసేకరణ జరిపారు.

ముఖ్య నేతల ఒంటెద్దు పోకడలు..

రాష్ట్ర పార్టీలో కీలక బాధ్యతల్లో ఉన్న ముఖ్య నేతలు కొందరు ఒంటెద్దుపోకడలతో అన్ని కార్యక్రమాల్లో తామే ఫోకస్ అయ్యేలా, మిగతా వారెవరికీ ప్రాధాన్యత రాకుండా అనుసరిస్తున్న పద్ధతులను ముఖ్యనేతలు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. దీనితో పాటు రాష్ట్ర నాయకుల మధ్య సరైన పని విభజన లేకపోవడం, ముఖ్య నేతల మధ్య సమన్వయ లేమి, తెలంగాణలో అతిగా హిందుత్వ ఎజెండా ఎత్తుకోవడం వల్ల ఇబ్బందులు తదితర అంశాలను గురించి నాయకత్వానికి వివరించినట్టు తెలిసింది. పీడన, అణచివేతకు వ్యతిరేకంగా దశాబ్దాల పోరాట చరిత్ర, చైతన్య, ప్రగతిశీలమైన తెలంగాణ సమాజం కరడుగట్టిన మతవాదాన్ని, అతి హిందుత్వ భావజాలాన్ని అంగీకరించదని స్పష్టం చేసినట్టు సమాచారం. దీనికి తగ్గట్టుగా లౌకికవాద ముద్రతో రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, వర్గాలను ఆకట్టుకునేలా ఎన్నికల వ్యూహాలు సిద్ధం చేసుకుంటేనే ఫలితం ఉంటుందనే వాదనను కూడా కొందరు నేతలు బలంగా వినిపించినట్టు చెబుతున్నారు. ప్రాంతీయ పార్టీ రాజకీయాల నేపథ్యంలో బయటి రాష్ట్రాలు, జాతీయపార్టీ నేతల ప్రమేయం తగ్గించి స్థానిక నేతలకు ప్రాధాన్యత పెంచి, స్థానిక అంశాలపైనే అధిక దృష్టి కేంద్రీకరించాలని సూచించినట్టు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో జాతీయ నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకోబోతోంది, ముఖ్యనేతల్లో ఏర్పడిన అసంతృప్తిని దూరం చేసేందుకు ఎలాంటి ఫార్ములాను ముందుకు తేనుంది అనే అంశాలు ఇప్పుడు చర్చకు తెరలేపాయి. అదేవిధంగా ఎవరెవరికి ఎలాంటి బాధ్యతలు అప్పగించబోతోంది... అధికార బీఆర్ఎస్‌ను ఢీకొట్టేందుకు ఎలాంటి కార్యాచరణ ప్రణాళికను అమలుచేయబోతున్నదనేది ప్రస్తుతం పార్టీలో చర్చనీయాంశమైంది.

'ఇంటి' సమావేశాలు ఎక్కడ?

గతంలో ఢిల్లీలో జరిగిన ప్రత్యేకభేటీలో ముఖ్యనేతలంతా తరచుగా ఒక్కోసారి ఒక్కొక్కరి నేత ఇంట్లో సమావేశం కావాలని అమిత్‌షా చేసిన సూచన కూడా నేతలంతా పెడచెవినపెట్టారు. అలా ఒక్క సమావేశం కూడా జరిగిన దాఖలాల్లేవు. దీంతో నేతలమధ్య సమన్వయం సాధించి, ఐకమత్యంతో వారు ఉమ్మడిగా ముందుకు సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై నాయకత్వం దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

ఈటలకు కీలక బాధ్యతలు ?

ఎన్నికలకు సన్నద్ధమౌతున్న సందర్భంలో రాష్ట్ర అధ్యక్షుడి మార్పు వంటి వాటితో పార్టీలో, కేడర్‌లో అయోమయం, అసందిగ్ధత ఏర్పడే అవకాశాలున్నందున మరో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని జాతీయపార్టీ నిర్ణయించినట్టు పార్టీవర్గాల సమాచారం. ఉద్యమ కాలంతో సహా రెండుదశాబ్దాల పాటు టీఆర్ఎస్‌లో వివిధ దశల్లో ప్రయాణం సాధించి అగ్రనేతగా ఎదిగిన ఈటల రాజేందర్‌కు ఎన్నికల కమిటీ లేదా ప్రచార సారథ్య బాధ్యతలు వంటి కీలకబాధ్యతలు అప్పగించవచ్చునని జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రధాని మోదీ విదేశీ పర్యటనను ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చాక.. అంటే వారం, పదిరోజుల వ్యవ ధిలోనే దీనికి సంబంధించిన నిర్ణయాన్ని నాయకత్వం వెల్లడిస్తుందనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఈటలతో పాటు... మరికొన్ని బాధ్యతల్లో పనిచేసేందుకు ఉత్సాహం కనబరుస్తున్న ఇతరనేతలకు కూడా సమన్వయం, పర్యవేక్షణ, ఇతర ముఖ్యమైన విధులు అప్పగించే ఆలోచనతో నాయకత్వం ఉన్నట్టు తెలిసింది.

కనీస వేతనాల బోర్డు చైర్మన్‌గా నారాయణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌గా పి.నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆయనను నియమించారు. సీఎం నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

వచ్చే ఎన్నికలు కాంగ్రెస్‌కు జీవన్మరణ సమస్య

- 18–35 మధ్య వయసు వారు పార్టీకి దూరంగా ఉన్నారు
- అనుబంధ సంఘాలు క్రియాశీలకంగా పనిచేయాలి
- ఏఐసీసీ సెక్రటరీ నదీమ్ జావేద్



సమావేశంలో మాట్లాడుతున్న నదీమ్

సాక్షి, ఆసిఫాబాద్: వచ్చే ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్య అని ఏఐసీసీ సెక్రటరీ, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి నదీమ్ జావేద్ పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ కార్యవర్గ ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నదీమ్ జావేద్ మాట్లాడుతూ...కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో ఐదు ఏజెన్సీలతో తాము వేర్వేరు సర్వేలు చేయించామని, అందులో బీఆర్ఎస్ సర్కారు మీద తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని తెలిపారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై సానుకూలత పెరిగిందని స్పష్టం చేశారు. ప్రతీ కార్యకర్త వచ్చే 150 రోజులు ప్రజల్లో ఉండి కాంగ్రెస్ జెండాను వారి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. 18 నుంచి 35 ఏళ్ల యువత ఏ కారణం చేతనో పార్టీకి దూరంగా ఉన్నారని, వారిని పార్టీకి చేరువ చేసే బాధ్యత యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ తీసుకోవాలన్నారు. పార్టీకి చెందిన అనుబంధ సంఘాలు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్‌రావు, పీసీసీ కార్యదర్శి ఎం.సత్యవతి, పీసీసీ సభ్యులు గణేశ్ రాథోడ్, కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ సీట్లలో ఎస్సీ ఓట్లపై దృష్టిపెట్టండి

బీజేపీ నేతలకు జాతీయ నాయకత్వం సూచనలు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివరి లోగా ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లోని ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలోనే కాకుండా జనరల్ స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని బీజేపీ నేతలకు జాతీయ నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ఇప్పటి నుంచే పనిచేయడం మొదలుపెట్టాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది. ఎస్సీ రిజర్వ్‌డ్ కాకుండా ప్రతీ జనరల్ సీటులో కూడా 15 వేల నుంచి 20 వేల దాకా ఎస్సీల ఓట్లు ఉన్నందున, గెలుపునకు కీలకంగా మారనున్న ఈ ఓట్లను బీజేపీ అభ్యర్థులకు పడేలా ప్రత్యేక కసరత్తు చేపట్టాలని సూచించింది. వచ్చే ఏడు నెలల్లోగా తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా, ఇతర మోర్చాలతో బీజేపీ నాయకత్వం సమాలోచనలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం రాత్రి ఢిల్లీలో ఐదు రాష్ట్రాల ఎస్సీ మోర్చాలతో ఆ విభాగం జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్యా, సంస్థాగత సహ ప్రధానకార్యదర్శి వి.సతీశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా జాతీయ ప్రధానకార్యదర్శి బీఎల్ సంతోష్‌తో కూడా మాట్లాడినట్టు తెలిసింది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర ఎస్సీమోర్చా అధ్యక్షుడు కొప్పు భాషా హాజరై తెలంగాణలో పరిస్థితుల గురించి వివరించారు. గురువారం ఉదయం కూడా మరోసారి ఎస్సీమోర్చాల నాయకులతో ఈ భేటీ కొనసాగే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

మంత్రి హరీశ్‌రావు పేరుతో వసూళ్లు

- ఆయన మాజీ అనుచరుడి దందా
- సహాయకుడితో కలిసి వ్యవహారాలు
- ఇరువురినీ అరెస్ట్ చేసిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: మంత్రి హరీశ్‌రావు పేరుతో వసూళ్ల దందా చేస్తున్న ఆయన మాజీ అనుచరుడితో పాటు అతడి సహాయకుడిని ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారాలు నడపటానికి వీళ్లు హరీశ్‌రావు పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు బుధవారం వెల్లడించారు. దుండిగల్ సమీపంలోని బహదూర్‌పల్లి ప్రాంతానికి చెందిన పేరాల వెంకటేష్‌కు తెలంగాణ వెంకటేశ్వరరావు అనే పేరు కూడా ఉంది. ఇతడు కొన్నాళ్లు మంత్రి హరీశ్‌రావు అనుచరుడిగా ఉన్నాడు. మంత్రిని కలవడానికి వచ్చే వ్యాపారులు, ప్రముఖులతో పాటు కార్యకర్తలు కూడా వెంకటేష్‌ను గుర్తిస్తారు. తనకు ఉన్న ఈ పరిచయాలను ఆర్థికంగా వాడుకోవాలని ఇతగాడు పథకం వేశాడు. తన సహాయకుడైన బౌరంపేటకు చెందిన డ్రైవర్ జి.రాజేష్‌కుమార్‌తో కలిసి 'హరీశ్ అన్న సేవా సంస్థ'ను ఏర్పాటు చేశాడు. దీనికి ఓ నకిలీ రిజిస్ట్రేషన్ నెంబర్ పెట్టి, జి.మల్లేష్ గౌడ్ అధ్యక్షుడిగా, తాను ఉపాధ్యక్షుడిగా, రాజేష్ ప్రధాన కార్యదర్శిగా లెటర్‌హెడ్ ముద్రించాడు. తాను ప్రెసిడెంట్‌గా ఉన్న విషయం మల్లేష్‌కే తెలియదు. రసీదుల పుస్తకం ముద్రించాడు. దాని అట్టపై సంస్థ పేరుతో పాటు కేసీఆర్, హరీశ్‌రావు ఫొటోలు ముద్రించాడు. పుస్తకం మొదటి పేజీతో తొలి విరాళం హరీశ్‌రావు ఇచ్చినట్లు, ఆపై అనేక మంది బీఆర్ఎస్ పార్టీ ప్రముఖులు కూడా అందించినట్లు రాశాడు. దీని ఆధారంగా నగరంలోని అనేక మందిని సంప్రదిస్తూ వివిధ సామాజిక కార్యక్రమాల పేర్లు చెప్పి చందాలు వసూలు చేసి రాజేష్‌తో కలిసి జల్సాలు చేస్తున్నాడు. వీరి వ్యవహారాలపై ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం వలపన్ని వెంకటేష్, రాజేష్‌లను పట్టుకుంది. వీరి నుంచి రసీదుల పుస్తకం, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం నిందితులను పంజగుట్ట పోలీసులకు అప్పగించింది.

నడిగడ్డ ప్రజలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఎర్రవల్లిచౌరస్తా: ఆర్డీఎస్ ఆయకట్టుకు గుండె కాయలాంటి తుమ్మిళ్ల ఎత్తిపోతల పరిధిలోని మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్లను ఎప్పుడు పూర్తి చేస్తారో సీఎం కేసీఆర్ నడిగడ్డ ప్రజలకు సమాధానం చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తానని నడిగడ్డ ప్రజలకు ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక మోసం చేశారని ధ్వజమెత్తారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి స్వయంగా సీఎం కేసీఆర్ జీవో జారీ చేసినా పనులు పూర్తి కాలేదన్నారు. తుమ్మిళ్ల పరిధిలోని ఆర్డీఎస్ కాల్వలు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తన సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో ప్రతి గ్రామానికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇచ్చిన కేసీఆర్.. అలంపూర్ ప్రజలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గజ్వేల్‌లో రూ.656 కోట్లు, సిద్దిపేటలో రూ.714 కోట్లు ఖర్చు చేసిన ముఖ్యమంత్రి... తొమ్మిదేళ్లలో అలంపూర్‌కు కేవలం రూ.20 కోట్లను మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. రూ.40వేల కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ నీళ్లు నడిగడ్డ ప్రజలకు రావడం లేదన్నారు. బంగారు తెలంగాణలో బస్సు ఎరుగని గ్రామాలు ఎన్నో ఉన్నాయని, దీనివల్ల విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ఓట్ల కోసమే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. దళితుల పట్ల చిత్తశుద్ధి లేని కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఆర్ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.

అంత్యక్రియలకొచ్చి.. అనంతలోకాలకు

- బ్రదర్స్ డే రోజు .. నలుగురు అన్నదమ్ముల మృత్యువాత
- ఔరంగాబాద్‌లో రోడ్డు ప్రమాదం... అదుపు తప్పిన కారు

అక్కన్నపేట(హుస్నాబాద్): బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి వెళ్తుండగా, మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కారు అదుపు తప్పి చౌటపల్లి గ్రామానికి చెందిన నలుగురు అన్నదమ్ములు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనతో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఎరుకల కృష్ణ(47), సంజీవ్(43), సురేష్(38), వాసు(35)లు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఐదు రోజుల క్రితం స్వగ్రామంలో చిన్నాన్న ఎరుకుల కనకయ్య మృతి చెందడంతో వారంతా కుటుంబసభ్యులతో కలిసి చౌటపల్లికి వచ్చారు. అంత్యక్రియలు పూర్తి కావడంతో మంగళవారం మధ్యాహ్నం నలుగురు అన్నదమ్ములూ భార్యాపిల్లలను గ్రామంలో వదిలేసి, కారులో సూరత్‌కు బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందగా, కొద్దిసేపటికి మరొకరు మృతి చెందారు. జాతీయ అన్నదమ్ముల దినోత్సవం మే 24న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలోనూ విషాదఛాయలు అలముకున్నాయి.



నలుగురు అన్నదమ్ములు(ఫైల్)

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. పాలమూరు విద్యార్థి మృతి



మహేశ్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలమూరు జిల్లాకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందాడు. భూత్పూర్ మండలంలోని కప్పెటకి చెందిన బోయ శకుంతల, వెంకట్రాములు దంపతుల పెద్ద కుమారుడు బోయ మహేశ్ (25) ఎమ్మెస్ కోసం 2022 లో అమెరికా లోని మిన్నసోటా రాష్ట్రానికి వెళ్లాడు. అక్కడి కన్‌కోర్డియా యూనివర్సిటీలో ఎమ్మెస్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లి మంగళవారం రాత్రి తిరిగి వస్తున్నాడు. వారు ప్రయాణిస్తున్న కారుకు జింక ఎదురొచ్చింది. జింకను తప్పించబోయి కారును చెట్టుకు ఢీకొట్టాడు. కారు బోల్తాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే యూనివర్సిటీలో చదువుతున్న విజయవాడకు చెందిన రేవంత్.. ప్రమాదం విషయాన్ని మహేష్ తండ్రి వెంకట్రాములకు ఫోన్ చేసి చెప్పాడు.

క్లుప్తంగా

పిచ్చి మోదీ: అధీర్

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై వివాదం

కోల్‌కతా: రూ.2,000 నోట్ల ఉపసంహరణను ఆక్షేపిస్తూ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి బుధవారం చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ''మోదీ పట్ల దేశ ప్రజలకు విముఖత పెరిగిపోతోంది. మోదీని పిచ్చి (పగ్లా) మోదీగా ప్రజలు భావిస్తున్నారు'' అన్నారు. వీటిపై బీజేపీ మండిపడింది. అధీర్ ఓ నేరగాడంటూ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ దుయ్యబట్టారు. తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై వివాదం చెలరేగడంతో, ప్రజల మనోభావాలను తాను బయట పెట్టానని అధీర్ అన్నారు.

మాకు మద్దతివ్వండి

ఉద్ధవ్ ఠాక్రేకు కేజ్రీవాల్ విజ్ఞప్తి



ముంబై: నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టుపై విశ్వాసం లేదని, అందుకే ఢిల్లీలో పాలనాధికారాలపై నియంత్రణ కోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఆయన బుధవారం ముంబైలో శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రేతో సమావేశమయ్యారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి మద్దతివ్వాలని ఠాక్రేను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్డినెన్స్‌పై రాజ్యసభలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును వ్యతిరేకిస్తామని ఉద్ధవ్ హామీ ఇచ్చారన్నారు. సభలో ఈ బిల్లు విఫలమైతే 2024లో బీజేపీ ఓటమి తథ్యమని చెప్పారు. తమ పోరాటం కేవలం ఢిల్లీ కోసం కాదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సమాఖ్య వ్యవస్థ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను ఓడించడానికి తాము చేతులు కలిపామని ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఈసారి బీజేపీని ఓడించకపోతే దేశంలో ఇక ప్రజాస్వామ్యం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఠాక్రే వర్గం శివసేనకు రాజ్యసభలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. కేజ్రీవాల్ మంగళవారం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలిసి, మద్దతు కోరిన సంగతి తెలిసిందే.

20 వేలమందిని బఖ్‌ముత్‌లో కోల్పోయాం

రష్యా ప్రైవేట్ ఆర్మీ చీఫ్ వెల్లడి

కీవ్: తూర్పు ఉక్రెయిన్‌లోని బఖ్‌ముత్ నగరంలో తమకు భారీ నష్టం వాటిల్లిందని రష్యా ప్రైవేట్ సైన్యమైన 'వాగ్నర్' చీఫ్ యెవ్గెనీ ప్రిగోజిన్ వెల్లడించారు. ఉక్రెయిన్ సేనలతో జరిగిన పోరాటంలో 20,000 మందికిపైగా సైనికులను కోల్పోయామని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. రష్యా ప్రభుత్వం ఖైదీలకు, వివిధ కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్నవారికి కొంత శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ సైన్యంగా మార్చి, ఉక్రెయిన్‌లో యుద్ధ రంగానికి పంపిస్తున్న సంగతి తెలిసిందే. బఖ్‌ముత్‌లో గత తొమ్మిది నెలలుగా సాగుతున్న హోరాహోరీ యుద్ధంలో ఉక్రెయిన్ జవాన్లు ఎంతమంది మరణించారన్నది తెలియరాలేదు. దీనిపై ఉక్రెయిన్ సైన్యం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. పది వేల మందికి పైగానే ఉక్రెయిన్ సైనికులు మరణించి ఉంటారని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పార్లమెంటు భవన ప్రారంభంపై రాజకీయ రగడ	మోదీ ప్రారంభించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్న విపక్షాలు	రాష్ట్రపతికి అవమానంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉమ్మడి ప్రయత్నం	బీజేపీపై పోరుకు 'ప్రారంభం'గా మలచుకునే వ్యూహం	ప్రారంభించాల్సింది విధిగా రాష్ట్రపతేనా! ప్రధానైనా పర్లేదా!	గతానుభవాలు, సంప్రదాయాలు చెబుతున్నదేంటి..?

ప్రారంభ 'గౌరవం'పై.. పెను దుమారం

పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవంపై రాజకీయ రగడ తీవ్ర రూపు దాలుస్తోంది. కొత్త భవన ప్రారంభోత్సవం ఈ నెల 28న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనుండటం తెలిసిందే. అయితే కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగాధిపతి, దేశాధిపతి, ప్రథమ పౌరుడైన రాష్ట్రపతిని కాదని ప్రధాని ఎలా ప్రారంభిస్తారంటూ ముక్త కంఠంతో ఆక్షేపిస్తున్నాయి. భవనాన్ని ప్రారంభించాల్సిందిగా మోదీని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆహ్వానించడంపై మండిపడుతున్నాయి. అంతేగాక వి.డి. సావర్కర్ వంటి హిందూత్వవాది జయంతి రోజునే ప్రారంభోత్సవం జరపనుండటాన్ని కూడా విపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని ఒకే వర్గానికి పరిమితయ్యే రోజున చేయనుండటం తప్పేనని వాదిస్తున్నాయి. దాంతో ఈ వివాదం అంతకంతకూ పెద్దదవుతోంది. చివరికి పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్‌తో సహా ఏకంగా 19 ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించే దాకా వెళ్లింది. 2024 లోక్‌సభ ఎన్నికలు అంతకంతకూ సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీపై నిర్ణాయకమైన సమైక్య పోరుకు పార్లమెంటు భవనం అంశంతోనే శ్రీకారం చుట్టే యోచనలో విపక్షాలున్నట్టు కనిపిస్తోంది. మొత్తమ్మీద జాతీయ రాజకీయాల్లో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకునే వాతావరణం కనిపిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఏడాది ముందే ఎన్నికల వేడి రాజుకుంటోందనేందుకు దీన్ని స్పష్టమైన సూచికగా భావిస్తున్నారు.



ప్రతిపక్షాల అభ్యంతరాలేంటి..?

పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలని ప్రతిపక్ష పార్టీలు వాదిస్తున్నాయి. అవేమంటున్నాయంటే...

- ఆర్టికల్ 79 ప్రకారం ఉభయ సభలైన లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి కలిస్తేనే పార్లమెంటు.
- సాధారణంగా అంతా రబ్బరు స్టాంపుగా పరిగణించే భారత రాష్ట్రపతి పదవికి రాజ్యాంగం అంతటి ప్రాధాన్యం కట్టబెట్టింది.
- ఉభయ సభలకు అధిపతి గనుక దేశ ప్రథమ పౌరుని హోదాలో కొత్త భవనాన్ని ప్రారంభించే హక్కు కచ్చితంగా రాష్ట్రపతిదే.
- ఎందుకంటే ప్రధాని పార్లమెంటులోని ఒక అంగమైన లోక్‌సభకు మాత్రమే నేతృత్వం వహిస్తారు.
- ఆ కోణం నుంచి చూస్తే రాజ్యాంగపరంగా కూడా పార్లమెంటు భవనాన్ని ప్రధాని ఆవిష్కరించడానికి వీల్లేదు.
- ఏటా పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించే అధికారం, సార్వత్రిక ఎన్నికల తర్వాత ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసే అధికారం ఆర్టికల్ 87 ప్రకారం రాష్ట్రపతిదే.
- పార్లమెంటు ఆమోదించే బిల్లులన్నీ ఆర్టికల్ 111 మేరకు రాష్ట్రపతి సంతకంతో మాత్రమే చట్ట రూపం దాలుస్తాయి.
- అలాంటప్పుడు రాష్ట్రపతిని ఉద్దేశపూర్వకంగా విస్మరించడం అధికార బీజేపీ అహంకారానికి, లెక్కలేనితనానికి తాజా నిదర్శనం.

గతానుభవాలు ఏం చెబుతున్నాయి?


ఇలాంటి విషయాల్లో నిర్దిష్టంగా ఇలా వ్యవహరించాలంటూ నియమ నిబంధనలేవీ లేవు. కాకపోతే గత ప్రధానులు తమ వ్యవహార శైలి ద్వారా వీటి విషయమై చక్కని సంప్రదాయాలను నెలకొల్పి ఉంచారన్నది విపక్షాలు చెబుతున్న మాట. వారిలో కేంద్రం బీజేపీ ప్రభుత్వానికి సారథ్యం వహించిన వాజ్‌పేయి కూడా ఉన్నారని గుర్తు చేస్తున్నాయి. ఆ సంప్రదాయాలను పాటించడం విజ్ఞత అనిపించుకుంటుందని అవి అభిప్రాయపడుతున్నాయి. విపక్షాలు ఏమంటున్నాయంటే...

నాడు 'గాంధీ' గిరి..

లోక్‌సభ సచివాలయమైన 'పార్లమెంట్ హౌస్ ఎస్టేట్' ప్రచురణల రికార్డుల ప్రకారం పార్లమెంటు అనుబంధ భవన నిర్మాణానికి 1970 ఆగస్టు 3న నాటి రాష్ట్రపతి వి.వి.గిరి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యాక భవనాన్ని 1975 అక్టోబర్ 24న నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారు. అంటే రెండు కార్యక్రమాలుగా ఇద్దరూ పంచుకున్నారు. అలా చూసినా పార్లమెంటు కొత్త భవన నిర్మాణానికి 2020 డిసెంబర్ 10న మోదీ భూమి పూజ చేశారు. కనుక ప్రారంభోత్సవం రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జరగాలన్నది విపక్షాల వాదన.

వాజ్‌పేయిదీ అదే బాట...

2002లో వాజ్‌పేయి హయాంలో కొత్తగా నిర్మించిన పార్లమెంటు లైబ్రరీ భవనాన్ని నాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ ప్రారంభించారు. లోక్‌సభ సచివాలయం సంప్రదాయాల ప్రకారం భవనాన్ని ప్రారంభించాల్సిందిగా రాష్ట్రపతినే స్పీకర్ ఆహ్వానించారు. ఇప్పుడు కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తూ పార్లమెంటు కొత్త భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలన్నది విపక్షాల డిమాండ్. ''2002లో కేంద్రంలో ఉన్నది మీ బీజేపీ ప్రభుత్వమే. వాజపేయి ప్రధాని హోదాలో రాష్ట్రపతి పదవికి అలాంటి గౌరవమిచ్చారు. కనీసం దీన్నుంచైనా మోదీ నేర్చుకోవాలి'' అని మోదీకి విపక్ష నేతలు హితవు పలుకుతున్నారు.



అలాంటి అవమానాలు వద్దు

రాష్ట్రపతి కేవలం దేశ ప్రథమ పౌరుడు మాత్రమే కాదు. ఆర్టికల్ 53 ప్రకారం త్రివిధ బలగాలకు సుప్రీం కమాండర్. మోదీ చేయబోతున్న పని అక్షరాలా అలాంటి దేశ అత్యున్నత పదవిని విస్మరించడం, కించపరచడమేనని విపక్షాలంటున్నాయి. రాష్ట్రపతిని ఇలా అవమానిస్తుంటే సహించేది లేదంటూ గట్టిగా హెచ్చరిస్తున్నాయి. రాష్ట్రపతినిలా న్యూనత పరచడం మోదీకి కొత్తేమీ కాదంటూ గత ఉదంతాలను గుర్తు చేస్తున్నాయి. ''2019 ఫిబ్రవరి 25న ఢిల్లీలో నేషనల్ వార్ మెమోరియల్‌ను ప్రధాని హోదాలో మోదీయే ప్రారంభించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కార్యక్రమానికి దూరం పెట్టి ఘోరంగా అవమానించారు. గణతంత్ర పరేడ్‌లో త్రివిధ బలగాల నుంచి రాష్ట్రపతే గౌరవ వందనం స్వీకరిస్తారు. యుద్ధంలో వీరమరణం పొందే సైనిక యోధులకు వీర చక్ర, అశోక చక్ర వంటి గౌరవ పురస్కారాలనూ ఆయనే ప్రదానం చేస్తారు. అలాంటిది యుద్ధ వీరుల జ్ఞాపకార్థం నిర్మించిన వార్ మెమోరియల్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతికి భాగస్వామ్యమే లేకుండా చేయడం అతి పెద్ద తప్పిదం. మోదీ లెక్కలేనితనానికి ఇది రుజువు'' అంటూ మండిపడుతున్నాయి. కనీసం ఇప్పుడైనా అలాంటి తప్పిదాన్ని పునరావృతం చేయొద్దని సూచిస్తున్నాయి.

కేంద్రం ఏమంటోంది.?

ఎటుపోయి ఎటొస్తుందోనని పార్లమెంటు భవనం ప్రారంభోత్సవ రగడపై ఇప్పటిదాకా నోరు మెదపని బీజేపీ నేతలు ఇప్పుడిక తప్పనిసరై ఒక్కోలా స్పందిస్తున్నారు. బహిష్కరణ నిర్ణయంపై విపక్షాలు పునరాలోచించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అనునయించే ధోరణిలో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రం, 'కార్యక్రమానికి అందరినీ ఆహ్వానించాం. రావడం, రాకపోవడమన్నది వారి విజ్ఞతకే వదిలేస్తాం' అంటూ కుండబద్దలు కొట్టడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

బంధాన్ని భంగపరిస్తే సహించం

- ఆస్ట్రేలియాలో ఆలయాలపై వేర్పాటువాదుల దాడులపై ప్రధాని మోదీ ఆగ్రహం
- భేటీ సందర్భంగా అల్బనీస్‌తో ద్వైపాక్షిక అంశాలపై విస్తృత చర్చ

సిడ్నీ: ఖలిస్తాన్ వేర్పాటువాద మూకలు ఆస్ట్రేలియాలో ఆలయాలపై దాడులకు తెగబడటాన్ని భారత ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఆస్ట్రేలియా, భారత్ బంధానికి భంగం కల్గించేలా జరుగుతున్న ఇలాంటి కుట్రలను సహించేది లేదని కరాఖండిగా చెప్పేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మోదీ ఆ దేశ ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌తో విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ తర్వాత అల్బనీస్ సమక్షంలోనే మీడియాతో మాట్లాడారు. 'భారత్, ఆస్ట్రేలియాల స్నేహపూర్వక సంబంధాలకు హాని తలపెట్టే ఎలాంటి శక్తులనైనా ఉపేక్షించేది లేదు. ఈ అంశంలో కఠినంగా వ్యవహరిస్తున్న అల్బనీస్‌కు నా కృతజ్ఞతలు. హిందూ ఆలయాలపై ఖలిస్తాన్ వేర్పాటువాదుల ఆగడాలను అణచేసేందుకు, ఖలిస్తాన్ మూకల కార్యకలాపాలపై ఇకమీదటా కఠిన చర్యలను కొనసాగిస్తానని అల్బనీస్ మరోసారి నాకు మాటిచ్చారు' అని మోదీ ప్రకటించారు.

టీ20 వేగంతో బంధం బలోపేతం

భారత్, ఆస్ట్రేలియా సత్సంబంధాల బలోపేతాన్ని క్రికెట్ పరిభాషలో మోదీ సరదాగా చమత్కరించారు. ''రెండు దేశాల మైత్రీ బంధం వేగంగా బలపడుతోంది. క్రికెట్‌కు వేగాన్ని తెచ్చిన టీ–20 మోడ్‌లోకి వచ్చేసింది. రెండేళ్లలో ఇక్కడికి రెండుసార్లు వచ్చా. ఏడాదిలో ఇది మా ఆరో భేటీ. ఇరుదేశాల బంధంలో పరిణతికి, సత్సంబంధాలకు ఇది నిదర్శనం. ఈసారి భారత్‌లో జరగబోయే క్రికెట్ ప్రపంచ కప్ పోటీలను వీక్షించేందుకు అల్బనీస్‌ను, ఆస్ట్రేలియాలోని క్రికెట్ వీరాభిమానులకు ఇదే నా ఆహ్వానం. ఇదే సమయంలో దీపావళి పర్వదిన వేడుకలు చూడొచ్చు. అల్బనీస్‌తో నిర్మాణాత్మక చర్చలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమున్నత శిఖరాలకు చేరుస్తాయి'' అన్నారు. ఆస్ట్రేలియాలోని పలు వ్యాపారసంస్థల సీఈవోలతో కూడా మోదీ మాట్లాడారు. పలు రంగాల్లో భారత్‌లో పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. భారత్‌లోని డిజిటల్ ఆర్థిక, నవకల్పనల వ్యవస్థను ఆస్ట్రేలియాలోని వ్యాపారాలతో అనుసంధానించాలని అల్బనీస్ ఆకాంక్షించారు.



త్రివర్ణ పతాక కాంతులున్న సిడ్నీ ఒపెరా హౌజ్ ముందు మోదీ, అల్బనీస్ అభివాదం

మేం రాం రాం

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నాం ● 19 విపక్ష పార్టీల ప్రకటన

- పార్లమెంటు ప్రజలది, పార్టీలన్నింటిదీ: వైఎస్సార్‌సీపీ
- రాజకీయాలకు అతీతమైన కార్యక్రమం: వైఎస్ జగన్
- ప్రజాస్వామిక స్ఫూర్తితో పాల్గొంటున్నట్టు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవాన్ని బహిష్కరించాలని విపక్షాలు నిర్ణయించాయి. 28న జరగనున్న ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు 19 విపక్ష పార్టీలు ప్రకటించాయి. రాష్ట్రపతిని పూర్తిగా పక్కన పెడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కార్యక్రమం జరుపుతుండటానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించాయి. కేంద్రం చర్యను ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేడీ(యూ), ఆప్, ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్), సీపీఎం, సీపీఐ, ముస్లిం లీగ్, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్ (ఎం), ఆర్ఎస్‌పీ, వీసీకే, ఎండీఎంకే, ఆర్ఎల్‌డీ ఈ మేరకు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కాగా, ప్రారంభోత్సవంలో పాల్గొంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాజసం ఉట్టిపడేలా సువిశాలమైన పార్లమెంటు నూతన భవనాన్ని జాతి కోసం నిర్మించినందుకు ప్రధాని మోదీకి అభినందనలంటూ ఆయన ట్వీట్ చేశారు. బిజూ జనతాదళ్, అకాలీదళ్ కూడా పాల్గొంటుండగా టీడీపీ, అన్నాడీఎంకే వైఖరి వెల్లడించలేదు. అవి కూడా పాల్గొనవచ్చని చెబుతున్నారు.

మాటవరసకైనా అడగరా?

శతాబ్దానికోసారి మాత్రమే జరిగే పార్లమెంటు భవనం వంటి నిర్మాణంపై మాటవరసకైనా ప్రజలతో, విపక్ష ఎంపీలతో కేంద్రం చర్చించలేదంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. ''కొత్త భవన ప్రారంభోత్సవం చరిత్రాత్మక సందర్భం. విభేదాలు పక్కనబెట్టి అందులో పాల్గొనాలని భావించాం. కానీ ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తీరని హాని చేస్తోంది. రాష్ట్రపతిని కాదని భవనాన్ని మోదీ ప్రారంభించడం ఘోర అవమానం. ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి. పార్లమెంటులో రాష్ట్రపతి అంతర్భాగం. అయినా రాష్ట్రపతి లేకుండా పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రారంభించేందుకు మోదీ సిద్ధమైపోయారు. ఈ అప్రతిష్ట చర్య రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘిస్తుంది. తొలి ఆదివాసీ మహిళ రాష్ట్రపతి అయ్యాక ప్రజల్లో వెల్లువెత్తిన సమ్మిళిత భావనను కేంద్రం చర్య అణచేస్తోంది. పార్లమెంటును తూతూ మంత్రంగా మార్చేసిన మోదీకి అప్రజాస్వామిక చర్యలు కొత్తేమీ కాదు'' అన్నాయి. విపక్షాలు పునరాలోచించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సూచించారు. ''వారిది అనవసర రాద్ధాంతం. పార్లమెంటు అనుబంధ భవనాలను కాంగ్రెస్ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ ప్రారంభించారు'' అన్నారు.

ప్రజాస్వామ్యపు ఆలయం: వైఎస్ జగన్

పార్లమెంటును మన ప్రజాస్వామ్య ఆలయంగా వైఎస్ జగన్ అభివర్ణించారు. ''జాతి ఆత్మకు ప్రతీకైన పార్లమెంటు దేశ ప్రజలతో పాటు రాజకీయ పార్టీలన్నింటికీ చెందుతుంది. ఇలాంటి శుభకార్యాన్ని బహిష్కరించడం నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తి అనిపించుకోదు'' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. రాజకీయ విభేదాలన్నింటినీ పక్కన పెట్టి ఈ మంచి కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా అన్ని పార్టీలనూ కోరుతున్నట్టు చెప్పారు. నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తిని పాటిస్తూ తమ పార్టీ ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొంటుందని వెల్లడించారు.


అహంకారపు ఇటుకలతో కట్టేది కాదు: రాహుల్ ట్వీట్

''పార్లమెంటు భవన ప్రారంభోత్సవం రాష్ట్రపతి చేతుల మీదుగా జరగకపోవడం, ఆమెకు పిలుపే లేకపోవడం అత్యున్నత రాజ్యాంగ పదవిని అవమానించడమే. పార్లమెంటు రాజ్యాంగ విలువలపై నిర్మితమైన ప్రజాస్వామ్య ఆలయం. అహంకారపు ఇటుకలతో కట్టేది కాదు'' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హిందీలో ట్వీట్ చేశారు.



జార్ఖండ్‌లో అంతరించిపోతున్న గిరిజన తెగ బృందం బహూకరించిన టోపీ ధరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మనోహర్ జోషి పరిస్థితి ఆందోళనకరం



ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి ఆరోగ్య స్థితి ఆందోళనకరంగా మారింది. శివసేన సీనియర్ నేత అయిన జోషిని మెదడులో రక్తస్రావంతో రెండు రోజుల క్రితం హుటాహుటిన ముంబైలోని పీడీ హిందూజా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన స్పృహలోలేరని, దాదాపు కోమాలో ఉన్నారని ఆయన కుమారుడు ఉన్మేశ్ సోమవారం చెప్పారు. '85 ఏళ్ల జోషి ఐసీయూలో ఉన్నా వెంటిలేటర్ సాయంలేకుండా సాధారణ శ్వాస తీసుకుంటున్నారు. ప్రస్తుత రక్తస్రావం పరిస్థితి అదుపులో ఉంది' అని ఆస్పత్రి ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఆయన భార్య రష్మీ ఆస్పత్రికి వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెల్సుకున్నారు. 1995లో బీజేపీతో పార్టీ సంకీర్ణం అయ్యాక మహారాష్ట్రలో శివసేన నుంచి తొలిసారిగా ముఖ్యమంత్రి పదవి పొందిన వ్యక్తి జోషియే. 1966లో శివసేన స్థాపించాక అప్పటినుంచీ జోషి అందులో సభ్యునిగా కొనసాగుతున్నారు. లోక్‌సభకు గతంలో స్పీకర్‌గా వ్యవహరించారు. ముంబై మేయర్‌గా సేవలందించారు. మహారాష్ట్ర శాసనసభలో విపక్షనేతగా కొనసాగారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు.

రాజదండం సాక్షిగా...

పార్లమెంటులో చోళుల సెంగోల్

అధికార మార్పిడికి ప్రతీక	బ్రిటిష్ వాళ్ల నుంచి నెహ్రూకు	ప్రస్తుతం అలహాబాద్ మ్యూజియంలో	సెంగోల్ నేపథ్యం వెల్లడించిన అమిత్ షా	స్పీకర్ స్థానం వద్ద ప్రతిష్టిస్తారని వెల్లడి

న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా చోళుల నాటి ఓ పురాతన ఆచారానికి తిరిగి ప్రాణప్రతిష్ట జరగనుంది. అధికార బదిలీకి ప్రతీకగా శతాబ్దాల తరబడి చోళ రాజులు తమ వారసుని చేతికందిస్తూ వచ్చిన రాజదండాన్ని లోక్‌సభలో ప్రతిష్ఠించనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలను సహచర మంత్రులు కిషన్‌రెడ్డి, అనురాగ్ ఠాకూర్‌లతో కలిసి బుధవారం ఆయన మీడియాకు వివరించారు. ''సెంగోల్‌గా పిలిచే ఆ దండం నీతీ నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ ధర్మబద్ధంగా పాలన సాగిస్తామని చెప్పేందుకు ప్రతీక. నాడైనా నేడైనా సెంగోల్ ప్రతిష్ఠాపన వెనక ఉద్దేశం సుస్పష్టం. అధికార మార్పిడంటే కేవలం కరచాలనమో, దస్తావేజులపై సంతకాలో కాదు. ఆ ప్రక్రియ దేశ సంస్కృతీ సంప్రదాయాలతో లోతుగా ముడిపడి ఉండాలి. అదే సమయంలో ఆధునిక అవసరాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. ప్రధాని మోదీ సుదూర ధర్మదృష్టికి పార్లమెంటు నూతన భవనం ప్రతీక. అందులో సెంగోల్ కొలువుదీరడం సబబుగా ఉంటుందని ఆయన భావించారు'' అని చెప్పారు. అలాగే పార్లమెంటు భవన నిర్మాణంలో పాలుపంచుకున్న శ్రమ యోగులైన 60 వేల మంది కార్మికులను కూడా ఈ సందర్భంగా మోదీ సన్మానిస్తారన్నారు.

ఆ అర్ధరాత్రి నెహ్రూ చేతికి...

''1947 ఆగస్టు 14న జరిగిన అధికార బదిలీ ప్రక్రియకు తమిళనాడు నుంచి అధీనం పూజారి, గాయకుడు (ఒడువర్)తో పాటు నాదస్వర కళాకారుడు రాజారత్నం పిళ్లైని ప్రత్యేకంగా రప్పించారు. వారు ఆచారం ప్రకారం నిర్వహించాల్సిన ప్రక్రియల నడుమ సెంగోల్‌ను తీసుకొచ్చారు. పూజారి దాన్ని లాంఛనంగా మౌంట్‌బాటెన్‌కు అందజేసిన అనంతరం పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. ఊరేగింపుగా నెహ్రూ నివాసానికి తీసుకెళ్లి ఆ సందర్భం కోసం ప్రత్యేకించిన గీతాలాపన నడుమ ఆయనకు అప్పగించారు. ఇదంతా ఆ రాత్రి వేళ చోటుచేసుకుంది. చరిత్ర పుటల్లో మరుగున పడిపోయిన ఎవరికీ పెద్దగా తెలియని ఈ వృత్తాంతంపై సమగ్రమైన పరిశోధనకు మోదీ ఆదేశించారు. ప్రజాస్వామ్య మందిరమైన పార్లమెంటులో సెంగోల్‌ను ప్రతిష్ఠించడం అత్యంత సబబుగా ఉంటుందని నిర్ణయించారు'' అని అమిత్ షా తెలిపారు. నాటి సెంగోల్ తయారీలో పాలుపంచుకున్న వుమ్మిడి యతిరాజులు (96), వుమ్మిడి సుధాకర్ (88) కూడా 28న ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనే అవకాశముంది. సెంగోల్‌ను ఇప్పటికే అలహాబాద్ మ్యూజియం నుంచి ఢిల్లీ తరలించారు.



కుమారస్వామి తంబిరన్ సమక్షంలో రాజదండంతో నెహ్రూ



ప్రత్యేకతలెన్నో..

- పలు ప్రత్యేకతలు సెంగోల్ సొంతం. దీన్ని తమిళంలో ఆనై అని పిలుస్తారు.
- సెంగోల్ అనే పదం తమిళ పదమైన సెమ్మై నుంచి వచ్చింది.
- సెమ్మై అంటే ధర్మమని అర్థం.
- చోళుల హయాంలో సెంగోల్‌ను వెండితో తయారు చేసి బంగారు పూత పూసేవారు.
- సెంగోల్‌లోని ప్రతి చిహ్నానికీ నిగూఢమైన అర్థముంది. ఒక్కోటీ ఒక్క దానికి ప్రతీక.
- ఉదాహరణకు సెంగోల్‌పై ఉండే నంది న్యాయానికి ప్రతీక.
- చోళుల కాలంలో 7వ శతాబ్దం నాటి తమిళ సాధువు, కవి తిరుజ్ఞాన సంబంధర్ రాసి స్వరపరిచిన ప్రత్యేక గీతాలాపన నడుమ సెంగోల్ ప్రక్రియ సాగేదట.

ప్రస్తుత సెంగోల్‌ది ఘనమైన నేపథ్యం

లోక్‌సభలో ప్రతిష్ఠించనున్న సెంగోల్‌కు ఘనమైన నేపథ్యముందని అమిత్ షా వివరించారు. ''బ్రిటిష్ వారినుంచి అధికార మార్పిడికి ప్రతీకగా చివరి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటెన్ 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి తొలి ప్రధాని నెహ్రూకు సెంగోల్‌నే అందజేశారు. అధికార మార్పిడికి ప్రతీకగా ఎలాంటి ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుందని మౌంట్‌బాటెన్ ఆరా తీయడంతో దీనికి బీజం పడింది. నెహ్రూ కోరగా చోళుల కాలంలో రాజు తన వారసునికి అధికారాన్ని బదలాయించేందుకు అనుసరించిన సెంగోల్ ప్రక్రియను రాజాజీ సూచించారు. 500 ఏళ్ల నాటి 'తిరువావదుత్తురై అధీనం (మఠం)' అధిపతి ద్వారా చెన్నైలో వుమ్మిడి బంగారు చెట్టి అనే నగర వ్యాపారిని పురమాయించి సెంగోల్‌ను తయారు చేయించారు'' అని చెప్పారు.

లోయలోకి వాహనం పల్టీ...

ఏడుగురు కార్మికుల మృతి

జమ్మూ: విద్యుత్ ప్రాజెక్టులో పనిచేసే కార్మికులతో వెళ్తున్న వాహనం లోయలోకి పల్టీలు కొట్టడంతో ఏడుగురు మరణించిన ఘటన జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిష్త్‌వార్ జిల్లాలోని దచన్ సమీపంలోని దాంగ్‌దూరు విద్యుత్ ప్రాజెక్ట్ దగ్గర్లో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ప్రాజెక్ట్ సైట్ సమీపంలో ప్రమాదం జరగడంతో వందలాది మంది కార్మికులు ఘటనాస్థలికి చేరుకుని మృతుల కుటుంబాలకు కంపెనీనే నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు తక్షణ ఆర్థికసాయం అందించాలని నిరసనకు దిగారు. భారీ వర్షం పడుతుండటంతో డ్రైవర్‌కు సరిగా కనిపించకపోవడంతో కొండ మలుపులో వాహనం అదుపుతప్పింది. దీంతో కొండ నుంచి వందల మీటర్ల లోయలోకి వాహనం పల్టీకొట్టి పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో ఇద్దరు జార్ఖండ్ కార్మికులుసహా ఏడుగురు మరణించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సహా పలు పార్టీల నేతలు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

కొత్త పాస్‌పోర్టు కోసం ఎన్‌ఓసీ ఇవ్వండి: రాహుల్

న్యూఢిల్లీ: కొత్తగా సాధారణ పాస్‌పోర్టు పొందడానికి వీలుగా నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) జారీ చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారంలోగా లిఖిత పూర్వకంగా స్పందించాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామిని ఢిల్లీ మెట్రోపాలిటన్ కోర్టు బుధవారం ఆదేశించింది. ఎంపీగా అనర్హత వేటు పడడంతో రాహుల్ గాంధీ తన డిప్లొమాటిక్ పాస్‌పోర్టుతోపాటు ఇతర ప్రయాణ అనుమతి పత్రాలను ఇప్పటికే సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో విదేశాలకు వెళ్లడానికి సాధారణ పాస్‌పోర్టు కావాలని, అందుకు ఎన్‌ఓసీ మంజూరు చేయాలని కోరుతూ రాహుల్ మంగళవారం ఢిల్లీ మెట్రోపాలిటన్ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ ఈ నెల 31 నుంచి పది రోజులపాటు అమెరికాలో పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

సాక్షి కరీంనగర్

గురువారం । 25 । మే । 2023



‘ఆమె’కు భరోసా

కరీంనగర్ షీటీం బృందాలు ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నాయి. ఇటీవల ఫోన్‌నంబరు మారగా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. 8లో▸



పునర్వసు ప్రత్యేక పూజలు

వేములవాడ: రాజన్నను బుధవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0/29.0

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కబోత పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం పాక్షికంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ బుధవారం పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న డీఆర్సీసీ సెంటర్‌ను తనిఖీ చేశారు. 22, 29వ వార్డుల్లో పారిశుధ్య పనులు, ఆర్‌ఆర్ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. బోర్నపల్లి 14వ వార్డులో నిర్వహిస్తున్న ఎనిమల్ బర్త్ కేర్ (ఏబీసీ)సెంటర్ నిర్వహణ, ఇప్పల నర్సింగాపూర్ 10వవార్డులో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును పరిశీలించారు. 2వ వార్డు గణేశ్‌నగర్‌లో వైకుంఠధామం పనులు పరిశీలించి, త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఈఈపీహెచ్ సంపత్ రావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ సాంబరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైద్యకళాశాలకు 26మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ నూతన మెడికల్ కళాశాలకు ఏక మొత్తంలో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. జనరల్ సర్జరీ 4, జనరల్ మెడిసిన్, ఓబీజీ, అనస్థీషియా విభాగాల్లో మూడేసి చొప్పున, పిడియాట్రిక్స్‌లో ఇద్దరు, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, డీవీఎల్, సైకియాట్రీ, రెడియోడయోగ్నోసిస్, అర్థోపెడిక్స్, ఈఎన్టీ, అడ్మినిస్ట్రేషన్లో ఒక్కోటి చొప్పున మొత్తం 26 అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

జమ్మికుంటలో పత్తిధర రూ.7,050



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,050 పలికింది. బుధవారం మార్కెట్‌కు 28వాహనాల్లో 330 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,950, కనిష్ట ధర రూ.6,700 పలికింది. గన్నీ సంచుల్లో ఒక రైతు 5క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చాడు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5,000లకు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను కార్యదర్శిగూగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మానకొండూర్: ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కె.లలితాదేవి సూచించారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. పలువురు రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. చెంజర్ల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. డాక్టర్ కిరణ్‌కుమార్, సీహెచ్‌వో రాజునాయక్ పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు తక్షణం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి, దత్తోజీపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో జూన్ 6న, కరీంనగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించే రెడ్డి ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు చింతల శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, అనంతరెడ్డి, అజయ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అఫిడవిట్ ఉంటేనే దళితబంధు!



- జీఎస్టీ గుర్తింపు ఉన్న వ్యాపారులు ఇస్తే సరి
- కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కొత్త విధానం
- దళారీ వ్యవస్థ.. నకిలీ కంపెనీలకు ముకుతాడు
- అక్రమాలు జరగకుండా చర్యలు
- త్వరలో 3,100 మందికి రెండో విడత డబ్బుల పంపిణీ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో అధికారులు కొత్త షరతు విధించారు. నిధులు దుర్వినియోగం కాకుండా కరీంనగర్ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టారు. రెండో విడత దళితబంధు కోసం దరఖాస్తు చేసుకునే వారంతా కొటేషన్, వ్యాపారి జారీచేసే అఫిడవిట్ కలిగి ఉండాలని నిబంధన పెట్టారు. హుజూరాబాద్‌లో లబ్ధిదారులకు నిధుల మంజూరులో సమస్యలు తలెత్తాయన్న విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన సీరియస్ అయ్యారని సమాచారం. అందుకే, యూనిట్లకు సంబంధించి విస్తరణ, వ్యాపారవృద్ధిలో పారదర్శకతను మరింత పెంచేలా చర్యలు చేపట్టారు. ఇకపై రెండో విడత కోసం దరఖాస్తు చేసుకునే ప్రతీ లబ్ధిదారుడు తాను సామగ్రి తీసుకునే వ్యాపారి నిజాయతీని చాటేలా అఫిడవిట్ ఇవ్వాల్సిందేనన్న రూల్ అమల్లోకి తీసుకువచ్చారు. క్షేత్రస్థాయిలో అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దళితబంధు పథకం అమలులో కొందరు నేతలు కమీషన్లు తీసుకుంటున్నారన్న సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో కలెక్టర్ తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేపథ్యమిదీ..

హుజరాబాద్ ఉప ఎన్నికకు ముందు దళితుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితబంధు ప్రారంభించింది. పథకంలో భాగంగా అర్హులైన ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. ఆర్థిక అసమానతలను రూపుమాపడం ద్వారా దళితులంతా సామాజిక సమానత్వం సాధించాలన్న లక్ష్యంతో ఈ పథకానికి సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారు. నియోజకవర్గంలోని శాలపల్లి వేదికగా పథకాన్ని ముఖ్యమంత్రి లబ్ధిదారులకు స్వయంగా చెక్కులు అందజేసి ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు రెండేళ్ల కాలంలో హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, జమ్మికుంట, కమలాపూర్ (హన్మకొండ జిల్లా) మండలాల్లో లబ్ధిదారులను గుర్తించి మొత్తం 18,021 దళిత కుటుంబాలకు యూనిట్లు మంజూరు చేశారు. ఇందులో 14,080 కుటుంబాలు కరీంనగర్ జిల్లాలో ఉండగా.. మిగిలిన 3,941 కుటుంబాలు కమలాపూర్ మండలంలో ఉన్నాయి.

గోల్‌మాల్‌కు యత్నం?

జిల్లాలో మొత్తం 18,021 మంది దళితబంధు కోసం దరఖాస్తు చేసుకోగా 14,080 మంది అర్హులని అధికారులు తేల్చారు. వీరిలో 10,970 కుటుంబాలకు పూర్తిస్థాయిలో రూ.10 లక్షల (రూ.9.80 లక్షల, రూ. 20 వేలు బీమా) మేర ఆర్థిక సాయం అందించారు. ఇందులో వివిధ వ్యాపారాలతోపాటు, తయారీ, ఉత్పత్తి, డెయిరీ, పౌల్ట్రీ మోటారు వాహనయూనిట్లు , మిగిలిన 3,100 మంది మాత్రం రిటైల్ యూనిట్లు ఎంచుకున్నారు. తొలివిడతగా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిధులు డ్రాచేసుకుని వ్యాపారాలు ప్రారంభించారు. వీరిలో కొందరు రెండో విడత కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా యూనిట్‌కు సంబంధించిన సామగ్రి కొటేషన్ కూడా దళితబంధు యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొందరు గుర్తింపు లేని సంస్థల నుంచి కొటేషన్స్ తీసుకున్న విషయాన్ని మండలాల్లోని క్లస్టర్ ఆఫీసర్లు గుర్తించారు. అలాంటి కొటేషన్లు మంజూరు చేస్తే.. నిధులు దారి మళ్లే ప్రమాదముంది. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంటనే అనుమానాస్పద దరఖాస్తులను తిరస్కరించారు. దీనికితోడు కొందరు దళారులు తాము కొటేషన్లు ఇస్తామంటూ నిరక్షరాస్యులైన లబ్ధిదారుల వద్ద డబ్బులు కూడా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు పెరిగిపోయాయి. మరోవైపు గుర్తింపులేని చాలా సంస్థల వద్ద సరుకు కోసం డబ్బులు కట్టినవారు మోసపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ లీగల్ అఫిడవిట్ నిబంధనను ప్రవేశపెట్టారు.

ఇవీ నిబంధనలు

- అఫిడవిట్ జారీ చేసే వ్యాపారి తప్పనిసరిగా జీఎస్టీ నెంబరును కలిగి ఉండాలి.
- సదరు జీఎస్టీ నెంబరు కూడా హుజూరాబాద్ ఉప ఎన్నికకు ముందే తీసుకున్నది అయి ఉండాలి. తద్వారా నకిలీ ఇన్వాయిస్‌లకు అడ్డుకట్ట వేయవచ్చు.
- లబ్ధిదారులు హుజూరాబాద్ మండలాలైన హుజురాబాద్, వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట వ్యాపారుల నుంచి రామెటీరియల్ సప్‌లై కోసం ఇచ్చే కొటేషన్లు తీసుకోరు. ఇటీవల ములుగు నుంచి గుర్తింపు లేని ఓ సంస్థ కొటేషన్‌ను అధికారులు గుర్తించడమే ఇందుకు కారణం.
- లీగల్ అఫిడవిట్ మీద వ్యాపారి వివరాలు, దళితబంధు లబ్ధిదారులకు సరఫరా చేసే సామాగ్రి వివరాలు పొందుపరిచి ఉండాలి. అంతేకాదు, తానేమైనా తప్పుడు సమాచారం ఇచ్చి ఉంటే కలెక్టర్ తీసుకునే చట్టపరమైన చర్యలకు బద్ధుడినై ఉంటానంటూ సంతకం కూడా చేసి ఇవ్వాల్సి ఉంటుంది.
- లబ్ధిదారులు హుజూరాబాద్ కాకుండా హైదరాబాద్, కరీంనగర్, రాష్ట్రంలో జీఎస్టీ గుర్తింపు పొందిన ఏ వ్యాపారి వద్ద నుంచైనా కొటేషన్ తీసుకురావచ్చు. వాటిని ఎంపీడీవోలు వెరిఫై చేసి, ఉన్నతాధికారులకు పంపుతారు.



పెయింటింగ్‌షాపును ప్రారంభిస్తున్న కలెక్టర్(ఫైల్)

పారదర్శకత కోసమే

దళితబంధు ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం. నిధుల మంజూరులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కొత్తగా లీగల్ అఫిడవిట్ విధానాన్ని ప్రవేశపెట్టాం. దీంతో లబ్ధిదారులకు నాణ్యమైన ముడిసరుకు లభిస్తుంది. తప్పుడు కొటేషన్లతో అటు ప్రభుత్వ అధికారులు, ఇటు లబ్ధిదారులను మోసం చేసే వీలు లేకుండా ఉంటుంది. దళారీ వ్యవస్థకు చెక్ పడనుంది. పథకం అమలులో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకత అమలు అయ్యేలా చూడటమే ప్రభుత్వ బాధ్యత.

– ఆర్వీ కర్ణన్, కలెక్టర్, కరీంనగర్

ముగిసిన సీఎం కప్ పోటీలు



బహుమతులు అందిస్తున్న కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, ఎమ్మెల్యే బాలకిషన్, మేయర్ సునీల్‌రావు

- విజేతలకు బహుమతులు అందించిన సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి
- రాష్ట్రస్థాయిలో జిల్లాపేరును మొదటిస్థానంలో నిలపాలని పిలుపు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ అంబేద్కర్‌స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న చీఫ్ మినిస్టర్స్ కప్–2023 జిల్లాస్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలోని 16మండలాల నుంచి సుమారు 1,200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ క్రీడాంశాల్లో రాణించిన జట్లను ఎంపికచేసి ఈ నెల 28 నుంచి 30వరకు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు పంపిచనున్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడుతూ.. సీఎంకప్ క్రీడలను గొప్పగా నిర్వహించామని తెలిపారు. కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించి జిల్లా క్రీడా పతాకాన్ని ఎగురవేయాలన్నారు. పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి పోటీల్లో పాల్గొనడంతో క్రీడా పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, ఎన్‌వైకే కో– ఆర్డినేటర్ వెంకటరాంబాబు, ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, పెటా సంఘాల బాధ్యులు అంతడ్పుల శ్రీనివాస్, యూనీస్‌పాష, సాల్లు సారయ్య, అంతటి శంకరయ్య, క్రీడా సంఘాల బాధ్యులు గిన్నె లక్ష్మణ్, కొమురోజు కృష్ణ, బసరవేణి లక్ష్మణ్, వంగపల్లి సూర్యప్రకాశ్, సత్యానంద్, కోచ్‌లు కిష్టయ్య, గణేశ్, పవన్, సాయిరాం, ప్రియాంక పాల్గొన్నారు.

పరిశోధనస్థానంలో నాణ్యమైన విత్తనాలు

- విత్తన మేళాలో కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.మంజులత



మాట్లాడుతున్న డాక్టర్ జి.మంజులత

కరీంనగర్ అర్బన్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏటా విత్తన మేళాను నిర్వహిస్తోందని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.జి.మంజులత అన్నారు. బుధవారం వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళా, ప్రదర్శన నిర్వహించారు. ఎండు తెగులుని తట్టుకుని మంచి దిగుబడినిచ్చే మొక్కజొన్న సంకర రకమైన కరీంనగర్ మక్క–1, తక్కువ కాలపరిమితి కలిగిన కరీంనగర్ మక్కతో పాటుగా తాండూరు పరిశోధన స్థానం నుంచి విడుదలైన కందిలో అధిక దిగుబడిని ఇచ్చే హనుమ రకాన్ని రైతులకు విక్రయించడానికి అందుబాటులో ఉంచామని తెలిపారు. భూసార పరీక్ష, పచ్చిరొట్ట పంటలు, అంతర పంటలు, వరికి ముందు పెసర సాగు చేస్తూ మంచి ఫలితాలు పొందాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ రైతులందరూ విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని, అలాగే పచ్చిరొట్ట, జనుము, జీలుగ విత్తనాలు తీసుకొని సాగు చేయాల్సిందిగా కోరారు. జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డా.కె.మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అధిక సాంద్రత ప్రత్తి సాగులో మెళకువలు, సాగు విధానం గురించి వివరించారు. శాస్త్రవేత్తలు శ్రావణి, జి.ఉషారాణి, విజయ భాస్కర్, మధుకర్ రావు, రాజేంద్ర ప్రసాద్, విత్తన ధృవీకరణ అధికారి నవీన్ రెడ్డి, తెలంగాణ విత్తన అభివద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కళోత్సవాల పేరిట రూ.కోట్లు వసూలు

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు



మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

విద్యానగర్(కరీంనగర్): జిల్లాలోని అధికార పార్టీ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గతేడాది సెప్టెంబరులో కరీంనగర్‌లో నిర్వహించిన కళోత్సవాలకు వ్యాపార, వాణిజ్య, కాంట్రాక్టర్ల నుంచి రూ.7 నుంచి రూ.10 కోట్లు వరకు డీసీపీస్థాయి అధికారితో మంత్రి గంగుల కమలాకర్ వసూలు చేయించారని పేర్కొన్నారు. కళోత్సవాలను పార్టీ, ప్రభుత్వం తరఫున కాకుండా కళా సంస్థ ద్వారా ఎందుకు నిర్వహించాల్సివచ్చిందో స్పష్టం చేయాలన్నారు. మంత్రి సమయమిస్తే వివరాలు, ఫొటోలతో చర్చకు సిద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ కింద రూ.500 కోట్లు కేటాయిస్తే మంత్రి కమలాకర్ తన అనుచరుల పేరిట బినామీ కాంట్రాక్టులు దక్కించుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. స్మార్ట్‌సిటీ అభివృద్ధికి విడుదలైన నిధులు, వాటి వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. జిల్లాలో ఇసుక, గ్రానైట్, మట్టి దందా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, కరీంనగర్ మండలం చేగుర్తి నుంచి నిత్యం 50కిపైగా లారీల ఇసుక అక్రమంగా రవాణా జరుగుతోందని పేర్కొన్నారు. మానేరు నదిపై నిర్మించిన తీగల వంతెన ప్రారంభోత్సవం రోజున లక్నోలో జరిగే కవ్వాలి వంటి తంతు ఏర్పాటు కోసం ఇప్పటి నుంచే వసూళ్లకు తెరలేపారని ప్రకాశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పోలీస్ అధికారులే అన్ని పనులు చక్కపెడుతున్నారని అన్నారు. కరీంనగర్ మేయర్ స్మార్ట్‌సిటీ పనుల్లో ఎక్కువ సంపాదించాడని, 11ఏసీలు, రెండులిఫ్టులతో ఇంద్రభవనం నిర్మించాడని అన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు పెద్ద భవనం బహుమతిగా ఇవ్వడానికి అతడికి డబ్బులు ఎక్కడివో చెప్పాలని డిమాండ్ చేశారు.

వర్షాకాలంలోగా అభివృద్ధి పనులు పూర్తి

- మేయర్ సునీల్‌రావు



పనులు పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: వచ్చే వర్షాకాలం నాటికి నగరంలోని అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరంలోని 10, 50 డివిజన్ల పరిధిలోని గణేశ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. గణేశ్‌నగర్ 60 ఫీట్ల బైపాస్ రోడ్డు, డ్రైయినేజీ పనులతో పాటు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వరద నీటితో ప్రజలకు ఇబ్బంది రాకుండా, పక్కా ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని అన్నారు. గణేశ్‌నగర్ బైపాస్ రోడ్డు, డ్రైయినేజీ పనులు చివరి దశకు చేరాయని తెలిపారు. నగరంలో డ్రైనేజీ సమస్యతో ముంపు ప్రాంతాల ప్రజలు గతంలో ఇబ్బందులు పడే వారని, ప్రస్తుతం ఆ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడం జరిగిందన్నారు. గణేశ్‌నగర్ బైపాస్‌రోడ్డును రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వినోద్ కుమార్ చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్లు అంజయ్య, కాసర్ల ఆనంద్, ఎస్ ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు ఇక సీఎస్‌సీ

- త్వరలోనే ఆన్‌లైన్ సేవలు
- డీలర్లకు శిక్షణ.. తదుపరి అమలు
- రెవెన్యూ మినహా 56 రకాల సేవలు



కరీంనగర్ అర్బన్: రేషన్ దుకాణాలు ఇక కామన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీ)గానూ సేవలందించనున్నాయి. రేషన్ డీలర్లకు వచ్చే కమీషన్ అరకొర కాగా ఖర్చులకు సరిపోని పరిస్థితి. ఈ నేపథ్యంలో డీలర్లకు ఆదాయం సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ సరుకుల పంపిణీతో పాటు ఆన్‌లైన్ సేవలతో కొంతమేర ఆర్థిక ప్రగతి ఉండనుందనేది ప్రభుత్వ భావన. ఈ మేరకు ఆదేశాలు జారీ చేయగా జిల్లా పౌరసరఫరాలశాఖ తదనుగుణ చర్యలకు ఉపక్రమించింది. ఇ– గవర్నెన్స్ సీఎస్‌సీ జిల్లా మేనేజర్ అల్లూరి శ్రీధర్, ఇ–పాస్ మేనేజర్ సంకీత్, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డిలు బుధవారం సమావేశమయ్యారు. సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటు, సౌకర్యాలపై సమీక్షించారు.

సాంకేతిక తప్పులపై నజర్

జిల్లాలో 487రేషన్ దుకాణాలుండగా కొత్తగా ఏర్పడిన వాటితో కలిపి 566ఉన్నాయి. సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులుగా డీలర్లు ఉండనుండగా వారి ఆధార్, తదితర వివరాలను సేకరిస్తున్నారు. 496 మంది వివరాలను పంపించగా మరో 70మంది వివరాలకు ఆధార్‌లో తప్పుల వల్ల నిలిచిపోయాయి. ఆధార్‌లో ఉన్న పేర్ల వివరాలు, సర్టిఫికెట్‌లోని వివరాలకు ఇంటి పేరు, పేరు అటు ఇటుగా ఉండటంతో వాటిని సరిచేస్తున్నారు. శుక్రవారం వరకు సాంకేతిక సమస్య కొలిక్కి రానుండగా వచ్చే వారంలో సీఎస్‌సీ నిర్వహణపై డీలర్లకు శిక్షణనివ్వనున్నారు.

జిల్లాలో జీపీలు:	313
రేషన్ దుకాణాలు:	566
రేషన్ కార్డులు:	2,76,045
యూనిట్లు:	9,89,404
ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం:	4,782 మెట్రిక్ టన్నులు

56 రకాల సేవలు

రేషన్ దుకాణం సీఎస్‌సీ సెంటర్‌గా ఏర్పాటైతే ప్రజలకు చేరువగా సేవలందనున్నాయి. ఐటీ రిటర్న్, ఆధార్ సీడింగ్, ఆయుష్మాన్ భారత్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఉజ్వల కనెక్షన్, ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ ధన్ పెన్షన్ పథకం , ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన,డీజీపే, విద్య సేవలు, సూక్ష్మ తయారీ యూనిట్లు ఇలా 56 రకాల సేవలు అందనున్నాయి.

మినీ సిలిండర్లపై వీడని పీటముడి

ఎల్‌పీజీ మినీ గ్యాస్ సిలిండర్లను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అంశం నేటికి కార్యరూపం దాల్చలేదు. వాణిజ్యపరమైన సిలిండర్లు కావడంతో ధర ఎక్కువ ఉన్నందున విక్రయాలు అంత సులభం కాదని రేషన్ డీలర్లు తేల్చిచెబుతున్నారు. రేషన్ డీలర్లను ఒప్పించేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అయిదు కేజీల సిలిండర్‌ను విక్రయిస్తే కేవలం రూ.40 మాత్రమే కమీషన్ వస్తుండటంతో రేషన్ డీలర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మినీ సిలిండర్ల వ్యవహారం ఎటూ తేలకపోగా సీఎస్‌సీ సెంటర్లు తెరపైకి వచ్చాయి.

ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో బుధవారం ధాన్యం కొనుగోళ్లను నిలిపివేశారు. గత కొన్ని రోజుల నుంచి నిర్వాహకులు 42కిలోల ధాన్యం తూకం వేస్తూ స్థానిక రైసుమిల్లుకు ధాన్యం బస్తాలను పంపిస్తున్నారు. అయితే బుధవారం నుంచి 43కిలోలు కాంటా పెడితేనే ధాన్యం తీసుకుంటామని చెప్పిన రైసుమిల్లరు మంగళవారం పంపించిన లారీ, ట్రాక్టర్‌లోని ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేసుకోలేదు. దీంతో రైతులు ఆందోళన చేపట్టడంతో ధాన్యం కాంటా పెట్టలేదు. స్థానిక రైసుమిల్లరు ధాన్యం నాణ్యత లేకపోవడంతో తీసుకునేందుకు నిరాకరించడంతో గురువారం నుంచి మరో మిల్లుకు ధాన్యం పంపించేందుకు ఏర్పాట్లుచేసినట్లు కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్ తెలిపారు. రైసుమిల్లర్లు రైతులను దోచుకుంటున్నప్పటికి అధికారులు పట్టించుకోవడంలేదని మండల కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు రాంరెడ్డి ఆరోపించారు.



ధాన్యం బస్తాలు

క్లుప్తంగా

సేంద్రియ వ్యవసాయం అభినందనీయం

- కలెక్టర్‌ ఆర్‌వీ.కర్ణన్‌
- ఉత్తమ రైతు అవార్డుగ్రహీత బొప్పు శ్రీహరికి అభినందన



విద్యానగర్‌(కరీంనగర్‌): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం అభినందనీయమని, సేంద్రియ విధానాన్ని రైతులకు వివరిస్తూ సాగువైపు ప్రోత్సాహించాలని కరీంనగర్‌ కలెక్టర్‌ ఆర్‌వీ.కర్ణన్‌ అన్నారు. రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డుగ్రహీత బొప్పు శ్రీహరి సేంద్రియ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను బుధవారం కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా శ్రీహరిని కలెక్టర్‌ అభినందించారు. సేంద్రియ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, సాగువైపు దృష్టిసారించేలా కృషిచేయాలని కోరారు.

రైల్లోంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



జమ్మికుంట: కదులుతున్న రైలు నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం జమ్మికుంట స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రామగుండం రైల్వేహెడ్‌కానిస్టేబుల్‌ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం... జమ్మికుంట బిజిగిరిషరీఫ్‌ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు గుర్తు తెలియని రైలులో నుంచి గుర్తుతెలియని వ్యక్తి (43) కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించగా జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపరిచామని తెలిపారు. మృతుడు ఒంటిపై ఆరెంజ్‌ కలర్‌ ఫుల్‌షర్ట్‌, గ్రే కలర్‌ ప్యాంటు ధరించాడని ఎవరికైనా వివరాలు తెలిస్తే రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ తిరుపతి 9949304574, 9440700039లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రశాఖ ఎన్నికల్లో నలుగురికి చోటు

కొత్తపల్లి(కరీంనగర్‌): వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్‌ యూనియన్‌–327(ఐఎన్‌టీయూసీ) రాష్ట్రశాఖ ఎన్నికల్లో జిల్లాకు చెందిన నలుగురికి చోటు లభించింది. యూనియన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా తులసి శ్రీమతి, రాష్ట్ర డిప్యూటీ జనరల్‌ సెక్రటరీగా అల్లం తిరుపతి, రాష్ట్ర ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా గన్ను నరేందర్‌రెడ్డి, రాష్ట్ర అడిషనల్‌ సెక్రటరీగా ఎంఏ సత్తార్‌ ఎన్నికయ్యారు. ఇనుగాల శ్రీధర్‌, కొండ శ్రీనివాస్‌, పిట్టల యుగంధర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మహిళపై కుక్క దాడి

మానకొండూర్‌: మండల పరిధిలోని వెల్ది గ్రామానికి చెందిన రాపాక కొమురమ్మ (55) రహదారి వెంట కాలినడక వెళ్తుండగా వీధి కుక్క ఒక్కసారిగా దాడిచేసి గాయపర్చింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

‘నగరానికి చెందిన యువతికి ఇన్‌స్టాగామ్‌లో ఓ యువకుడి నుంచి ఫ్రెండ్‌ రిక్వెస్ట్‌ వచ్చింది. ఇద్దరి ఇంటిపేరు ఒకటే అయినందున ఆమోదం తెలిపింది. ఇద్దరం దూరపు బంధువులమని సదరు యువకుడు పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుందామని వీడియోకాల్స్‌ చేస్తూ ఇబ్బంది పెట్టాడు. తరువాత వాటిని రికార్డుచేస్తూ.. డబ్బులకోసం బ్లాక్‌ మెయిల్‌ చేశాడు. దీంతో సదరు యువతి షీటీంను ఆశ్రయించింది. విచారణలో సదరు యువకుడికి ఇదివరకే వివాహమైందని.. విడాకులు తీసుకుని వ్యసనాలకు అలవాటుపడి యువతులను బ్లాక్‌మెయిల్‌ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని తెలిసి అతడిపై కేసు నమోదు చేశారు’.

‘కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఓ వివాహిత తల్లి అడ్మిట్‌ కాగా.. తోడుగా ఉంది. ఆస్పత్రిలో కంపౌండర్‌గా పనిచేసే వ్యక్తి సదరు వివాహితకు మాయమాటలు చెప్పి ఫోన్‌ నంబరు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఫోన్లు, మెసేజ్‌లు చేస్తూ ఇబ్బందులకు గురిచేశాడు. తనతో సదరు మహిళకు అక్రమ సంబంధం ఉందని ఆమె భర్తకు చెప్తానని బ్లాక్‌మెయిల్‌ చేశాడు. తన ఫొటోలు షేర్‌ చేయాలని, వీడియోకాల్‌ చేయాలని ఇబ్బంది పెట్టాడు. దీంతో సదరు మహిళ షీటీంకు ఫిర్యాదుచేయగా.. అతడికి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

‘జిల్లాకు చెందిన బాలిక తన అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లింది. అక్కడికి ఓ షార్ట్‌ఫిల్మ్‌బృందం వచ్చింది. బృందంలోకి వ్యక్తి బాలిక నుంచి ఫోన్‌ నంబరు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఫోన్‌ చేస్తూ పరిచయం పెంచుకున్నాడు. బాలికను ప్రేమిస్తున్నానని వలలో వేసుకునేందుకు ప్రయత్నం చేశాడు. బాలిక డీపీ, స్టాటస్‌ఫొటోలు స్క్రీన్‌షాట్‌ తీసుకుని బ్లాక్‌మెయిల్‌ చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు షీటీంను సంప్రదించగా.. సదరు యువకుడిపై సంబంధిత పోలీస్‌స్టేషన్లో ఫోక్సో కేసు నమోదు చేశారు.

‘ఆమె’కు భరోసా

షీటీంలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కేసులు	ఏడాది	కేసులు
	2021	78
	2022	68
	2023	14

ఆపదలో ఉన్నారా..? 87126 70759కు కాల్‌ చేయండి

- మారిన షీటీం ఫోన్‌ నంబరు
- ఆకతాయిల ఆటకట్టిస్తున్న బృందం
- నార్త్‌జోన్‌ పరిధిలో కరీంనగర్‌ షీటీమ్స్‌ మొదటిస్థానం

కరీంనగర్‌క్రైం: రోడ్డుపై మహిళ ఒంటరిగా నడవాలంటే భయం. బస్టాండులో పదిమందిలో నిలబడాలంటే గుబులు. కాలేజీ ఆవరణలో కలివిడిగా ఉండాలంటే వణుకు. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం పరిస్థితి మారింది. మహిళలను వేధించేవారిని, యువతులపై అసభ్యంగా ప్రవర్తించేవారిపై కరీంనగర్‌ కమిషనరేట్‌ పరిధిలోని షీటీం బృందాలు కొరడా ఝులిపిస్తున్నాయి. బహిరంగంగానే పోకిరీల తాట తీస్తున్నాయి. మఫ్టీలో ఉంటూ.. అబలకు రక్షణగా నిలుస్తున్నాయి.. దేశంలో షీటీం నిర్వహణలో తెలంగాణ మొదటిస్థానంలో ఉండగా.. కరీంనగర్‌ బృందం రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలుస్తోంది. ఇకపై ఆపదలో ఉన్నవారు షీటీం నంబరు 87126 70759కు కాల్‌ చేయాలని సీపీ సుబ్బారాయుడు సూచించారు.



షీటీం సేవలను అభినందిస్తున్న సీపీ ఎల్‌.సుబ్బారాయుడు

2016లో ప్రారంభం

- కరీంనగర్‌ కమిషనరేట్‌ పరిధిలో 2016 అక్టోబర్‌ 28 షీటీం బృందాలను ఏర్పాటు చేశారు. వీరు 24గంటలు పనిచేస్తారు. ఆపదలో ఉన్నవారు, వేధింపులకు గురైనవారు సోషల్‌ మీడియా, ఫోన్‌, నేరుగా ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తారు. డయల్‌ 100 ద్వారా కూడా అందుబాటులోకి వస్తారు.
- బాధితుల వద్దకు పోలీసు యూనిఫాంలో కాకుండా సివిల్‌డ్రెస్‌లో వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి నిందితులపై సంబంధిత పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేస్తారు.
- కొన్ని సందర్భాల్లో కేసు నమోదుకు బాధితులు ఒప్పుకోకుంటే కౌన్సెలింగ్‌ నిర్వహిస్తారు. పద్ధతి మార్చుకోకపోతే కేసు నమోదు చేస్తారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



పోకిరీలు, ఆకతాయిలతో ఇబ్బంది పడేవారు షీటీంకు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. నిమిషాల్లో మీ ముందు ఉంటారు. పబ్లిక్‌ప్రదేశాల్లో నిఘా ఉంచడంతో పాటు షీటీంపై అవగాహన కల్పిస్తున్నాం. మహిళల భద్రతకు కృషి చేస్తున్నాం. వ్యక్తిగత విషయాలు ఇతరులతో పంచుకోవద్దు. ఏదైనా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
– ఎల్‌.సుబ్బారాయుడు , కరీంనగర్‌ సీపీ

కమిషనరేట్‌ పరిధిలోని షీటీం సభ్యులు సాధారణ దుస్తుల్లో బస్టాండ్లు, పార్కులు, సినిమా థియేటర్లు, మార్కెట్‌, కాలేజీ, స్కూల్‌ ఏరియాల్లో విధుల్లో ఉంటారు. ఎవరైనా ఆకతాయిలు యువతులు, మహిళలను వేధిస్తే సీక్రెట్‌ కెమెరాతో రికార్డుచేసి స్టేషన్‌కు తరలిస్తారు.

- అపరిచిత వ్యక్తులతో మహిళలు, యువతులు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని షీటీం బృందాలు సూచిస్తున్నాయి. సోషల్‌ మీడియా వినియోగంలో జాగ్రత్త తీసుకోవాలని సూచిస్తున్నారు.

గత మూడేళ్లలో షీటీంకు వచ్చిన ఫిర్యాదులు

ఏడాది	నేరుగా	వాట్సప్‌	క్యూఆర్‌కోడ్‌	హ్యాక్‌ఐ	మొత్తం
2021	72	18	02	03	95
2022	138	05	01	-	144
2023	64	05	13	-	82

షీటీం కల్పించిన అవగాహన సదస్సులు

ఏడాది	కార్యక్రమాలు	పాల్గొన్నవారు	హ్యాక్‌ఐ డౌన్‌లోడర్స్‌
2021	222	43,000	3,598
2022	282	1,20,000	45,000
2023	101	6,500	4,000

కొలువుదీరిన నారసింహుడు

- ఘనంగా నల్లగొండలో విగ్రహ ప్రతిష్ఠ
- తరలివచ్చిన భక్త జనం



తిమ్మాపూర్‌: మండలంలోని నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ హాజరవగా ఉదయం ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు కుంభప్రోక్షణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించినట్లు అర్చకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి వందలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ చైర్మన్‌ దన్నమనేని శ్రీనివాసరావు, సర్పంచ్‌ దన్నమనేని శోభ మాట్లాడుతూ.. ఎంతో ప్రాశస్త్యం గల నరసింహ స్వామి ఆలయాన్ని ప్రభుత్వం, దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కన్నబాబు, నవీన్‌ ఆలయానికి విగ్రహాలను అందించినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు దన్నమనేని సురేందర్‌ రావు, తుమ్మనపెల్లి శ్రీనివాసరావు, దన్నమనేని నరసింగరావు, బెజ్జంకి సొసైటీ చైర్మన్‌ తన్నీరు శరత్‌రావు, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో ఉడుతల వెంకన్న, లక్మెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి ఎంపీటీసీ కవ్వంపల్లి పద్మ, ఆలయ కమిటీ సభ్యులు దుర్గం శ్రీనివాస్‌, పారిపెల్లి రాజిరెడ్డి, మమత, మహిళలు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్‌ తనిఖీలు

సుల్తానాబాద్‌రూరల్‌: నాణ్యత పేరుతో మిల్లర్లు మోసం చేస్తున్నారన్న రైతుల ఫిర్యాదు మేరకు సుల్తానా బాద్‌ మండలం పరిధిలోని రైస్‌మిల్లుల్లో రెండురోజులుగా సివిల్‌ సప్లయ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, టాస్క్‌ఫోర్స్‌ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. కాట్నపల్లి శివారులోని ఓ రైస్‌మిల్‌లో తనిఖీలు చేశారు. టాస్క్‌ఫోర్స్‌ అడిషనల్‌ ఎస్పీ ప్రభాకర్‌ మాట్లాడుతూ.. తూకాల్లో మోసాలు, మిల్లులకు పంపించే ధాన్యం ఆలస్యంపై పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌, టాస్క్‌ఫోర్స్‌ ఎస్సైలు జంగయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, సివిల్‌ సప్లయ్‌ అధికారి రవీందర్‌ ఉన్నారు.

యోగా జీవన విధానం కావాలి

- ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌: యోగా ప్రతిఒక్కరి జీవనవిధానంలో భాగం కావాలని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శ్రీరామచంద్ర మిషన్‌ కేంద్ర సాంస్కృతికశాఖ సౌజన్యంతో దేశవ్యాప్తంగా ధ్యాన్‌ పేరుతో నిర్వహిస్తున్న యోగా మహోత్సవ్‌లో భాగంగా హుజూరాబాద్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గందె రాధిక, హార్ట్‌ఫుల్‌నెస్‌ సెంటర్‌ కరీంనగర్‌ సమన్వయకర్త రమేశ్‌రాజు, శిక్షకుడు బాలాజీ, శ్రీనివాస్‌, సుధాకర్‌, రామకృష్ణారెడ్డి, తాళ్లపల్లి రమేశ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ సమ్మయ్య, తహసీల్దార్‌ కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్‌

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్‌ అని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మున్సిపల్‌ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్‌ గ్రామంలోని రైతువేదిక వద్ద రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో జీలుగ విత్తనాలు 2,210 క్వింటాళ్లు ఉన్నాయని, రైతులు పట్టాదారు పాస్‌బుక్‌ జిరాక్స్‌, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వచ్చి జీలుగ విత్తనాలు పొందాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండ శ్రీనివాస్‌, ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్‌, ఎంపీపీ ఇరుమల్ల రాణి, జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, గూడూరి స్వామిరెడ్డి పాల్గొన్నారు.

సీడ్‌ వ్యాపారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- సహకార సంఘాల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌ రెడ్డి

హుజూరాబాద్‌: సీడ్‌ ధాన్యం కొనుగోలులో వ్యాపారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినట్లు సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండల్‌ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు రేట్లు వరిసాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. సీడ్‌ వ్యాపారులు తరుగు పేరుతో నాలుగు నుంచి ఐదు కిలోలు కట్‌ చేస్తున్నారన్నారు. సీడ్‌ రైతుల సమస్యను వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల నుంచి సన్నరకం క్వింటాలుకు రూ.2200, దొడ్డు రకం రూ.2100 చెల్లించి కొనుగోలు చేస్తున్నారని వారు మాత్రం 25కిలోల బస్తా రూ.1000కి, క్వింటాల్‌ రూ.4000లకు అమ్ముతూ అత్యధిక లాభం అర్జిస్తున్నారన్నారు. రైతుల సీడ్‌ ధాన్యానికి క్వింటాల్‌కు మద్దతు ధర దొడ్డు రకం రూ.2300, సన్నాలకు రూ.2,500 వరకు చెల్లించాలని, లేకపోతే సదరు సీడ్‌ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రైతులపై హమాలీ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అదనంగా వేయకుండా సీడ్‌ వ్యాపారులే భరించేలా చూడాలని కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- జమ్మికుంట కార్యాలయంలో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి

జమ్మికుంట: కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో సీపీఎం కార్యాలయంలో గ్రామ శాఖ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజల సంక్షేమం గాలికి వదిలి, కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలు చేసి ధనవంతులను చేస్తోందని, పేదలను మరింత పేదరికంలోకి నెట్టివేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ పాలనను ఎండగట్టారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎన్నికల హామీలైన డబుల్‌ బెడ్రూం ఇండ్లు, పేదలకు పెన్షన్‌, నిరుద్యోగ భృతి, రేషన్‌ కార్డుల మంజూరు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. నిరుపేదల ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. రాబోయే రోజుల్లో సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ చేసే పోరాటాలకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి





క్రాంతి మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్థానికులు, క్రాంతి (ఫైల్‌)

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌ వాగులో బుధవారం దుస్స క్రాంతి (33) చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృత్యువాతపడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని తాడికల్‌కు చెందిన దుస్స క్రాంతి సెల్‌ఫోన్‌ రిపేర్‌ చేస్తుంటాడు. గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌ పెడుతుండగా ప్రమాదవశాత్తు అతడికి తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. సమీపంలోని రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు మృతదేహాన్ని వాగులోంచి బయటకు తీశారు. మృతుడికి భార్య సింధు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య పుట్టింటికి వెళ్లడంతో ఫిర్యాదు అందలేదని కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపారు. మృతదేహాన్ని హుజూరాబాద్‌ మార్చురికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఇండో, నేపాల్‌ కరాటే పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్‌: విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్‌స్టేడియంలో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించే ఇండో నేపాల్‌ ఓపెన్‌ కరాటే చాంపియన్‌షిప్‌ పోటీలకు కరీంనగర్‌లోని గోజుర్యూ కరాటే డో అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర గోజుర్యూ కరాటే డో అసోసియేషన్‌ ప్రధానకార్యదర్శి సురభి వేణుగోపాల్‌ తెలిపారు. అండర్‌ 10 విభాగంలో ఆశిష్‌రెడ్డి, దర్శిత్‌, నేహిత, ధ్రునికా చౌదరి, అండర్‌ 12 విభాగంలో నాగేంద్ర, మణిదీప్‌, అబ్దుల్‌బిలాలుద్దీన్‌, సాత్విక్‌, అండర్‌ 16 విభాగంలో దీపక్‌ కుమార్‌, నితీన్‌ సాయి పాల్గొంటున్నారు. వీరికి మేనేజర్‌గా సాయిఅరుణ్‌ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కరీంనగర్‌ మేయర్‌ సునీల్‌రావు, జిల్లా ఒలంపిక్‌ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్‌, గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్‌ వినయ్‌కుమార్‌ అభినందించారు.

జిల్లాలో నేడు ‘కంటివెలుగు’ వైద్యశిబిరాలు

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో గురువారం 10 ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్‌ లలితాదేవి తెలిపారు. కరీంనగర్‌ పట్టణంలోని 60వ డివిజన్‌లో, మండలంలోని వెంకట్రావుపల్లిలో, జమ్మికుంట పట్టణంలోని 19వ వార్డులో, చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లిలో, చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామంలో, రామడుగు మండలంలో వేదిర గ్రామంలో, కొత్తపల్లి మండలంలోని ఎలగందుల గ్రామంలో, మానకొండూర్‌ మండలంలోని లింగాపూర్‌లో, సైదాపూర్‌ మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో, కేశవపట్నం మండలంలోని ముత్తారం గ్రామంలో 10 ‘కంటివెలుగు’ వైద్య బృందాలు పనిచేస్తాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘దోస్త్‌’ కరపత్రం ఆవిష్కరణ



దోస్త్‌ కరపత్రం ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

హుజూరాబాద్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్‌ 2023–24 డిగ్రీ అడ్మిషన్లలో భాగంగా కళాశాల విశిష్టతలను తెలిపే కరపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మీనరసింహమూర్తి కళాశాల బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఇంటర్‌ పాసైన విద్యార్థులు హుజూరాబాద్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో అడ్మిషన్‌ పొంది భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాలకు వచ్చి ఉచితంగా దోస్త్‌ ద్వారా బీఏ, (హెచ్‌ఐపీ, హెచ్‌ఎస్‌ఈసీఏ, హెచ్‌పీసీఏ తె.మీ అండ్‌ ఇం.మీ) బీకాం(కంప్యూటర్స్‌ - ఇం.మీ) బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఏ-ఇం.మీ) బీఎస్సీ (బీజెడ్‌సీ, బీజెడ్‌ సీఏ-ఇం.మీ)లలో అడ్మిషన్‌ పొందవచ్చన్నారు. వివరాలకు 9440020690, 9849389144, 9885220626 నంబర్లలో సంప్రదించాలన్నారు. దోస్త్‌ కో ఆర్డినేటర్‌ డా.ఎస్‌. నాగపరమేశ్వరాచారి, దోస్త్‌ ఇన్‌చార్జి మధు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌ డా.పి దినకర్‌, అకాడమిక్‌ కో ఆర్డినేటర్‌ డా.జి శ్రీనివాస్‌, గొడిశాల పరమేశ్‌, స్టాఫ్‌సెక్రటరీ కె.రమేశ్‌, ఉపన్యాసకులు సమ్మయ్య, స్వరూప, డా.స్వప్న, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

‘అల్ఫోర్స్‌’ విద్యార్థినులకు ఉద్యోగాలు



అభినందిస్తున్న కరస్పాండెంట్‌ రవీందర్‌ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): తెలంగాణ అకాడమీ ఫర్‌ స్కిల్‌ అండ్‌ నాలెడ్జ్‌ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన ఉద్యోగ నియామక ప్రక్రియలో అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు 11 మంది మెడికో హెల్త్‌కేర్‌ సర్వీసెస్‌, టెక్నాలజీస్‌ సంస్థకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్‌ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించి మాట్లాడారు. చక్కని ప్రణాళిక, పటిష్టమైన కార్యాచరణ, ఉత్తమ శిక్షణతో ఉద్యోగ నియామకాల్లో ప్రతిభ కనబరిచి సత్తాచాటినట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులు పోటీపరీక్షలు, ప్రాంగణ నియామకాల్లో సులువుగా రాణిస్తూ ఉద్యోగాలకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థినుల ఎంపికపై టాస్క్‌ జిల్లా పౌరసంబంధాల మేనేజర్‌ గంగాప్రసాద్‌, కంపెనీ ప్రతినిధి అభిలాశ్‌ బృందం, కళాశాల ప్రిన్సిపాల్‌ జి.శ్రీనివాస్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ జి.చంద్రశేఖర్‌ రెడ్డి, టీపీవో డా.బి.విజయలక్ష్మి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

ఇల్లందకుంట: వరకట్న వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం వీణవంక మండలం వల్భాపూర్‌కు చెందిన వొల్లాల వీరస్వామి లక్ష్మి దంపతుల కుమార్తె లావణ్య మర్రివానిపల్లికి చెందిన గడ్డం రాజు 2011లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కాగా కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. ఈక్రమంలో వరకట్నం తేవాలని లావణ్యకు అత్తింటివారి వేధింపులు ఎక్కువకాగా భూమి అమ్మి కట్నం ఇచ్చామని, రైతుబంధు రూ.ఐదు లక్షలు ఇచ్చినట్లు మృతురాలి తల్లి పేర్కొన్నట్లు తెలిపారు. అయినప్పటికీ అత్తమామ, భర్తతో పాటు ఆడపడుచు గోపిడి స్రవంతి తన భర్త గోపిడి రాజేశ్వర్‌రెడ్డి అందరు కలిసి అదనపు కట్నం కోసం వేధించగా మనస్తాపం చెందిన లావణ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి వొల్లాల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

రేణుకా ఎల్లమ్మకు పూజలు



కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రేణుకా ఎల్లమ్మ పట్నాలను ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయంలో బైండ్లపూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నం వేశారు. అనంతరం ఎల్లమ్మ జీవిత చరిత్రను ప్రదర్శించారు. మహిళలు బోనాలను తీసుకొచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి ఓడిబియ్యం పోసి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గర్వందుల నాగరాజు, ఉపాధ్యక్షుడు సుద్దాల గంగరాజు, కోశాధికారి కనుకయ్య, ప్రతినిధులు లచ్చయ్య, సంతోశ్, సంపత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

మల్లికార్జునస్వామి పట్నాలు



కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో బుధవారం జీల్గుల మల్లికార్జునస్వామి పట్నాలను ఘనంగా నిర్వహించారు. ఒగ్గుపూజారులు ఆలయంలో పట్నం వేసి మల్లన్న జీవిత కథను ప్రదర్శించారు. అనంతరం మల్లన్న కల్యాణం నిర్వహించి మొక్కులు చెల్లించారు. దేవతావిగ్రహాలతో ఒగ్గుపూజారులు అగ్నిగుండాల మీదుగా నడిచారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్శేడ్ సింగిల్‌విండో ఇన్‌చార్జి చైర్మన్ గోనె నర్సయ్య, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, ఆలయ కమిటీ ప్రతినిధులు గోనె ఎల్లారెడ్డి, మేడిద రాజిరెడ్డి, పునేందర్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం



కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు మధుసూదనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాజుల అంజయ్య, ఉప సర్పంచ్ కోరుకంటి వేణుమాధవరావు, సాయిని తిరుపతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



సర్టిఫికెట్లతో విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధిలో నైపుణ్యాభివృద్ధికి వివిధ కోర్సుల్లో ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్‌లో నమోదైన కార్మికుల పిల్లలకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ అర్బన్ ఏఎల్‌ఓ నజీర్ హాజరై పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

6న ‘చలో ఆదిలాబాద్’

విద్యానగర్(కరీంనగర్): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జూన్ 6న చలో ఆదిలాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గవ్వల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వేలాది మందితో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గవ్వల శ్రీనివాస్, మహ్మద్ రహీం, తీగల శేఖర్, కొలిపాక గంగాధర్, నక్క తిరుపతి పాల్గొన్నారు.

సన్మానం



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇటీవల నూతనంగా ఎన్నికైన టీఎన్‌జీవోల సంఘం కార్యవర్గాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోల సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి’



డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వేసవి సెలవుల్లోనే చేపట్టాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంరాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టులో ఉన్న న్యాయపరమైన చిక్కులను రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. విద్యాశాఖలో ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలోని నైట్ వాచ్‌మెన్‌లకు బేసిక్ పే అమలు చేయడంతో పాటు రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జేఈఈ మెయిన్స్, నీట్ అకాడమీ, కోచింగ్ సెంటర్ల పేరుతో జూనియర్ కళాశాలలు నడుపుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాడమీలతో విద్యా వ్యాపారాన్ని చేసే విధంగా కరీంనగర్‌లో విచ్చలవిడిగా దందా నడిపిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, రాకేశ్, నాయకులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగు.. అవగాహన కరువు

- జాడలేని రైతు చైతన్య యాత్రలు
- అటకెక్కిన ‘మన తెలంగాణ-మన వ్యవసాయం’
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు



దుక్కి దున్నుతున్న రైతు

రైతు లేనిదే రాజ్యం లేదు.. అన్నం పెట్టే అన్నదాతకు అన్ని రకాలుగా అండగా ఉంటామంటూ ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వాలు రైతు అవగాహన సదస్సులు నిర్వహించడంలో వెనకడుగు వేశాయి. ఫలితంగా రైతులు వేసిన పంటలు అకాల వర్షాలు, చీడ పురుగుల బారిన పడి నష్టపోవాల్సి వస్తోంది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి ప్రకోపానికి నేలపాలు అవుతుండటంతో రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించపోవడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి: వానాకాలం (ఖరీఫ్) సాగుపై రైతులకు అవగాహన కొరవడింది. పంట సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే రైతు చైతన్య యాత్రలు జాడలేకుండా పోగా, మన తెలంగాణ-మన వ్యవసాయం అటకెక్కింది. ఏటా వానాకాలంలో సాగు, వ్యవసాయ రాయితీలు, సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ ప్రకటించకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఫలితంగా ఒకే పంట సాగుపై దృష్టి సారించడం వల్ల నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

దృష్టి సారించని వ్యవసాయ శాఖ

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలతో రైతులు అధిక దిగుబడి పొందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు వ్యవసాయ శాఖ చేపట్టాల్సి ఉంది. ప్రతీ సంవత్సరం వానాకాలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు చైతన్య యాత్ర, రైతు సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్నేళ్లుగా వీటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఏ పంట వేసుకోవాలో.. వేసుకోకూడదో తెలియని రైతులంతా మూస విధానంలో వరి పంటపై దృష్టి సారిస్తున్నారు. ఈ సాగు విధానం వల్ల ఇటీవలి కాలంలో రైతులు తీవ్ర నష్టపోయి కన్నీళ్లు పెట్టుకోవాల్సి వస్తోంది. వడగళ్లు, మొగిపురుగు బెడద వల్ల వరిపంట నష్టంతో అనేక మంది రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. ప్రతిఏటా రైతు చైతన్య యాత్ర, మన తెలంగాణ-మన వ్యవసాయం కార్యక్రమాలు నిర్వహించి భూసార పరీక్షల ఆవశ్యకత, పంటల మార్పిడి, పంటలకు గిట్టుబాటు రానప్పుడు పంటలను భద్రపరిచి రుణం పొందే విధానం, పంట రుణాల సద్వినియోగం, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలు, పంటలను ఆశించే చీడపీడల నివారణ, వ్యవసాయం నష్టపోయినప్పుడు పాడి పశువుల ద్వారా అభివృద్ధి, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీలు, వ్యవసాయ పనిముట్లు, వాటిపై రాయితీలు, విత్తనోత్పత్తికి సంబంధించి తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ చేతులెత్తేసింది. సాగుపై అవగాహన కల్పించి పంటల్లో అధిక దిగుబడులు వచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగులో మెలకువలు నేర్పాలి



వ్యవసాయ పంటల సా గులో అధికారులు మెలకువలు నేర్పాలి. గతంలో నిర్వహించిన మాదిరిగానే రైతు చైతన్య యాత్రలు, మన తెలంగాణ మన వ్యవసాయం సదస్సుల ద్వారా రైతులను చైతన్యపర్చాలి. వరిపంటలో చీడ పురుగుల వల్ల ఏటా రైతులు నష్టపోవల్సి వస్తోంది. గ్రామ గ్రామాన సదస్సులు నిర్వహించి పంటల సాగుపై వివరించాలి.

– జిట్టవేని పర్శరాం, చింతకుంట

అవగాహన కల్పిస్తున్నాం



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వేసవి దుక్కులు దున్నడం వల్ల చీడ పురుగులు నివారించవచ్చు. జీలుగ వేయడం వల్ల యూరియా వాడకం తగ్గించవచ్చు. రైతుల నేరుగా మమ్మల్ని సంప్రదిస్తే సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలు తెలియజేస్తాం. వరి, పత్తి, మొక్కజొన్న పంటలే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి.

– రంజిత్, ఏవో, కొత్తపల్లి

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ రమేశ్‌నాయుడు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ కె.రమేశ్‌నాయుడు తనిఖీచేశారు. ట్రాఫిక్ ఏసీపీ విజయ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌరవ వందనం స్వీకరించి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. డీఐజీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించాలని, విధుల్లో క్రమశిక్షణ పాటించాలని స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధితశాఖల అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలపై అభినందించారు. కార్యక్రమంలో సీపీ ఎల్. సుబ్బరాయుడు, ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు తిరుమల్, నాగార్జునరావు పాల్గొన్నారు.

‘నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి’



కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: నాలుగేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తీగలగుట్టపల్లి వద్ద రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చేసిన ఇళ్లను, నాలుగేళ్ల క్రితం కట్టి వదిలేసిన 60 డబుల్ బెడ్రూం ఇళ్లను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరెపల్లిలో ఇళ్లు కోల్పోయిన వారికి నాలుగేళ్ల క్రితం మంత్రి గంగుల కమలాకర్ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి కేటాయించలేదని అన్నారు. ఆరెపల్లి, తీగలగుట్టపల్లిలో దరఖాస్తు చేసుకున్న వారు 600 మందిపైనే ఉన్నారని, ఇచ్చిన హామీ నిలబెట్టుకోకుండా మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెతుకు కాంతయ్య, దామోదర్, నరేశ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, దండి రవీందర్, ముక్క భాస్కర్, ధనసింగ్, బొబ్బిలి విక్టర్, మామిడి సత్యనారాయణరెడ్డి, దాసరి నర్సింహారెడ్డి, షహెన్షా, ఎండీ చాంద్, షబానా, ములకల కవిత, లత, జ్యోతి, జిలకర రమేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రంజిత్

కొత్తపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు పొందువచ్చని మండల వ్యవసాయాధికారి రంజిత్, ఉద్యానవన శాఖ అధికారి మౌనిక తెలిపారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ రైతువేదికలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఆయిల్‌పామ్ పంట సాగుపై ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పంట వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. మిగతా పంటల లాగా ఈ పంటకి ప్రతీ సంవత్సరం నేల దుక్కి చేసుకోడం, విత్తనాలు కొనుక్కోవడం, నాటేసుకోడం వంటివి పనులుండవన్నారు. రైతులు ఆలోచించి ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులేయాలని కోరారు. 90శాతం రాయితీతో ఆయిల్ ఫామ్ మొక్కలు అందిస్తున్నామని, ఒక ఎకరానికి రూ.1,140లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను కూడా ప్రభుత్వం ఇస్తోందని, ఒక ఎకరాకు రూ.4 వేల చొప్పున మొక్కల యాజమాన్య ఖర్చు కింద ప్రభుత్వమే రైతు అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తుందని తెలిపారు. మొక్కలు నాటిన మూడేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు ఎకరానికి 10–15 టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు. సరాసరిగా ఒక టన్నుకు రూ.10 వేల కనిష్ట ధర నుంచి రూ.24 వేల గరిష్ట ధర ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజేంద్రప్రసాద్, రైతు కోఆర్డినేటర్ బోనాల రాజేశం, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధి శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కొత్తపల్లి పట్టణ కార్యవర్గం ఏకగ్రీవం



కముటం రాజేశం



కట్ల సుధాకర్

కొత్తపల్లి: పద్మశాలీ సంఘం కొత్తపల్లి(హెచ్) పట్టణ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికైన సభ్యులు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. సంఘం అధ్యక్షుడిగా కముటం రాజేశం, ప్రధాన కార్యదర్శిగా కట్ల సుధాకర్, ఉపాధ్యక్షులుగా రుద్ర రాజు, బొద్దుల సత్యనారాయణ, కోశాధికారిగా పెంటి మురళీ, కార్యనిర్వాహక కార్యదర్శిగా దూస రాజమౌళి, సంయుక్త కార్యదర్శిగా బొద్దుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా సుంకె సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఆడెపు వీరేశం, అలువాల సత్యనారాయణ, బైరి మహేశ్, బి.సత్యనారాయణ, డి.సత్యనారాయణ, డి.చంద్రమౌళి, ఎ.సత్యనారాయణ, జి.లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాస్, బి.శేఖర్, బి.రాజమౌళి, డి.మల్లేశం, పి.లక్ష్మీనారాయణ, పెంటి శేఖర్, స్వర్గం శ్రీనివాస్, వేముల రాజేందర్, వెంగళ నాగరాజులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరగనుందని ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు.









సందడిగా అంబేడ్కర్ స్టేడియం

చాలా రోజుల తర్వాత క్రీడారంగానికి చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలతో పూర్వ వైభవం వచ్చినట్లయింది. కరోనా కారణంగా రెండేళ్లు ఎలాంటి పోటీల నిర్వహణ లేకపోవడం.. గతేడాది అడపా దడపా పోటీల నిర్వహణతో క్రీడాపోటీలు ముగియగా స్పందన అంతంత గ్రామంగానే వచ్చింది. ఈనెల 6నుంచి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా ఈనెల 15 నుంచి 24వరకు చీఫ్ మినిస్టర్ కప్ 2023 మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం వేదికైంది. దీంతో స్టేడియం క్రీడాకారులతో కళకళ లాడుతోంది. పెద్ద సంఖ్యలో సమ్మర్ క్యాంప్‌లకు, సీఎం కప్ పోటీలకు క్రీడాకారులు హాజరవుతుండటంతో ప్రతిరోజూ సందడిగా మారింది. క్రీడారంగానికి పూర్వవైభవం వచ్చిందని పలువురు క్రీడా విశ్లేషకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - కరీంనగర్‌స్పోర్ట్స్

గీతకార్మికుడికి గాయాలు



గాయపడిన స్వామి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో బుధవారం తాటి చెట్టుపై నుంచి గీతకార్మికుడు బుర్ర స్వామి(35) జారి కిందపడి గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కిన స్వామి మోకు జారడంతో కిందపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. స్వామికి ఎడమ చేయి విరిగిపోగా మోకాలుకు గాయమైంది. గాయపడిన గీతకార్మికుడిని ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్ పరామర్శించారు. వైద్యులను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా...

48 రోజులు.. రూ.1.62 కోట్లు

భద్రాద్రి రామయ్యకు భారీగా ఆదాయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీ ఆదాయం 48 రోజులకు రూ.1,62,13,534 సమకూరింది. ఆలయ హుండీలను ఈవో రమాదేవి, దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో చిత్రకూట మండపంలో బుధవారం లెక్కించారు. పై నగదుతో పాటు 182 గ్రాముల బంగారం, కేజీ 800 గ్రాముల వెండివచ్చాయని ఈవో తెలిపారు. ఇంకా 200 యూఎస్ డాలర్లు, 100 ఒమన్ బైసాలు, 60 యూకే యూరోలు, శ్రీలంకకు చెందిన వెయ్యి రూపీస్‌తో పాటు ఇతర విదేశీ నగదు కూడా లభించిందని వెల్లడించారు.

అరుణ మరణం అవాస్తవం

చర్ల: మావోయిస్టు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న వార్తల్లో నిజం లేదని...ఆ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ బుధవారం లేఖ విడుదల చేసింది. అరుణకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, ప్రభుత్వ, పోలీసుల ప్రకటన అవాస్తవమని పేర్కొంది. పార్టీపై కుట్రలో భాగంగానే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. 2024 నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలించాలనే లక్ష్యంతోనే పాలకులు బహుముఖ దాడులకు పాల్పడుతున్నారని పేర్కొంది. అరుణ క్షేమంగా ఉందని, పార్టీ కార్యకలాపాల్లో, విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొంటోందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరింది. కాగా, మావోయిస్టులు విడుదల చేసిన లేఖపై అరుణ సంతకమే ఉండటం గమనార్హం.

కేతు విశ్వనాథరెడ్డికి కన్నీటి వీడ్కోలు

ఎర్రగుంట్ల/ కడప వైఎస్సార్ సర్కిల్: సాహితీ శిఖరం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84)కి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రంగసాయిపురంలో బుధవారం కుటుంబసభ్యులు, ఆప్తుల నడుమ అంత్యక్రియలు జరిగాయి. అంతకుముందు కడప నుంచి ఆయన భౌతికకాయాన్ని ఇక్కడి స్వగృహానికి తీసుకొచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రనాథ్‌రెడ్డి, కార్మిక నాయకుడు ఎం.రమణారెడ్డి, టీడీపీ నాయకుడు లింగారెడ్డితో పాటు పలువురు రచయితలు, సాహితీవేత్తలు, నాయకులు పాల్గొన్నారు. కాగా, కేతు విశ్వనాథరెడ్డి మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవేదన వెలిబుచ్చారు. కడప సింగపూర్ టౌన్ షిప్‌లో బుధవారం ఉదయం కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయం వద్ద ఆయన నివాళులర్పించారు.

వివేకాను హత్య చేసిన వాళ్లు విచ్చలవిడిగా బయట తిరుగుతున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

చికిత్స పొందుతున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మిని ఆమె పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ''శ్రీ లక్ష్మిని పరామర్శించా. ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉంది. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించా. వైఎస్ భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నారు. అవినాశ్‌ను కూడా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. సీబీఐ వ్యవహారంతో ఒక తల్లిగా శ్రీలక్ష్మి తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తల్లడిల్లిపోతున్న ఆమెను చూసి దేవుడిని ప్రార్థించేందుకు ఆసుపత్రికి వచ్చా'' అని వ్యాఖ్యానించారు. శ్రీలక్ష్మి ఒక దశలో డెత్ స్టేజీకి వెళ్లి బయటకు వచ్చారని, తనతో చాలాసార్లు నాతో దైవసేవకు కూడా వచ్చారని వైఎస్ విమలమ్మ తెలియజేశారు.

చానెల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు...

అవినాశ్‌ను టార్గెట్ చేసి సీబీఐ అధికారులు వెళ్తున్నట్లు అనిపిస్తోందని, టీవీ చానల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమలమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. ''వైఎస్ వివేకానందరెడ్డి అన్న మంచి పేరుతో బతికారు. ఆయన హత్య తర్వాత ఆ మంచితనానికే మచ్చ తెస్తున్నారు. ఇది చాలా అన్యాయంగా ఉంది. రాజకీయంగా కూడా ఎంత మంచిగా ఉన్నాడో అందరికీ తెలుసు. అనవసరంగా అవినాష్‌ను లక్ష్యంగా చేసుకుని సీబీఐ ముందుకెళ్తోంది. ఇదెంతమాత్రమూ న్యాయం కాదు. దయజేసి గమనించండి. మీడియా వల్ల ప్రజలకు సరైన విషయాలు తెలియాలి. ఆ ఉద్దేశంతోనే మీడియా పనిచేయాలి. అదే బాగుంటుంది. న్యాయం ఆలస్యమైనా గెలుస్తుంది. దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడు. తల్లి ప్రార్థనలు దేవుడు ఆలకిస్తూనే ఉన్నాడు'' అని విమలమ్మ వ్యాఖ్యానించారు. 'అత్తా! నేను ఏ తప్పు చేయలేదని, నేను దేవున్ని నమ్ముతున్నానని, నాకు న్యాయం జరుగుతుందని చాలా ధైర్యంగా అవినాశ్ నాతో ఆస్పత్రిలో చెప్పారు!' అని అన్నారు. తప్పు చేస్తే అది మొహంలో తెలిసిపోతుందని చెప్పారామె.

సునీత వెనక దుష్టశక్తులున్నాయి...

ఒకవైపు కూతురు లాంటి మేనకోడలు సునీత, మరోవైపు సోదరుడి కుమారుడు అవినాశ్ ఉన్నారని విమలమ్మ వ్యాఖ్యానించారు. ''ఎవరు తప్పు? ఎవరు ఒప్పు? అనేది దేవుడికే తెలియాలి. అయితే అవినాశ్‌రెడ్డి మాత్రం ఏ తప్పూ చేయలేదనే నమ్మకం నాకుంది. తన తండ్రి హత్య వెనుక ఈ కుటుంబ సభ్యులు లేరని సునీతే గతంలో చెప్పింది. మళ్లీ ఇపుడు ఎందుకు మాట మారుస్తోందో తెలియడం లేదు. కానీ సునీత వెనుక దుష్టశక్తులు ప్రభావం చూపుతున్నాయని నాకు అనిపిస్తోంది. ఎందుకంటే నేను గతంలో ఆమెతో మాట్లాడాను. నువ్వు చేస్తున్నది తప్పని చెప్పా. నలుగురు వ్యక్తులు మేమే చంపామని చెబుతుంటే ఎందుకు ఏ తప్పూ చేయని వారిని టార్గెట్ చేశావని అడిగా. ఆధారాలు లేనప్పుడు అవినాశ్‌ను ఎందుకు లక్ష్యం చేశావని అడిగా. కానీ ఆమె మాట్లాడేందుకు ఇష్టపడలేదు. మనం దేవుని బిడ్డలం.. దేవుడే చూసుకుంటాడు. ఇలాంటివి చేయకమ్మా అని చెబితే సునీత వినలేదు'' అని విమలమ్మ వివరించారు. ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ... ''ఎలాంటి రుజువులూ లేనప్పుడు ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం సరైంది కాదు. పోనీ ఆధారాలు చూపించమంటే చూపించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. సున్నిత మనస్తత్వం ఉన్న అవినాశ్‌ను టార్గెట్ చేయడం అన్యాయం అనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. ఏ తప్పూ చేయని అన్న (వైఎస్ భాస్కర్‌రెడ్డి) జైలులో ఉన్నాడని, 72 ఏళ్ల ఆయనకు వెన్నెముక నొప్పి ఉన్నా కేసులు పెట్టారని, ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తన సోదరుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు తమ కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉండేవని, ఇప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశం అనంతరం మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి ఎదుట ఎమ్మెల్యేలు, కార్యకర్తల నిరసన

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ వాస్తవాలు తేల్చాలని, బాధితులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కోరారు. బుధవారం వారు విశ్వభారతి ఆస్పత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఐదురోజులుగా వందల సంఖ్యలో కార్యకర్తలు ఆస్పత్రి ఎదుటే రాత్రింబవళ్లు ఉంటున్నారు. తల్లి అనారోగ్యంతో ఆమె బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌కు మద్దతుగా వారు అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా ఆస్పత్రికి వచ్చి శ్రీలక్ష్మిని పరామర్శించి వెళుతున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి శ్రీలక్ష్మిని పరామర్శించారు. తర్వాత ఆస్పత్రి ఎదుట వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య, కడప, కర్నూలు కార్పొరేటర్లు, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. అవినాశ్‌కు అండగా కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట ప్రశాంతవాతావరణంలో బైఠాయించడం మినహా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకపోవటంతో బుధవారం పోలీసు బందోబస్తును తగ్గించారు.

లక్షన్నర కుటుంబాలు | 4 లక్షల ఎకరాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 23 వరకు వచ్చిన అర్జీలను పరిగణనలోకి తీసుకొని 1,50,012 మంది రైతులకు పట్టాలు అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595 మంది రైతులకు 1,51,195 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 24,972 మంది రైతులకు 70,434 ఎకరాలు.. అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు రైతులకు ఎకరం భూమికి పట్టాలు అందించనున్నారు.

జిల్లాల్లో సభలు పెట్టి..

పోడు పట్టాలు జూన్ 24 నుంచి అందించనున్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో సీఎం కేసీఆర్‌తో సభలు పెట్టి ఆయన చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రులు చెబుతున్నారు. మొదటి సభ భద్రాద్రి కొత్తగూడెంలో కానీ, మహబూబాబాద్‌లో కానీ నిర్వహించే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రానికి ఈశాన్యం మూలలో ఉన్న ఈ రెండు జిల్లాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజనులకు స్వర్ణయుగం

దేశ చరిత్రలో అశోక చక్రవర్తి పరిపాలనా కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్ర చెబుతుంది. తెలంగాణ గిరిజనులకు మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన స్వర్ణయుగం వంటిది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మా తండాలు, గిరిజన ఆవాసాలను పంచాయతీలుగా ప్రకటించారు. అడగకుండానే 10 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు అటవీ భూములకు హక్కు పత్రాలు అందజేస్తున్నారు. ఈ జాబితానే కాకుండా ఇంకా అర్హులు మిగిలి ఉంటే అధికారులకు చెప్పండి వారికి కూడా హక్కు పత్రాలు వస్తాయి.

– సత్యవతి రాథోడ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

పోడు భూమి హక్కుపత్రాల జాబితా

జిల్లా	దరఖాస్తులు	భూమి (ఎకరాలు)
భద్రాద్రి కొత్తగూడెం	50,595	1,51,195
మహబూబాబాద్	24,972	70,434
ఆసిఫాబాద్	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
ములుగు	7,413	18,869
నిర్మల్	7,257	20,051
ఖమ్మం	5,857	9,779
కామారెడ్డి	4,480	12,969
నిజామాబాద్	3,788	7,697
వరంగల్	3,654	8,366
భూపాలపల్లి	3,428	8,537
మంచిర్యాల	2,403	5,024
నల్లగొండ	2,256	4,426
నాగర్‌కర్నూల్	1,956	4,968
రాజన్న సిరిసిల్ల	1,614	2,857
సంగారెడ్డి	1,128	1,807
మెదక్	610	524
వికారాబాద్	434	554
వనపర్తి	311	379
యాదాద్రి భువనగిరి	186	427
సూర్యాపేట	84	189
హనుమకొండ	70	65
మహబూబ్‌నగర్	19	22
జగిత్యాల	15	19
నారాయణపేట	03	08
పెద్దపల్లి	03	01
మొత్తం	1,50,012	4,05,601

గుడిసెల తొలగింపులో తోపులాట

- పెట్రోలు పోసుకుని ఒకరి ఆత్మహత్యాయత్నం
- మహబూబాబాద్ శివారులో ఉద్రిక్తత

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, గుడిసెవాసుల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. గుడిసెలను తొలగించేందుకు వచ్చిన జేసీబీని అడ్డగించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా కేంద్రం శివారు కురవి రోడ్డులోని 255/1 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో 2 వేల మంది పేద ప్రజలు గుడిసెలు వేసుకున్నారు. అయితే పలుమార్లు పోలీసులు వాటిని తొలగించడం, పేదలు మళ్లీ గుడిసెలు వేయడం పరిపాటిగా మారింది. మళ్లీ బుధవారం ఉదయం ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పోలీసులతో కలసి గుడిసెల ప్రాంతానికి వెళ్లారు. జేసీబీలతో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేయగా గుడిసెవాసులు అడ్డుకున్నారు. మహిళలు అధికారులను అడ్డగించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు పంపించారు. ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడం సరికాదని, అర్హులైన పేదలకు ప్రభుత్వమే స్థలాలు కేటాయిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు, కొంత మంది గుడిసెవాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. అస్వస్థతకు గురైన ఇద్దరు మహిళలను ఆస్పత్రికి తరలించారు.



జేసీబీ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

విద్యార్థినిపై బ్లేడ్‌తో దాడి

ప్రేమను నిరాకరించిందని హత్యాయత్నం

కొండాపూర్(సంగారెడ్డి): తన ప్రేమను నిరాకరించిందని ఓ డిగ్రీ విద్యార్థినిపై ప్రేమోన్మాది బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు మండలానికి చెందిన ఓ విద్యార్థినికి తల్లిదండ్రులు లేరు. బంధువుల ఇళ్ల వద్ద ఉండి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రెండేళ్లకిందట.. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ పోతంగల్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌తో మీసేవ సెంటర్‌లో పరిచయం ఏర్పడింది. అతను ఇంటర్ వరకు చదివి పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఉంటూ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పరిచయాన్ని అడ్డుగా పెట్టుకొని ఆ విద్యార్థినికి ఫోన్ చేయడం, అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టడం మొదలెట్టాడు. దీంతో ఇటీవలే సిమ్ కార్డు మార్చింది. డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాగైనా కాలేజీకి వస్తుందని తెలుసుకొని, ఉదయం 9 గంటలకే కళాశాలకు చేరుకున్నాడు. ఆ విద్యార్థిని కళాశాల ఆవరణకు చేరుకోగానే తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో మెడపై, చేతులపై దాడి చేశాడు. గాయాలపాలైన విద్యార్థిని గట్టిగా కేకలు వేయడంతో అక్కడకు చేరుకున్న తోటి విద్యార్థులు ప్రవీణ్‌కుమార్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థిని పరీక్ష కేంద్రంలోకి పంపి, ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరీక్ష ముగిశాక ఆ విద్యార్థినిని బంధువుల ఇంటికి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

దేశంలోనే తెలంగాణ నంబరు వన్

- జీతభత్యాలు ఎక్కువగా ఇస్తున్నది మన రాష్ట్రమే
- ఉద్యోగులకు తప్పక అండగా నిలుస్తాం
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యేలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): దేశంలోనే కనీవిని ఎరుగని రీతిలో ఉద్యోగులకు అత్యధిక జీతభత్యాలు ఇస్తున్నది తెలంగాణ రాష్ట్రమేనని రాష్ట్ర ఎక్సైజ్, యువజన, క్రీడా శాఖ మంత్రి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఉద్యోగులు అడిగిన పీఆర్‌సీ కంటే ఎక్కువ మొత్తంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వేతనాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస్‌గార్డెన్స్‌లో బుధవారం రాత్రి గెజిటెడ్, నాన్‌గెజిటెడ్, రెవెన్యూ, సింగరేణి, ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ వర్గాలు ఆశించిన విధంగా టీఏ, డీఏలు చెల్లిస్తున్నామని, ఈ విధానం దేశంలో ఎక్కడా అమలులో లేదని చెప్పారు. ఐదు వేల వేతనంతో వెట్టి చాకిరీ చేసిన హోంగార్డులకు తలెత్తుకుని గర్వపడేలా రూ.30 వేల వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వమని స్పష్టంచేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను ఒకరోజు అటుఇటు అయినా పరిష్కరించే ప్రభుత్వమని అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పోరాటాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరువదని స్పష్టం చేశారు. దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ ప్రభుత్వం మీది : బాల్క సుమన్

ఉద్యోగ వర్గాలదే ఈ కేసీఆర్ ప్రభుత్వమని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆనాడు ప్రత్యేక తెలంగాణ కోసం సాగిన ఉద్యమంలో ఉద్యోగులు జీతాలను సైతం ప్రక్కనబెట్టి పాల్గొన్న తీరు మరువలేనిదని అన్నారు. మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటనకు వస్తున్నారని, జిల్లాలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనను సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రతీ ఒక్కరి అండదండలు అవసరమని పేర్కొన్నారు.

ఘనంగా సన్మానం

ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం అనంతరం గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను గౌడ కులస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో



జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు

వాంకిడి(ఆసిఫాబాద్): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఖమాన గ్రామానికి చెందిన రాంటెంకి కొండయ్య కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు గోయేగాం వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కొండయ్య రియాజ్‌కు చెందిన ఐచర్ వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హుజూరాబాద్‌కు ఐచర్‌పై వెళ్లగా 22న తెల్లవారు జామున కరీంనగర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం మంగళవారం కుటుంబీకులు నాగపూర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రియాజ్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. బాధిత కుటుంబానికి రూ.5లక్షలు, ఇన్సురెన్స్ డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.2.5 లక్షలు, ఇన్సూరెన్స్ డబ్బులు ఇస్తామని వాహన యాజమాని బంధువులు హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు.

అంబులెన్స్ లేక.. ఆటో ట్రాలీయే దిక్కు

- చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడలో రోడ్డు ప్రమాదం
- 108 వాహనం లేక క్షతగాత్రుల నరకయాతన
- ఆటోట్రాలీలో కాగజ్‌నగర్‌కు తరలించిన స్థానికులు



ట్రాలీలో ప్రదీప్, దయాకర్‌ల తరలింపు

చింతలమానెపల్లి(సిర్పూర్): అత్యవసరంలో సేవలందించాల్సిన 108 వాహనం అందుబాటులో లేక రోడ్డ ప్రమాదం గాయపడిన వారు నరకయాతన అనుభవించారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్తులు క్షతగాత్రులను ఆటో ట్రాలీలో తరలించారు. ఈ ఘటన కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ అనుకోడ గ్రామంలోని మూలమలుపు వద్ద బుధవారం ప్యాసింజర్ ఆటో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న దుర్గం ప్రదీప్ కాలు విరగడంతోపాటు పలుచోట్ల గాయాలు కాగా, దయాకర్ చేతికి దెబ్బలు తగిలాయి. స్థానికులు వెంటనే 108 నంబర్‌కు సమాచారం అందించారు. బెజ్జూర్, కౌటాల మండలాలకు చెందిన 108 వాహనాలు రోగులను తరలించేందుకు వెళ్లడంతో బాలాజీ అనుకోడ గ్రామానికి రాలేమని సిబ్బంది సమాధానం ఇచ్చారు. గాయపడిన వారికి స్థానికులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఆటో ట్రాలీలో కాగజ్‌నగర్‌కు తరలించారు. చింతలమానెపల్లి మండలానికి 108 వాహనం మంజూరు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ సాధనకు ఉపకార వేతనం

- ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో 231 విద్యార్థుల ఎంపిక

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్‌మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) అమలు చేస్తోంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తోంది. విద్యార్థి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తోంది. ఈ డబ్బులతో విద్యార్థులు తమకు అవసరమైన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశముంది.

ఉమ్మడి జిల్లాలో 231 మంది ఎంపిక

ఈ విద్యాసంవత్సరం ఉమ్మడి జిల్లా నుంచి 231మంది విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. డిసెంబరులో 8వ తరగతి విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష నిర్వహించగా ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో కరీంనగర్–72, పెద్దపల్లి–49, జగిత్యాల–69, రాజన్నసిరిసిల్ల–41మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవాళ్లే ఎక్కువగా ఉంటారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను అందుకోవడంలో ముందుంటున్నారు. ఈ విద్యాసంవత్సరం ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లయితే మరికొంత విద్యార్థులు సైతం ఉపకారం పొందే అవకాశముంటుంది.



ఎంపికైన చామనపల్లి పాఠశాల విద్యార్థులు

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 28మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం అభినందనీయం. చామనపల్లి పాఠశాలలో పది మందికి మూడునెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఉపాధ్యాయుల కృషితో ముగ్గురు విద్యార్థులు వాణి,అక్షయ,అక్షర ఎంపికయ్యారు.

– కోట లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, చామనపల్లి జెడ్పీ పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వరం

- కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్యకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు అర్హులు
- జూన్ 3 వరకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదోతరగతిలో 7 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ కోర్సును ఉచితంగా చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. పదో తరగతిలో సాధించిన జీపీఏ, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని 2023–24లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అవకాశం కల్పించనున్నారు. కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదివే అవకాశం దక్కించుకున్న విద్యార్థుల ఫీజును ప్రభుత్వం కళాశాల యాజమాన్యాలకు చెల్లిస్తుంది. మీ సేవా కేంద్రాల ద్వారా తెలంగాణ ఈ–పాస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.

అర్హులు వీరే..

ఈ విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్షల్లో 7 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదివిన విద్యార్థులు ఉచిత అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులు జూన్ 3 వరకు https://telaganaepass.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

నిబంధనలు..

తల్లిదండ్రుల వార్షిక ఆదాయ పత్రాన్ని దరఖాస్తుతో జతచేయాలి. గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు వార్షికాదాయం మించరాదు. కుల, స్థానిక ధ్రువపత్రాలు జత చేయాలి. దివ్యాంగులు వైకల్యానికి సంబంధించిన ధ్రువపత్రం అందజేయాలి. ఆధార్ కార్డు ప్రతిని విధిగా జత చేయాలి.


దరఖాస్తు విధానం..

మీ సేవా కేంద్రాల ద్వారా టీఎస్‌ఈపాస్ పోర్టల్‌లోని దరఖాస్తు పత్రంలో విద్యార్థి పూర్తి వివరాలు, పదో తరగతిలో సాధించిన జీపీఏ ధ్రువీకరణతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు, సెల్ నంబరు, ఈ మెయిల్ ఐడీ, విద్యార్థి పాస్‌పోర్టుసైజ్ ఫొటో స్కాన్ చేసి జత చేయాలి. నాలుగు నుంచి పదోతరగతి వరకు విద్యార్థులు చదివిన పాఠశాలల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

ఎంపిక ఇలా..

విద్యార్థులు పదోతరగతిలో సాధించిన జీపీఏతో పాటు రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన వారికి కేటాయించిన కార్పొరేట్ కళాశాలల వివరాలతో సమాచారం పంపిస్తారు. ఎంపికైన విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు వెళ్లి ఇంటర్ మొదటి సంవత్సరంలో నిర్ణీత గడువులోగా చేరాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 7 జీపీఏపైగా గ్రేడ్ సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో సీట్లతో పాటు అన్ని వసతులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

– నేతానియల్, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ

ఎండవేడికి జేసీబీ దగ్ధం!

రుద్రంగి(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని మానాల అటవీ శివారులో మానాల– మరిమడ్ల రోడ్డు పనులకు వినియోగించే జేసీబీ బుధవారం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం... మధ్యాహ్నం డ్రైవర్ జేసీబీని రోడ్డు పక్కన నిలిపి భోజనానికి వెళ్లాడు. ఆ తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు వాటర్ ట్యాంకర్ తీసుకువచ్చి మంటలు ఆర్పారు. ఎండవేడిమికే జేసీబీ కాలిపోయిందని పేర్కొంటున్నారు.







రోహిణి కార్తె

నేటి నుంచి రోహిణి కార్తె. రోళ్లు పగులుతాయని ప్రతీతి.
ఇంకో రెండు వారాలు ఉగ్ర ఉష్ణాన్ని ఎదుర్కొనక తప్పదు.
కాని ప్రతిదానికి ప్రకృతిలో విరుగుడు ఉంటుంది.
మార్కెట్‌ను ముంజెలు ముంచెత్తుతున్నాయి.
ఎండకు జవాబుగా తమను జుర్రుకోమంటున్నాయి.
పెద్దవాళ్లు వీటిని మర్చిపోయారు. పిల్లలు చులకనగా చూస్తున్నారు.
కాని ముంజె చేసే మేలు తల్లి కూడా చేయదు.
కుటుంబాన్ని కాపాడే శక్తి దీనికి ఉంది. అంతేనా?
ఈ ముంజెల చుట్టూ అందరికీ ఎన్నో జ్ఞాపకాలు.

చల్లగా తినండి ఎండను జయించండి

ఇప్పుడు కాదులెండి... ముప్పై నలభై ఏళ్ల కింద మంచి ఎండ పూట వీధుల్లో 'తాటి ముంజెలో తాటి ముంజెలో' అని అరుపు వినిపిస్తే వంట పనిలోనో, అన్నాలు అయ్యాక కునుకులోకి వెళ్లబోతో ఉన్న అమ్మ, నానమ్మ, ఇంటికి భోజనానికి వచ్చిన నాన్న... 'పిలువు... పిలువు' అని పిల్లల్ని పురమాయించేవారు. పిల్లలు పరిగెత్తుకొని బయటకు వెళితే ఎవరో ఒక గ్రామీణుడు కావడిబద్దకు చెరొకవైపు ముంజెలు కట్టిన లేత తాటాకు కట్టలతో కనిపించేవాడు. 12 తాటి ముంజెల కట్టది ఒక రేటు. 24 తాటి ముంజెల కట్టది ఒక రేటు. గీచి గీచి బేరం తెగ్గొట్టాక, ఇంట్లోకి తెచ్చి కట్ట విప్పితే అన్నీ లేతగా ఉంటే అదృష్టం. ముదురు ఎక్కువగా ఉండే నష్టం. అమ్మ తాటిముంజెల చెక్కు తీసి, స్టీలు గిన్నెలో వాటిలో నుంచి నీరు చిమ్ముతూ ఉండగా ముక్కలుగా కోసి, కొద్దిగా చెక్కెర జల్లి మూతేసి పెట్టి (ఇప్పుడు ఫ్రిజ్‌లో పెట్టి) 'నిద్ర పోయి లేచాక తిందాం' అని చెప్తే నిద్ర పడితే కదా. మధ్యాహ్నం కునుకు పూర్తి కాకముందే ఆ తాటి ముంజెల్ని గబగబా తింటూ ఆఖరున ఆ చెక్కెర నీరు తాగుతూ ఉంటే ఎంతో హాయి మరెంతో రుచి ఇంకెంతో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయేది.

★★★

పల్లెల్లో ఎక్కడ పడితే అక్కడ తాటి చెట్లు, వాటిక్కాసిన గెలలు దొరుకుతాయి. తాటిచెట్టు ఎక్కడం ఆర్ట్. రాకపోతే ఒళ్లు చెక్కుకుపోతుంది. ఎక్కగలిగినవాడు కొడవలి విసిరి గెల కిందకు తెస్తే అల్లరి పిల్లలు మూగి చెక్కిన తాటి కాయల్లో నుంచి తొంగి చూసే కన్నులను కుడివేలు బొటన వేలుతో జుర్రేసి మింగేసేవారు. ఒక్కొక్కరు ఐదు పది కాయలను కూడా జుర్రేసేవారు. ఇక ఎంత ఎండలో ఆడినా డీహైడ్రేషన్ అవడం అసాధ్యం. వడదెబ్బ అసంభవం. కడుపులో చేరిన లేత నీరు అలాంటిది.

★★★

పట్నాల్లో ఎడ్ల బండ్లలో తాటి గెలలు తెచ్చి రోడ్డుకు ఒకవైపున బండి ఆపి తాటికాయలను కొట్టి ఒక్కో



కాయ ఇంత అని అమ్ముతూ ఉంటే పిల్లలు తెగమూగేవారు. పెద్దలు అక్కడిక్కడ తిని డిప్పల్ని పారేసేవారు. పిల్లలు ఆ ఖాళీ డిప్పల్లో కాస్త పెద్దవాటిని రెండు ఎంచుకుని ఒక పుల్లతో అనుసంధానించి తాడు కట్టి లాగుతూ తాటిబండి ఆట ఆడుకునేవారు. వేసవిని పంపిన భగవంతుడు తాటిచెట్టు చిటారుకొమ్మన తాటి గెలలను పెట్టి వాటిలో ముంజెలను పెట్టి ఆ ముంజెల్లో తియ్యటి నీరును పెట్టడమే దయకు సూచన. కరుణకు ఆనవాలు.

★★★

తాటి ముంజెలు పిల్లలు, పెద్దలు, గర్భిణులు, బాలింతలు అందరూ తినొచ్చు. తినాలి. వేసవిలో ఉష్ణం వల్ల ఆమ్ల, క్షార గుణాల్లో తేడా వచ్చి శరీరంలో విషకారకాలు ఉత్పన్నం అవుతాయి. వాటిని నిర్మూలం చేయాలంటే తాటి ముంజెలకు మించినవి లేవు. శరీరంలో కోల్పోయిన నీటిని ముంజెలు సమతులం చేస్తాయి. ఒంటికి చలువనిస్తాయి. కోవిడ్ అనంతర నీరసంలాంటి సమస్యలను, అలసటను తరిమికొట్టే శక్తి ముంజెలకు ఉంది. అవి మార్కెట్‌లో కనపడేనన్ని రోజులు తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి తెచ్చుకోవచ్చు. లేత తాటిముంజెల్లో ఉన్న నీరు మినరల్ వాటర్‌తో సమానం. తాటి ముంజెలు జీర్ణ శక్తికి అద్భుతంగా తోడ్పడతాయి. కడుపు ఉబ్బరం, ఎసిడిటీ ఉన్నవారు ఉదయాన్నే గ్యాస్ నిండినట్టుగా భావించేవారు లేత ముంజెలు తింటే చాలా మంచిది. గర్భిణులు తింటే తల్లికి, లోపల ఉన్న బిడ్డకు మంచిది. ఈ విషయాన్ని తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనతో తేల్చారు.

★★★

రోహిణి కార్తెలో వడదెబ్బ తగలకుండా ముంజెలు కాపాడతాయి. వికారం ఉంటే పోగొడతాయి. తట్టు, పొంగులను నివారిస్తాయి. కాలేయాన్ని ఉత్సాహపరుస్తాయి. అధిక బరువు ఉన్నవారు వీటిని ఒక పూట ఆహారంగా తీసుకుంటే (వీటితో పాటు ఒక పండు తింటే) బరువు తగ్గుతారు. సీజన్‌లో వచ్చే ఫలాలు ఆ సీజన్‌లో వచ్చే సమస్యలను దూరం చేస్తాయని అందరికీ తెలుసు. వేసవిలో వచ్చే ముంజెలు వేసవి సమస్యలకు సమాధానం చెప్తాయి.

★★★

ముదురు తాటిముంజెలు తినకూడదు. పిల్లలకు పెట్టకూడదు. కడుపునొప్పి వస్తుంది. ఇప్పుడు మార్కెట్‌లో పాలిథిన్ కవర్లలో ముంజెలు అమ్ముతున్నారు. పిల్లలు పోజులకు పోయినా తప్పనిసరిగా తినిపించాలి. వీటిని ఇంగ్లిష్‌లో 'ఐస్ యాపిల్స్' అంటారని చెప్తే పేరు నచ్చయినా తింటారు.

చల్లగా తినండి. ఎండను జయించండి.

డాక్టరేట్ కలను 'సెల్ఫ్ హెల్ప్' నెరవేర్చింది

కుగ్రామం నుంచి ఈ కామర్స్ దాకా నారాయణమ్మ విజయగాథ

నారాయణమ్మ నీరగంటి... ఆంధ్రప్రదేశ్, సత్యసాయి జిల్లాలోని ముష్టి కోవెల అనే చిన్న గ్రామంలో అత్యంత సామాన్యమైన కుటుంబంలో పుట్టిన మహిళ. చదువంతా ప్రభుత్వ విద్యా వ్యవస్థలోనే. ఆమె ఈ రోజు ఒక 'ఈ కామర్స్' సంస్థను స్థాపించి తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి కావాలనే తన కలను నిజం చేసుకోవడానికి పీహెచ్‌డీలో చేరారు. త్వరలో పట్టానందుకోనున్న నారాయణమ్మ తన ఆకాంక్షల సుమహారాన్ని సాక్షితో పంచుకున్నారు.



డ్వాక్రా దారి చూపింది

''మా నాన్న రైతు. పిల్లల్ని బాగా చదివించాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. ఐదవ తరగతి వరకు మా ఊరి బడిలో చదివాను. ఆరు, ఏడు తరగతులకు ఉదయం ఐదు కిలోమీటర్లు, సాయంత్రం ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చింది. దాంతో అనంతపురంలో ఒక చిన్న గది అద్దెకు తీసుకుని నన్ను, మా అన్నను చదివించారాయన. అలా ఎనిమిదవ తరగతి నుంచి నేను ఇంటి పని, వంట పని చేసుకుంటూ చదువుకున్నాను. అనంతపూర్‌లో డిగ్రీ పూర్తయిన తర్వాత ఎంబీఏకి ఆళ్లగడ్డ వెళ్లాను. ఆ తర్వాత పెళ్లితో హైదరాబాద్ రావడం నా ఉస్మానియా కల నెరవేరడానికి మార్గం సుగమం చేసింది. అధ్యయనానికి విద్యాసంవత్సరంలో 'సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ అండ్ చాలెంజెస్' అంశాన్ని తీసుకున్నాను. 2010–11 నుంచి రంగారెడ్డి, సత్య సాయి జిల్లాల్లో డ్వాక్రా సంఘాలను అధ్యయనం చేశాను. మొత్తం ఐదు వందల గ్రూపుల కార్యకలాపాలను తెలుసుకున్న తర్వాత గ్రామీణ మహిళల్లో ఉన్న నైపుణ్యాలు, అవకాశాల మీద ఒక అవగాహన వచ్చింది. ఆర్థిక స్వావలంబనను, స్వయంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడాన్ని ఆస్వాదిస్తున్నారు. దాంతో వారిలో ఆత్మవిశ్వాసం కూడా మెరుగైంది. అవకాశాలు అందివస్తే ఇంకా ఏదో సాధించాలనే తపన కూడా కొందరిలో ఉంది. అలాంటి అభిరుచి ఉన్న వాళ్లకు వనరులు, ప్రభుత్వ అధికారుల సహకారం ఉంటే అద్భుతాలు చేయగలుగుతారు కూడా. ఇలాంటి సమన్వయం కొన్ని చోట్ల లేకపోవడం కూడా గమనించాను. మొత్తానికి మార్కెటింగ్ గురించిన ఆందోళన లేకపోతే ఉత్పత్తి విషయంలో శ్రమించడానికి వాళ్లు వెనుకాడరు. నా అధ్యయనం ఇలా సాగుతున్న సమయంలోనే కరోనా వచ్చింది.

కరోనా కొల్లగొట్టింది

కరోనా సమయంలో హోటళ్లతో సహా అన్నీ మూత పడడంతో ఉద్యోగాలు లేక ఏదో ఒక పని దొరికితే చాలన్నట్లు చాలా మంది కనిపించారు. శ్రమించే చేతులున్నాయి, ఆ ఉత్పత్తి అవసరమైన వ్యక్తులున్నారు. వాళ్ల మధ్య కరోనా కరాళ నృత్యం చేస్తోంది. అప్పుడు ఈ కామర్స్ రంగంలో ఓ ప్రయత్నం చేశాను. కర్పూరం తయారీదారుల నుంచి కర్పూరాన్ని డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ఇంటింటికీ చేర్చడంలో విజయవంతమయ్యాను. మీషోలో సరదాగా మొదలు పెట్టిన రీ సేల్ అనుభవమూ తోడైంది. నా మార్కెట్‌ను విస్తరించడానికి శాన్విస్ స్టోర్, భవిత శ్రీ ట్రేడింగ్, ఫ్యాషన్, లేజీ షాపింగ్ వాణిజ్య వేదికలతో సెల్లర్‌గా అమెజాన్‌తో అనుసంధానమయ్యాను. ఆ అనుభవంతో గత ఏడాది నవంబర్‌లో మీథాట్ ఈ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సొంత కంపెనీ ప్రారంభించాను. ఏడాది కోటి రూపాయల టర్నోవర్‌కు చేరుతుందని అంచనా. ఏడాదికి నికర లాభం ఏడెనిమిది లక్షలుండవచ్చు.

ఎక్కడి ఆర్డర్‌కి అక్కడే పరిష్కారం

ఆహారం మీద ప్రత్యేక దృష్టి పెట్టాను. నగరాల్లో మహిళలందరూ ఏదో ఒక ఉద్యోగం, వ్యాపారాల్లో నిమగ్నమై ఉంటున్నారు. పిల్లలకు మన రుచులను ఇంట్లో చేసి పెట్టడం వాళ్లకు కష్టమే. అందుకే సౌత్ ఇండియన్ స్నాక్స్ హోమ్‌మేడ్‌వి అందిస్తున్నాను. నా నెట్‌వర్క్‌లో 30కి పైగా మహిళలున్నారు. ఒక ప్రదేశం నుంచి ఆర్డర్ రాగానే అదే ప్రదేశంలో ఉన్న మహిళకు ఫార్వర్డ్ చేస్తాను. మెటీరియల్ కొనుగోలు, ఆమె శ్రమకు వేతనం ఇస్తాను. ఆమె పిండివంటలు తయారు చేసి ప్యాక్ చేసి ఉంచుతుంది. మా కొరియర్ నెట్‌వర్క్ వాళ్లు ఆమె ఇంటికి వెళ్లి పార్సిల్‌ను కలెక్ట్ చేసుకుని కొరియర్ ఆర్డర్ ఇచ్చిన వినియోగదారులకు చేరుస్తారు. దాంతో పిండివంటలు తయారు చేసిన రోజే అందుతుండడంతో బాగా క్లిక్ అయింది.



గ్రామాలకు విస్తరించాలి

ఇప్పటి వరకు నా నెట్‌వర్క్ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అనంతపూర్, చిత్తూరు, గుంటూరు వంటి కొన్ని చోట్లలోనే ఉంది. ఇక గ్రామాల్లో ఉండే డ్వాక్రా మహిళలను అనుసంధానం చేయాలి. ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రాజెక్ట్ గ్రామాల్లో పెట్టాలనేది నా ఆలోచన. ఒక కుటుంబానికి అవసరమైన ప్రతి వస్తువూ నా ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్ మీద లభించేటట్లు పటిష్ఠం చేయాలి. అలాగే విదేశాలకు సీమంతం కిట్, ఒడిబియ్యం కిట్, గర్భిణి తినాల్సిన పిండివంటలను ఎగుమతి చేయాలి. ఈ సర్వీస్ ఈ కామర్స్‌లో లేదు. ఈ కామర్స్ వేదిక లైసెన్స్, ట్రేడ్‌మార్క్, కాపీ రైట్స్, పేటెంట్‌లు, ఫుడ్ లైసెన్స్, వెబ్‌సైట్ నిర్మాణం, ప్రమోషన్ కోసం మూడు లక్షల వరకు ఖర్చు చేశాను. ఇవన్నీ ఇందులోకి వచ్చిన తర్వాత నేర్చుకున్నాను. నా ఈ ప్రయత్నంలో గృహిణులు, ఒంటరి మహిళలు, అరవై నిండిన పెద్దవాళ్లు కూడా ఉపాధి పొందుతున్నారు.

ఉపాధినిస్తోంది

మూడేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత పీహెచ్‌డీ కోసం ఉద్యోగం మానుకున్నాను. ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరతానని అప్పుడనుకోలేదు. లెక్చరర్‌గా భర్త సంపాదనకు తోడు నేనూ ఉద్యోగం చేసుకుంటూ , ఇద్దరమ్మాయిలను పెంచుకుంటూ ప్రశాంతంగా ఉండవచ్చు. కానీ నేను చేసిన ఎంబీయే ఫైనాన్స్, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల మీద పీహెచ్‌డీ నన్ను చిన్న పరిధిలో ఉంచడానికి ఇష్టపడలేదు. ఈ సాహసానికి ఒడిగట్టేలా ప్రోత్సహించాయి. మా గైడ్ శ్రీరాములు గారి పర్యవేక్షణలో నా పరిశోధన పూర్తయింది. డాక్టర్ నారాయణమ్మ అనే పేరు నా చిన్నప్పటి కల'' అన్నారు నారాయణమ్మ. కల నెరవేరుతున్న ఆనందం ఆమె కళ్లలో కనిపించింది, ఆ మాట చెప్తున్నప్పుడు ఆ స్వరంలో ఆనందం తొణికిసలాడింది.

– వాకా మంజులారెడ్డి

విభిన్న

పుష్ప విలాస శోభితం

తమను నిర్లక్ష్యంగా తొక్కుకుంటూ వెళ్లే పాదు కాళ్లపై...
'అక్కట!' అని ఆగ్రహం ప్రకటించాయి 'పుష్ప విలాపం' కావ్యంలోని పసి పుష్పాలు.
హేమలతా ప్రధాన్ చిత్రాలలో మాత్రం వర్ణశోభితమైన పుష్ప విలాసం కనిపిస్తుంది.
ఆ చిత్రాలు మనల్ని ప్రకృతి ప్రపంచానికి దగ్గర చేస్తాయి.
పర్యావరణ సంరక్షణపై దృష్టి పెట్టేలా చేస్తాయి....



● హేమలతా ప్రధాన్



సిక్కిం–డార్జిలింగ్ హిమాలయ ప్రాంతంలో పూలసాగు, పండ్ల సాగు, కూరగాయల సాగులో ఆరితేరిన కుటుంబంలో పుట్టింది హేమలత ప్రధాన్. చిన్నప్పటి నుంచి మొక్కలు అంటే ఎంతో ఇష్టం. రెల్లీ నది సమీప అటవీ ప్రాంతంలో ఎన్నో మొక్కలు ఆమెకు నేస్తాలు.

మొక్కలపై ప్రేమతో తనదైన దారిని నిర్మించుకొని బొటానికల్ ఆర్టిస్ట్‌గా ఎదిగింది హేమలత.

హిమాలయ పర్వత ప్రాంతాలలోని అరుదైన మొక్కలు, పుష్పాలు హేమలత కుంచెలో కొత్త సొగసులు దిద్దుకుంటాయి. తన పెయింటింగ్‌తో తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది హేమలత. ఆమె గీసిన హిమాలయాల్లోని నెర్విల్లా ఆర్కిడ్ చిత్రం టోక్యోలో జరిగిన జపాన్ గ్రాండ్ ప్రిక్స్ ఆర్కిడ్ ఫెస్టివల్‌లో అవార్డ్ అందుకుంది. ఈ అంతర్జాతీయ స్థాయి అవార్డ్ తన ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. మరింత సాధన చేసేలా చేసింది.

హిమాలయ పుష్పాలపై ఆమె గీసిన ఎన్నో కలర్ పెయింటింగ్స్ లెక్కలేనన్ని బహుమతులు గెలుచుకున్నాయి. రాయల్ హార్టికల్చరల్ సొసైటీ (బ్రిటన్) బంగారు పతకం పొందిన తొలి భారతీయ మహిళా ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందింది హేమలత.

హేమలత గీసిన ఆర్కిడ్ చిత్రాలు భూటాన్ పోస్టేజ్ స్టాంప్‌లపై కొలువుదీరాయి. హిమాలయప్రాంతంలో మహిళా బొటానికల్ ఆర్టిస్ట్‌లు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఒకరు హేమలత. మరొకరు ఖట్మాండ్‌లోని నీరా జోషి.

ఆర్ట్ టీచర్‌గా కలిమ్‌పోంగ్ (పశ్చిమ బెంగాల్) జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలకు తన కళను దగ్గర చేస్తోంది హేమలత. కేవలం చిత్రకళకే పరిమితం కాకుండా హిమాలయాలలోని మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ సంబంధిత విషయాలు కూడా వారికి విడమరచి చెబుతుంది.

గత సంవత్సరం హిమాలయన్ ట్రస్ట్ ఫర్ నేచురల్ హిస్టరీ ఆర్ట్(హెచ్‌టీఎన్‌హెచ్‌ఏ)కు శ్రీకారం చుట్టింది హేమలత. క్షేత్రస్థాయిలో చిత్రకళ, విద్య, పర్యావరణ స్పృహను మిళితం చేయాలనేది ఈ ట్రస్ట్ లక్ష్యం. గతంలో 'స్కూల్ ఆఫ్ నేచురల్ హిస్టరీ ఆర్ట్'ను ప్రారంభించిన హేమలత ఈ స్కూల్ ద్వారా చిత్రకళను, ప్రకృతిని మేళవించి ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది.



● పిల్లలకు ప్రకృతి కళను దగ్గర చేస్తూ...

పెయింటింగ్స్, సెరమిక్స్, శిల్పాలు, టెక్స్‌టైల్స్, జువెలరీ డిజైన్ల ద్వారా ప్రకృతి ప్రపంచం అద్భుతాన్ని పిల్లలకు చేరువ చేయడంతో పాటు వారికి రకరకాల ఆర్టిస్టిక్ టెక్నిక్‌లను, స్టైల్స్‌ను నేర్పిస్తోంది.

'నా దృష్టిలో బొటానికల్ ఆర్ట్ అనేది కాన్వాస్‌పైకి పువ్వుల అందాన్ని తీసుకురావడం మాత్రమే కాదు. ఆర్ట్‌కు సైన్స్ కు మధ్య ఉండే దూరాన్ని దూరం చేయడం. బొటానికల్ ఆర్ట్ అనేది ప్రకృతి ప్రాముఖ్యత గురించి బలంగా చెప్పే సాధనం' అంటోంది హేమలతా ప్రధాన్.

సైబర్ టాక్

నురేష్ (పేరు మార్చడమైనది) ఫోన్ అదే పనిగా మోగుతుండటంతో కాల్ లిఫ్ట్ చేశాడు. కాలర్ చెప్పిన మాటలు వింటున్న నురేష్‌కి చెమటలు పట్టాయి. కంగారుతో 'అడిగినంత డబ్బు ఇస్తాను. ఆ ఫొటోను ఎక్కడా షేర్ చేయవద్ద'ని బతిమాలుకున్నాడు. జరిగిన సంఘటనను తన స్నేహితుడి దగ్గర చెప్పి బాధపడ్డాడు. ఫేక్ డీపీ స్కామర్ కారణంగా నురేష్ మోసపోయాడని ఫ్రెండ్‌కి అర్థం అయింది.

మన లేదా మన కుటుంబ సభ్యుల సోషల్ మీడియా ప్రొఫైల్ డీపీ తీసుకొని, మార్ఫింగ్ చేయడం, ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి డబ్బు డిమాండ్ చేస్తుంటారు స్కామర్లు. లేకపోతే ఆ ఫొటోని సోషల్ మీడియాలో షేర్ చేస్తానని, బంధుమిత్రులకు పంపుతానని బెదిరించడం మొదలుపెడతారు. దీంతో బాధితులు తమ పరువుకు సంబంధించిన విషయంగా భయపడి, దానిని అడ్డుకోవడానికి స్కామర్‌కు ఎంతో కొంత డబ్బు చెల్లిస్తుంటారు. మార్ఫింగ్ ప్రొఫైల్ పిక్చర్‌లతో దోపిడీ చేసే మోసగాళ్లు ఇటీవలి కాలంలో పెరగడం చూస్తుంటే ఈ విషయంలో ప్రతి యూజర్ తగిన జాగ్రత్తలపైనా తప్పక దృష్టి పెట్టాల్సిందే.

నకిలీ డీపీ ద్వారా మోసపోకండి

ప్రొఫైల్ ఫొటో

ఇది సామాజిక మాధ్యమాలలో మన గుర్తింపును సూచించే చిత్రం. వినియోగదారుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్‌ను పోస్ట్ చేసినప్పుడు, కామెంట్ లేదా పరస్పర చర్చ జరిపినప్పుడు వారి పేరు పక్కన కనిపించే ఫొటో ఇది.

నమ్మించి..

స్కామర్లు పెద్ద స్థాయి కంపెనీ సీఇవో లు లేదా ఉన్నతస్థాయి అధికారులను పోలి ఉండే డిస్‌ప్లే చిత్రాలను ఉపయోగించి నకిలీ వాట్సప్ ప్రొఫైల్స్‌ను సృష్టిస్తారు. ఆ తర్వాత స్కామర్ బాధితురాలితో సహా ఆ కంపెనీ ఉద్యోగులందరికీ మెసేజ్‌లు పంపుతారు. తనే కంపెనీ సీఈవో అని చెప్పుకుంటూ, సహోద్యోగులతో పంచుకోవడానికి గిఫ్ట్ వోచర్లను అందజేస్తారు. బాధితుడు, మెసేజ్ చట్టబద్ధమైనదని, తమ బాస్ నుండి వస్తున్నదని నమ్మి, వోచర్లను కొనుగోలు చేయవచ్చు. వాటిని సహోద్యోగులతో పంచుకోవచ్చు. స్కామర్ మాత్రం ఎక్కడా తన అడ్రస్ లేకుండా జాగ్రత్తపడతాడు.

మ్యాట్రిమోనియల్ స్కామ్‌లు

స్కామర్లు నకిలీ ప్రొఫైల్స్ సృష్టించడానికి మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లలో ఆకర్షణీయమైన వ్యక్తుల డీపీలను ఉపయోగిస్తారు. దీంతో కాబోయే వధూవరులు సంభాషణలలో పాల్గొంటారు. వారి నమ్మకాన్ని పొందుతారు. తరువాత ప్రయాణ ఖర్చు, వైద్య, అత్యవసర పరిస్థితులు లేదా కట్నం డిమాండ్లు వంటి వివిధ కారణాల కోసం డబ్బు అడుగుతారు. డబ్బు పొందాక స్కామర్ కనిపించడు.

లాటరీ స్కామ్‌లు

సోషల్ మీడియాలో నకిలీ ప్రొఫైల్స్‌ను సృష్టించడానికి ప్రసిద్ధ వ్యక్తులు లేదా సంపన్న వ్యక్తుల డీపీలను స్కామర్లు ఉపయోగిస్తారు. బాధితుడు లాటరీని లేదా బహుమతిని గెలుచుకున్నాడని, ఆ బహుమతి మొత్తాన్ని రిలీజ్ చేయడానికి వ్యక్తిగత సమాచారం, ఫీజులు లేదా టాక్స్ చెల్లించడానికి డబ్బు పంపమని అడుగుతారు. అసలు విషయం తెలియక బాధితులు బహుమతులు పొందకుండానే డబ్బును కోల్పోతున్నారు.

నిధుల సేకరణ స్కామ్‌లు

స్కామర్లు క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు లేదా సోషల్ మీడియాలో సానుభూతితో కూడిన ఫొటోలతో డీపీలు, ప్రొఫైల్‌లను సృష్టిస్తారు. వైద్య చికిత్స, విద్య లేదా సామాజిక కారణాల కోసం ఆర్థిక సహాయం అవసరమని అడుగుతారు. కానీ, అది నిజమై ఉండదు. డబ్బు తీసుకున్న తర్వాత స్కామర్ కనిపించరు.

పెట్టుబడుల స్కామ్‌లు

స్కామర్లు బాధితుల విశ్వసనీయతను పొందేందుకు సక్సెస్ సాధించిన పెట్టుబడిదారులు లేదా ఆర్థిక నిపుణుల డీపీలతో ప్రొఫైల్‌లను సృష్టిస్తారు. వారు వ్యక్తులను సంప్రదించి, అధిక రాబడుల వాగ్దానాలతో పెట్టుబడులను ఆహ్వానిస్తారు. అయితే, అవన్నీ మోసపూరితంగానే ఉంటాయి. బాధితులు మాత్రం తెలియక డబ్బు కోల్పోతారు.

రిపోర్ట్ లేదా బ్లాక్ చేయడానికి..

● ఫేస్‌బుక్ ప్రొఫైల్‌లోని మూడుచుక్కల మెనూ (...)పై క్లిక్ చేయండి. వచ్చిన సూచనలను అనుసరించండి. ● ఇన్‌స్టాగ్రామ్‌లో మీ డీపీ ఉన్న ఏదైనా ఖాతా ప్రొఫైల్‌కి వెళ్లి, కుడివైపున పై భాగంలో ఉన్న మూడు చుక్కల మెనూపై నొక్కి, రిపోర్ట్ ఆప్షన్‌ను ఎంచుకొని, సమస్యను నివేదించడానికి వచ్చిన సూచనలను ఫాలో అవ్వండి. ● ట్విటర్‌లో మీ డిస్ ప్లే ఫొటోని దుర్వినియోగం చేస్తున్న ఖాతా ప్రొఫైల్‌లోకి వెళ్లి, కుడివైపున పై భాగంలో ఉన్న మూడు చుక్కల మెనూని క్లిక్ చేసి, రిపోర్ట్ ఆప్షన్ ఎంచుకోండి. ఖాతా గురించి రిపోర్ట్ చేయడానికి వచ్చిన సూచనలను ఫాలో అవ్వండి. ● లింక్డ్ ఇన్‌లో ఇదే విధంగా చేయచ్చు ● వాట్సాప్‌లో మీ డీపీ మిస్‌యూజ్ చేస్తున్న వ్యక్తి చాట్‌ని ఓపెన్ చేసి, కుడివైపున పై భాగంలో ఉన్న మూడు చుక్కల మెనూని క్లిక్ చేసి, రిపోర్ట్ ఆప్షన్ ఎంచుకోండి. ఖాతా గురించి రిపోర్ట్ లేదా బ్లాక్ చేయడానికి వచ్చిన సూచనలను ఫాలో అవ్వండి.

డీపీల భద్రత

● గోప్యతా సెట్టింగ్‌లను సమీక్షించండి. మీరు అప్‌లోడ్ చేసే ఫొటోలు మీరు ఎంచుకున్న వ్యూవర్స్‌కి మాత్రమే కనిపించేలా సెట్టింగ్స్ ఎంచుకోండి. ● మీ డీపీకి వాటర్ మార్క్ జోడించండి. దీని వల్ల ఎవరైనా మీ ఫొటోని వారి సొంత ఫొటోగా మార్చడం కష్టం అవుతుంది. ● వ్యక్తిగత ఫొటోలను విరివిగా షేర్ చేయడం మానుకోండి. గోప్యతను పరిగణనలోకి తీసుకుని, మీ నిజమైన గుర్తింపును బహిర్గతం చేయడానికి లోగో లేదా గ్రాఫిక్ లేదా ఫన్నీ ఫొటోలను మీ ఫొటోకు బదులుగా ఉపయోగించండి. ● ఎవరైనా మీ డీపీని మీ అనుమతి లేకుండా ఉపయోగించిన సందర్భాలు మీకు కనిపిస్తే, దాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు రిపోర్ట్ చేయండి ● మీ డీపీని అప్‌డేట్ చేయండి. దీనివల్ల పాత ఫొటోలు వాడకుండా స్కామర్లను అడ్డుకోవచ్చు. ఇది డీపీని దుర్వినియోగం చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.





ఇన్‌పుట్స్:
అనిల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



అంకిత రైనా ఓటమి

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనాకు నిరాశ ఎదురైంది. పారిస్‌లో బుధవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 212వ ర్యాంకర్ అంకిత 6-7 (1/7), 1-6తో ప్రపంచ 145వ ర్యాంకర్ మొయుక ఉచిజిమా (జపాన్) చేతిలో ఓడిపోయింది. గంటా 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత రెండు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 24 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన అంకిత ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

సాకేత్-యూకీ జోడీ పరాజయం



లియోన్-250 ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్ నుంచి సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ నిష్క్రమించింది. ఫ్రాన్స్‌లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్-యూకీ ద్వయం 1-6, 2-6తో మూడో సీడ్ మహుట్ (ఫ్రాన్స్)-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జంట చేతిలో ఓటమి చవిచూసింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాకేత్, యూకీలకు 5,220 యూరోల (రూ. 4 లక్షల 64 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత్ 18 చైనీస్ తైపీ 0

సలాలా (ఒమన్): ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ భారీ విజయంతో బోణీ కొట్టింది. చైనీస్ తైపీతో బుధవారం జరిగిన పూల్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా గోల్స్ వర్షం కురిపించి 18-0తో గెలుపొందింది. భారత ఆటగాళ్ల ధాటికి చైనీస్ తైపీ ఆటగాళ్లు చేతులెత్తేశారు. భారత్ తరఫున అరైజీత్ సింగ్ హుండల్ (19వ, 19వ, 30వ, 59వ ని.లో) నాలుగు గోల్స్...



అమన్‌దీప్

అమన్‌దీప్ (38వ, 39వ, 41వ ని.లో) మూడు గోల్స్ సాధించారు. బాబీ సింగ్ ధామి (10వ, 46వ ని.లో), ఆదిత్య అర్జున్ లలాగే (37వ, 37వ ని.లో), కెప్టెన్ ఉత్తమ్ సింగ్ (10వ, 59వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. శ్రద్ధానంద్ తివారి (11వ ని.లో), అంగద్‌బీర్ సింగ్ (37వ ని.లో), అమీర్ అలీ (51వ ని.లో), బాబీ పూవణ్ణ చంద్ర (54వ ని.లో), యోగాంబర్ (60వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. ఈ టోర్నీ విజేత జూనియర్ ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది.

ముగిసిన భారత్ పోరు



మనిక

దర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్, భారత నంబర్‌వన్ మనిక బత్రా 11-6, 10-12, 9-11, 11-6, 11-13, 11-9, 3-11తో ప్రపంచ 13వ ర్యాంకర్ అడ్రియానా డియాజ్ (ప్యూర్టోరికో) చేతిలో పోరాడి ఓడిపోయింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆచంట శరత్ కమల్-సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్) ద్వయం 11-9, 8-11, 12-14, 10-12తో లియామ్ పిచ్‌ఫోర్డ్-పాల్ డ్రింక్‌హాల్ (ఇంగ్లండ్) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా-అర్చన కామత్ (భారత్) ద్వయం 8-11, 6-11, 7-11తో హినా హయాట-మిమా ఇటో (జపాన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

ముంబై ఆనందం 'ఆకాశ'మంత...

- క్వాలిఫయర్-2కు అర్హత సాధించిన రోహిత్ జట్టు
- ఎలిమినేటర్‌లో లక్నో చిత్తు
- 81 పరుగులతో ముంబై విజయం
- 5 పరుగులిచ్చి 5 వికెట్లు తీసిన ఆకాశ్ మధ్వాల్

ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ మరోసారి తమ అసలు స్థాయిని ప్రదర్శించింది. లీగ్ దశ చివర్లో కాస్త అదృష్టం కూడా కలిసొచ్చి ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై తమ బలాన్ని ఎలిమినేటర్‌లో చూపించింది. సమష్టి బ్యాటింగ్ ప్రదర్శనతో గౌరవప్రదమైన స్కోరు సాధించిన టీమ్, ఆపై లక్నో సూపర్ జెయింట్స్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. పేసర్ ఆకాశ్ మధ్వాల్ అద్భుత బౌలింగ్‌కు తోడు టీమ్ మెరుపు ఫీల్డింగ్ ముంబైని రెండో క్వాలిఫయర్‌కు చేర్చాయి... ఉత్తరాఖండ్‌కు చెందిన ఆకాశ్ సూపర్ ఆటతో ఐపీఎల్‌లో తన ఉనికిని ప్రదర్శించాడు. కనీస ప్రదర్శన ఇవ్వలేని పేలవ బ్యాటింగ్‌తో లక్నో కుప్పకూలడంతో హోరాహోరీగా సాగుతుందనున్న మ్యాచ్ కాస్తా ఏకపక్షంగా మారిపోయింది. ఇక ఫైనల్ చేరేందుకు శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో రోహిత్ జట్టు క్వాలిఫయర్-2 సమరానికి సిద్ధం కాగా, వరుసగా రెండో సీజన్‌లోనూ లక్నో నాలుగో స్థానానికే పరిమితమైంది.



ఆకాశ్ మధ్వాల్



స్టొయినిస్

చెన్నై: ముంబై ఇండియన్స్ మరో కీలక అడుగు వేసింది. ఎలిమినేటర్ దశను విజయవంతంగా అధిగమించి క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. బుధవారం జరిగిన పోరులో ముంబై 81 పరుగుల భారీ తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కామెరాన్ గ్రీన్ (23 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (20 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం లక్నో 16.3 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌటైంది. స్టొయినిస్ (27 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. కనీసం పూర్తి ఓవర్లు కూడా ఆడలేకపోయిన లక్నో 21 బంతుల ముందే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆకాశ్ మధ్వాల్ తన 3.3 ఓవర్ల కోటాలో 5 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. ఐపీఎల్ టోర్నీ ప్లే ఆఫ్ మ్యాచ్‌లో 5 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ఆకాశ్ నిలిచాడు.

కీలక భాగస్వామ్యం...

ఓపెనర్లు ఇషాన్ కిషన్ (15), రోహిత్ శర్మ (11) ముంబైకి ఆశించిన ఆరంభాన్ని అందించలేకపోయారు. 8 పరుగుల వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగారు. అయితే గ్రీన్, సూర్యకుమార్ భాగస్వామ్యంతో జట్టు కోలుకుంది. గ్రీన్ తాను ఎదుర్కొన్న తొలి 10 బంతుల్లోనే 6 ఫోర్లు కొట్టగా, సూర్య కూడా తన దైన శైలిలో వికెట్ వెనుక భాగంలో రెండు సిక్సర్లు బాది అలరించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 38 బంతుల్లోనే 66 పరుగులు జోడించారు. అయితే నవీన్ వేసిన 11వ ఓవర్ ఇన్నింగ్స్‌ను మలుపు తిప్పింది. ఈ ఓవర్లోనే సూర్య, గ్రీన్‌లను అతను అవుట్ చేశాడు. తర్వాతి నాలుగు ఓవర్లలో తడబడిన ముంబై 26 పరుగులే చేయగలిగింది. అయితే చివర్లో తిలక్ వర్మ (22 బంతుల్లో 26; 2 సిక్స్‌లు), నేహల్ వధేరా (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి ముంబైకి మెరుగైన స్కోరు అందించారు. ఆఖరి 5 ఓవర్లలో జట్టు 51 పరుగులు సాధించింది.

టపటపా...

ఛేదనలో లక్నోకు ఏదీ కలిసి రాలేదు. రెండో ఓవర్లోనే ప్రేరక్ మన్కడ్ (3) వెనుదిరగ్గా, 'ఇంపాక్ట్'గా వచ్చిన కైల్ మేయర్స్ (18) పెద్దగా ప్రభావం చూపలేదు. మూడో స్థానంలో వచ్చిన కెప్టెన్ కృనాల్ పాండ్యా (8) కూడా విఫలమయ్యాడు. మరో ఎండ్‌లో స్టొయినిస్ మాత్రమే కాస్త ధాటిగా ఆడుతూ ఆశలు రేపాడు. కానీ ఆకాశ్ వరుస బంతుల్లో బదోని (1), పూరన్ (0)లను అవుట్ చేయడంతో స్కోరు 75/5కు చేరింది. 10 ఓవర్లలో 108 పరుగులు చేయాల్సిన కష్టసాధ్యమైన స్థితిలో స్టొయినిస్‌ను జట్టు నమ్ముకుంది. అయితే దీపక్ హుడా (15)తో సమన్వయ లోపంతో స్టొయినిస్ రనౌట్ కావడంతో జట్టు ఓటమి లాంఛనమే అయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) పూరన్ (బి) యశ్ 15; రోహిత్ (సి) బదాని (బి) నవీన్ 11; గ్రీన్ (బి) నవీన్ 41; సూర్యకుమార్ (సి) గౌతమ్ (బి) నవీన్ 33; తిలక్ వర్మ (సి) హుడా (బి) నవీన్ 26; డేవిడ్ (సి) హుడా (బి) యశ్ 13; వధేరా (సి) బిష్ణోయ్ (బి) యశ్ 23; జోర్డాన్ (సి) హుడా (బి) మొహసిన్ 4; షోకీన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 182. వికెట్ల పతనం: 1-30, 2-38, 3-104, 4-105, 5-148, 6-159, 7-168, 8-182. బౌలింగ్: కృనాల్ 4-0-38-0, గౌతమ్ 1-0-8-0, నవీన్ ఉల్ హక్ 4-0-38-4, యశ్ ఠాకూర్ 4-0-34-3, మొహసిన్ 3-0-24-1, రవి బిష్ణోయ్ 4-0-30-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) గ్రీన్ (బి) జోర్డాన్ 18; ప్రేరక్ (సి) షోకీన్ (బి) ఆకాశ్ 3; కృనాల్ (సి) డేవిడ్ (బి) చావ్లా 8; స్టొయినిస్ (రనౌట్) 40; బదోని (బి) ఆకాశ్ 1; పూరన్ (సి) ఇషాన్ (బి) ఆకాశ్ 0; హుడా (రనౌట్) 15; గౌతమ్ (రనౌట్) 2; బిష్ణోయ్ (సి) జోర్డాన్ (బి) ఆకాశ్ 3; నవీన్ (నాటౌట్) 1; మొహసిన్ (బి) ఆకాశ్ 0; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం(16.3 ఓవర్లలో ఆలౌట్) 101. వికెట్ల పతనం: 1-12, 2-23, 3-69, 4-74, 5-74, 6-89, 7-92, 8-100, 9-100, 10-101. బౌలింగ్: బెహ్రన్‌డార్ఫ్ 3-0-21-0, ఆకాశ్ 3.3-0-5-5, జోర్డాన్ 2-1-7-1, గ్రీన్ 3-0-15-0, షోకీన్ 1-0-18-0, చావ్లా 4-0-28-1.

'అంతా ధోని మాయ'

సునీల్ గావస్కర్

ఇంగ్లండ్ గడ్డపై నా తొలి టెస్టు సిరీస్ రోజుల్లోకి ఒక్కసారి వెళ్లి చూస్తే... చివరి టెస్టులో మా విజయలక్ష్యం 172 పరుగులు. దానిని అందుకుంటే ఇంగ్లండ్‌లో భారత్ మొదటిసారి టెస్టు సిరీస్ గెలుస్తుంది. నాలుగో రోజు ఆటను మెరుగైన స్థితిలో ముగించడంతో లక్ష్యం చేరేందుకు ఒక రోజంతా మా వద్ద మిగిలింది. అప్పుడు ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రే ఇల్లింగ్‌వర్త్ నా దృష్టిలో అత్యంత చురుకైన సారథి. ఒక్క సులువైన పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేయడంతో మా దృష్టిలో లక్ష్యం 572 పరుగులుగా కనిపించింది! చివరకు 75 ఓవర్లు ఆడి మేం మ్యాచ్ గెలవగలిగాం. చిదంబరం స్టేడియంలో ధోని కూడా తక్కువ లక్ష్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో చిరునవ్వులు చిందిస్తూనే గుజరాత్‌కు అదే తరహా భావన కల్పించాడు. అతని బౌలింగ్ మార్పులు, ఫీల్డింగ్ వ్యూహాలతో గుజరాత్ ఆటగాళ్లు కదల్లేకపోయారు. అలవోకగా లక్ష్యాలు ఛేదించే తమకు ఏం జరిగిందో అని వారు కూడా ఆశ్చర్యపోయి ఉండవచ్చు. అది అర్థమయ్యేసరికి వారికి ఓటమి ఖాయమైపోయింది. పిచ్ కాస్త నెమ్మదించి టర్న్‌కు అనుకూలించిందనేది వాస్తవమే అయినా దానిని ధోని సమర్థంగా వాడుకోవడమే చెప్పుకోదగ్గ అంశం. అంతకుముందు రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే చెన్నైకి కావాల్సిన సరైన ఆరంభాన్ని అందిస్తే రాయుడు, జడేజా కలిసి స్కోరును 172 వరకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ధోని గతంలో ఎన్నోసార్లు చేసినట్లుగానే మళ్లీ తన మాయ చూపించాడు. చెన్నై జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు.

లక్ష్య సేన్, ప్రణయ్ సంచలనం

- ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఆరో ర్యాంకర్‌లపై విజయం
- ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్



లక్ష్య సేన్



ప్రణయ్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ సంచలన విజయాలతో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 16-21, 21-14, 21-13తో ప్రపంచ ఆరో ర్యాంకర్ తియెన్ చెన్ చౌ (చైనీస్ తైపీ)పై... ప్రపంచ 23వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-10, 16-21, 21-9తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, మాజీ విశ్వవిజేత లో కీన్ యె (సింగపూర్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ (భారత్) 21-12, 21-16తో తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో పీవీ సింధు 21-13, 17-21, 21-18తో లైన్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై కష్టపడి విజయం సాధించింది. భారత్‌కే చెందిన అస్మిత 17-21, 7-21తో యు హాన్ (చైనా) చేతిలో, ఆకర్షి 17-21, 12-21తో అకానె యామగుచి (జపాన్) చేతిలో, మాళవిక బన్సోడ్ 11-21 13-21తో జి యి వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు.

అర్జున్‌కు నాలుగో విజయం

షార్జా: షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నాలుగో విజయం సాధించాడు. వ్లాదిస్లావ్ కొవలెవ్ (రష్యా)తో బుధవారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో నల్లపావులతో అర్జున్ 35 ఎత్తుల్లో గెలుపొందాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత అర్జున్ 5.5 పాయింట్లతో మరో ఏడుగురితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

సినిమా

గమ్యం రాసేస్తాను



రవితేజ

''టైగర్ నాగేశ్వరరావు' సినిమా ఫస్ట్ లుక్‌ని ఇంత గ్రాండ్‌గా విడుదల చేసిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ చిత్రంతో రవితేజగారి ఫ్యాన్స్ ఆకలి కచ్చితంగా తీర్చుతాను. 'నువ్వు చెయ్ వంశీ.. నేను ఉన్నాను' అంటూ నన్ను ప్రోత్సహించిన ఆయనకు థ్యాంక్స్'' అని డైరెక్టర్ వంశీ అన్నారు. రవితేజ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 20న విడుదల కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్, కాన్సెప్ట్ వీడియోను రాజమహేంద్రవరంలో లాంచ్ చేశారు. టైగర్ నాగేశ్వరరావు ప్రపంచాన్ని ఐదు భాషల్లో ఐదుగురు స్టార్స్ పరిచయం చేశారు. తెలుగు వెర్షన్‌కి వెంకటేశ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. జాన్ అబ్రహాం, శివ రాజ్‌కుమార్, కార్తీ, దుల్కర్ సల్మాన్‌లు హిందీ, కన్నడ, తమిళ్, మలయాళ భాషల్లో వాయిస్ ఓవర్ ఇచ్చారు. ''కొన్ని దారి రాస్తుంది.. మరికొన్ని నేను రాస్తాను. వాళ్లు కష్టాలు రాస్తూ ఉంటారు. నేను గమ్యం రాసేస్తాను. నా రెక్కలు మీరు కోసేసినా నేలపై ఉండి నింగిని రాసేస్తాను.. ఇదీ 'టైగర్ నాగేశ్వరరావు కథ'' అన్నారు అభిషేక్ అగర్వాల్.

ఊపిరి నువ్వే ఊరికి..

''తూరుపు పడమర ఏ దిక్కు పడవుర.. నువ్వే మాకు దిక్కు రా...', 'గోపురం గుడికి రా... అక్షరం బడికి రా.. ఊపిరి నువ్వే ఊరికి రా'' అంటూ సాగే పాట 'రంగబలి' చిత్రం నుంచి విడుదలైంది. నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో యుక్తి తరేజ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. విలేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'తూరుపు పడమర..' లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. సంగీత దర్శకుడు సీహెచ్ పవన్ స్వరపరచిన ఈ పాటకు పవన్ బాసంశెట్టి, శ్రీ హర్ష సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. జానీ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. ఈ చిత్రానికి కెమెరా: దివాకర్ మణి.



నాగశౌర్య

కాంబినేషన్ రిపీట్

''నేనే రాజు నేనే మంత్రి' (2017) చిత్రం తర్వాత హీరో రానా, దర్శకుడు తేజ మరో సినిమా చేయనున్నారు. గోపీనాథ్ ఆచంట నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో ఓ మలయాళ నటుడు కీలక పాత్ర పోషిస్తారని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... రానా హీరోగా తేజ దర్శకత్వంలో 'రాక్షసరాజు రావణాసురుడు' అనే మూవీ రానున్నట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. మరి... ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ప్రకటించిన తాజా చిత్రం ఇదేనా? లేక వేరే సినిమానా? అనే విషయం తెలియాల్సి ఉంది.



రానా, తేజ

చలో మైసూర్



రామ్‌చరణ్

'గేమ్ చేంజర్' మూమెంట్స్ కోసం మైసూర్ వెళ్లనున్నారు రామ్ చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ చేంజర్'. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకాంత్, సునీల్, ఎస్‌జే సూర్య, జయరాం, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. ఇటీవల ఈ సినిమా భారీ క్లైమాక్స్ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరిగింది. కాగా 'గేమ్ చేంజర్' నెక్ట్స్ షెడ్యూల్ మైసూర్‌లో జరగనున్నట్లు తెలిసింది. జూన్ మొదటివారంలో రామ్‌చరణ్, శంకర్ అండ్ కో ఈ చిత్రంలోని కీలక సన్నివేశాల కోసం మైసూర్ ప్రయాణం కానున్నారని సమాచారం. దాదాపు పది రోజుల పాటు ఈ షూటింగ్ షెడ్యూల్ జరుగుతుందట. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

జపాన్‌లో మేజిక్ జరిగింది: రామ్‌చరణ్ భార్య ఉపాసన గర్భవతి అనే విషయం తెలిసిందే. ప్రస్తుతం తనకు ఏడో నెల అని శ్రీనగర్‌లో జరిగిన 'జీ 20' కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌చరణ్ అన్నారు. ఇదే వేదికపై జపాన్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, అది ఇప్పుడు ఇంకా స్పెషల్ అని, ఎందుకంటే జపాన్‌లోనే ఈ మేజిక్ (భార్య ప్రెగ్నెన్సీ గురించి) జరిగిందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

తెలంగాణ నేపథ్యంలో...

'ఉయ్యాల జంపాల, మజ్ను' వంటి చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు విరించి వర్మ. తన మూడో చిత్రాన్ని నూతన నటీనటులతో తెరకెక్కిస్తున్నారాయన. ముదుగంటి క్రియేషన్స్‌పై ఈ సినిమా రూపొందుతోంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల ఆధారంగా నడిచే పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా ఇది. 1980లో జరిగే ఒక పీరియాడిక్ కథగా రూపొందుతున్న ఈ సినిమా తెలంగాణ నేపథ్యంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. నటీనటుల వివరాలు, టైటిల్‌ని త్వరలో ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞానశేఖర్, సంగీతం: గోపీసుందర్.



విరించి వర్మ

థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా 2018 - హరీష్ శంకర్

''2018'లాంటి అద్భుతమైన సినిమాని థియేటర్స్‌లోనే చూడాలి. తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని మాట ఇస్తున్నా'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. టొవినో థామస్, కుంచక్కో బోబన్, వినీత్ శ్రీనివాసన్, అసిఫ్ అలీ, అపర్ణ బాలమురళి కీలక పాత్రల్లో నటించిన చిత్రం '2018'. జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వం వహించారు. వేణు కున్నప్పిలి, సీకే పద్మ కుమార్, ఆంటో జోసెఫ్ నిర్మించిన ఈ సినిమాను తెలుగులో కొన్ని ప్రధాన ఏరియాల్లో 'బన్నీ' వాసు ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జూడ్ ఆంటోనీ మాట్లాడుతూ–''కేరళలో 2018లో వచ్చిన వరద బాధితుల్లో నేనూ ఒక్కణ్ణి. ఈ కథని ప్రపంచానికి చెప్పాలనుకుని '2018' తీశాను. భాషతో సంబంధం లేకుండా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు.



జూడ్ ఆంటోనీ, హరీష్ శంకర్, 'బన్నీ' వాసు



ఖుషీ కపూర్

ప్రేమకు వేళాయె...

ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ ప్రేమికులు కానున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే... దర్శక-నటుడు ప్రదీప్ రంగనాథన్ నటించి, స్వీయదర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'లవ్ టుడే' హిందీ రీమేక్‌లో ఈ ఇద్దరూ నటించనున్నారు. రూ. ఐదు కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం వంద కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఈ సినిమా హిందీ రీమేక్ హక్కులను ఫ్యాంటమ్ స్టూడియోస్ దక్కించుకుంది. అప్పట్నుంచి 'లవ్ టుడే' హిందీ రీమేక్‌లో నటించనున్నారంటూ పలువురు హిందీ యువ హీరో హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా జునైద్ ఖాన్, ఖుషీ కపూర్ ఈ ప్రాజెక్ట్‌కి సైన్ చేశారని లేటెస్ట్ టాక్. దర్శకుడు అద్వైత్ చందన్ ఈ సినిమాను తెరకెక్కిస్తారట.

భార్యాభర్తల కథ

యుగ్ రామ్, వంశీ కోటు హీరోలుగా, స్పందన పల్లి హీరోయిన్‌గా రామ్ గన్నీ దర్శకత్వం వహించిన చిత్రం 'ది ట్రయల్'. ఎస్ఎస్ ఫిల్మ్స్, కామన్ మేన్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై స్మృతి సాగి, శ్రీనివాస్ కె. నాయుడు నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ను 'పుష్ప' చిత్ర రచయిత శ్రీకాంత్ విస్సా, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె, 'పలాస' హీరో రక్షిత్ అట్లూరి విడుదల చేశారు. రామ్ గన్నీ మాట్లాడుతూ– ''లేడీ ఓరియంటెడ్ కథతో రూపొందుతోన్న చిత్రం 'ది ట్రయల్'. ఓ మహిళ, ఆమె భర్త చుట్టూ ఈ కథ జరుగుతుంది'' అన్నారు. ''నటీనటులు, సాంకేతిక నిపుణులం దరూ చాలా కష్టపడి ఈ మూవీ చేశాం'' అన్నారు యుగ్ రామ్. ''ది ట్రయల్' థ్రిల్లర్ సినిమా అయినా చాలా వినోదం ఉంటుంది'' అన్నారు స్పందన పల్లి. ''ఈ మూవీ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు సతీష్ వర్మ. ''సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో ఎస్ఐ జాబ్‌ని వదులుకుని మరీ వచ్చి ఈ సినిమాని డైరెక్షన్ చేశారు రామ్ గన్నిగారు'' అన్నారు వంశీ కోటు. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహ నిర్మాతలు: సుదర్శన్ రెడ్డి, కంచరన జయలక్ష్మి.



వంశీ, స్పందన, యుగ్ రామ్

వినోదాల తారంగ



ఇమ్మార్చెల్, సుమన్

కట్ల ఇమ్మార్చెల్, కట్ల డాండి హీరోలుగా, పూజా నాగేశ్వరి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'తారంగ'. ఎస్. సంపత్ కుమార్ దర్శకత్వంలో శ్రీనివాస్ రెడ్డి కర్రి నిర్మించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సుమన్ మాట్లాడుతూ– ''తారంగ' సినిమా బాగా వచ్చింది. యూనిట్ కృషి వల్ల తక్కువ టైమ్‌లోనే పూర్తయింది'' అన్నారు. ''వినోదాత్మకంగా రూపొందించిన చిత్రమిది. జూలైలో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు శ్రీనివాస్ రెడ్డి కర్రి. ''మా సినిమా అన్నివర్గాలవారికి నచ్చేలా ఉంటుంది'' అన్నారు ఎస్. సంపత్ కుమార్.

అహల్య పాత్ర పెద్ద సవాల్ - గీతికా తివారి

''ఫలానా జానర్‌కు పరిమితం కాకుండా ఓ నటిగా డిఫరెంట్ సినిమాలు, పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు హీరోయిన్ గీతికా తివారి. దగ్గుబాటి అభిరామ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'అహింస'. ఈ చిత్రంలో గీతికా తివారి హీరోయిన్‌గా నటించారు. తేజ దర్శకత్వంలో పి. కిరణ్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో గీతికా తివారి మాట్లాడుతూ– ''మాది మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక యాక్టర్‌గా కొన్ని కమర్షియల్ యాడ్స్ చేశాను. ఆ తర్వాత సినిమాల్లోకి రావాలనుకున్నాను. తేజగారితో సినిమాలు చేసిన చాలామంది కొత్త నటీనటులు ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యారు. ఇలా కొత్తవారిని పరిచయం చేయడంలో తేజగారిది లక్కీ హ్యాండ్. ఆయన సినిమా ద్వారా ఇప్పుడు నేను హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అవుతుండటం చాలా సంతోషంగా ఉంది. 'అహింస'లో చేసిన అహల్య పాత్ర నాకు పెద్ద సవాల్ అనిపించింది. కొన్ని సన్నివేశాలకు ఎక్కువ టేక్స్ తీసుకున్నాను. కానీ సింగిల్ టేక్‌లో పూర్తి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి'' అని అన్నారు.



సాక్షి బిజినెస్
గురువారం
25-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	208	61,774
నిఫ్టీ ▽	63	18,285

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాని రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,446	▽ 115
డోజోన్స్	32,805	▽ 251
ఎఫ్‌టీఎస్ఈ 100	7,627	▽ 136
డాక్స్	15,842	▽ 311
షాంఘై	3,205	▽ 41
నికాయ్	30,683	▽ 275

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,680 △ 338
బంగారం (99.5 స్వచ్ఛత)	60,437 △ 337
వెండి (కిలో)	71,129 △ 411

ఎల్‌ఐసీ లాభం హైజంప్



- క్యూ4లో రూ. 13,191 కోట్లు
- షేరుకి రూ. 3 తుది డివిడెండ్


న్యూఢిల్లీ: బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్‌ఐసీ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 13,191 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 2,409 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,15,487 కోట్ల నుంచి రూ. 2,01,022 కోట్లకు క్షీణించింది. తొలి ఏడాది ప్రీమియం ఆదాయం సైతం రూ. 14,663 కోట్ల నుంచి రూ. 12,852 కోట్లకు నీరసించింది. అయితే రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ. 71,473 కోట్ల నుంచి రూ. 76,328 కోట్లకు వృద్ధి చూపింది. ఇక సింగిల్ ప్రీమియం ఆదాయం రూ. 58,251 కోట్ల నుంచి రూ. 43,252 కోట్లకు వెనకడుగు వేసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదికి...
మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎల్‌ఐసీ నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 35,997 కోట్లను తాకింది. 2021–22లో రూ. 4,125 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. గతేడాది ప్రభుత్వం ఐపీవో చేపట్టడం ద్వారా ఎల్‌ఐసీలో 3.5 శాతం వాటాను విక్రయించింది. 22.13 కోట్ల షేర్ల అమ్మకం ద్వారా రూ. 20,557 కోట్లు సమకూర్చుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 594 వద్ద ముగిసింది.

హిందాల్కో లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,411 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 37 శాతం క్షీణించి రూ. 2,411 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,860 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 56,057 కోట్ల నుంచి రూ. 56,209 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది. మొత్తం వ్యయాలు సైతం రూ. 51,026 కోట్ల నుంచి రూ. 53,372 కోట్లకు పెరిగాయి. విద్యుత్, ఇంధన, ఇన్వెంటరీ వ్యయాలు, ఉద్యోగులకు లబ్ధి చేకూర్చే చర్యలు ఇందుకు కారణమయ్యాయి. విదేశీ అనుబంధ సంస్థ నోవెలిస్ నికర లాభం 7 శాతం నీరసించి 17.5 కోట్ల డాలర్లకు చేరింది. మొత్తం ఆదాయం 8 శాతం తగ్గి 4.4 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో 4.8 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధించింది. అల్యూమినియం సగటు ధరలతోపాటు, అమ్మకాలు తగ్గడం ప్రభావం చూపింది.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్‌ఈలో 0.8 శాతం క్షీణించి రూ. 407 వద్ద ముగిసింది.

3 రోజుల లాభాలకు బ్రేక్


- లాభాల స్వీకరణతో డీలా
- సెన్సెక్స్ 208 పాయింట్లు డౌన్
- 61,774 వద్ద ముగింపు
- నిఫ్టీ 63 పాయింట్లు క్షీణత



ముంబై: ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 208 పాయింట్లు క్షీణించి 61,774 వద్ద నిలిచింది. నిఫ్టీ 63 పాయింట్ల నష్టంతో 18,285 వద్ద ముగిసింది. మార్కెట్లు వరుసగా మూడు రోజులపాటు బలపడటంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు ఆసక్తి చూపినట్లు నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు మే నెల డెరివేటివ్ సిరీస్ ముగింపు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ గత సమావేశపు మినిట్స్ విడుదల నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలియజేశారు. వెరసి ఇంట్రాడేలో సెన్సెక్స్ 62,154 వద్ద గరిష్టాన్ని, 61,708 వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 18,393–18,263 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్ రుణ పరిమితి పెంపు చర్చలు నిలిచిపోవడం సెంటిమెంటును దెబ్బతీసినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ నిపుణులు వినోద్ నాయిర్ పేర్కొన్నారు.

మెటల్, బ్యాంకింగ్ వీక్
ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్ 1.6 శాతం, బ్యాంకింగ్ 0.6% చొప్పున నీరసించగా.. కన్స్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, మీడియా, ఎఫ్ఎంసీజీ 1.4–0.5% మధ్య పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, జేఎస్‌డబ్ల్యూ, హిందాల్కో, బజాజ్ ఫిన్, బీపీసీఎల్, కొటక్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, ఆర్ఐఎల్, హెచ్‌యూఎల్ 1.3–0.5% క్షీణించాయి. కాగా, డాలరుతో మారకంలో రూపాయి 17 పైసలు పుంజుకుని 82.68 వద్ద ముగిసింది.


బంగారం పెరిగినా డాలరుకు ప్రాధాన్యం తగ్గదు..




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బంగారం కొనుగోళ్లు భారీగా పెరిగితే డాలరు ప్రాధాన్యం కోల్పోతుందనుకోవడం సరైన అంచనా కాకపోవచ్చని ఆర్థిక నిపుణుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తెలిపారు. డాలరు మారకం విలువ తగ్గినప్పుడల్లా బంగారం ధర పెరుగుతుందని, ఈ కారణంతో డాలరు పని ఇక అయిపోయిందనే పుకార్లు వినిపిస్తుంటాయని పేర్కొన్నారు. కానీ బలహీనపడిన ప్రతీసారీ అది పుంజుకుంటూనే ఉందని తెలిపారు. అత్యంత ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీతో పాటు అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవహారాల్లో అమెరికాకు ఉన్న ఆధిపత్యం కారణంగా ఆ దేశానికి ఆర్థిక సంక్షోభాలు తాత్కాలికమేనని, డాలరుకు ఉన్న ప్రాధాన్యతకు సవాళ్లు ఎదురైనా తాత్కాలికమేనని 75 ఏళ్ల చరిత్ర చెబుతోందని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. అనేక ఇతర కారణాల వల్ల బంగారానికి డిమాండు పెరిగేందుకు, ధర ఎగబాకేందుకు అవకాశాలున్నాయి గానీ డాలరు పతనం నిరంతరాయంగా జరగదని పలువురు ఆర్థికవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సజావుగా రూ. 2వేల నోట్లు వెనక్కి..

- నిశితంగా ప్రక్రియ పర్యవేక్షణ
- ఆర్‌బీఐ గవర్నర్ దాస్ వెల్లడి
- ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని ఆశాభావం



న్యూఢిల్లీ: రూ. 2,000 నోటు ఉపసంహరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియంతా సజావుగా పూర్తి కాగలదని ధీమా వ్యక్తం చేశారు. మార్పిడి, డిపాజిట్లకు తగినంత సమయం ఇచ్చినందున ఎక్కడా రద్దీ కనిపించడం లేదని పరిశ్రమల సమాఖ్య సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. రూ. 2వేల నోట్ల జీవితకాలం, వాటిని ప్రవేశపెట్టిన లక్ష్యం పూర్తయింది కాబట్టి ఉపసంహరిస్తున్నట్లు దాస్ వివరించారు. డెడ్‌లైన్ విధించడాన్ని సమర్థించుకుంటూ గడువంటూ లేకపోతే ఉపసంహరణ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించలేమని ఆయన పేర్కొన్నారు.

4.7 శాతం లోపునకు ద్రవ్యోల్బణం..
ద్రవ్యోల్బణం నెమ్మదించిందని, తదుపరి గణాంకాల్లో ఇది తాజాగా నమోదైన 4.7 శాతం కన్నా మరింత తక్కువగా ఉండవచ్చని దాస్ తెలిపారు. అలాగని, అలసత్వం ప్రదర్శించడానికి లేదని.. ద్రవ్యోల్బణంపై యుద్ధం కొనసాగించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కొన్నాళ్ల క్రితం ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్నట్లుగా అనిపించిన సమయంలో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముంచుకొచ్చి అంతర్జాతీయంగా మొత్తం పరిస్థితి అంతా మారిపోయిందని దాస్ చెప్పారు. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణంపై పోరు కొనసాగుతుందని, ఎప్పటికప్పుడు మారే పరిస్థితులకు తగినట్లుగా ఆర్‌బీఐ స్పందిస్తుందని పేర్కొన్నారు. రేట్ల పెంపునకు విరామం ఇవ్వడమనేది క్షేత్ర స్థాయిలో పరిస్థితులను బట్టే ఉంటుంది తప్ప తన చేతుల్లో ఏమీ లేదని దాస్ చెప్పారు. స్థూలఆర్థిక పరిస్థితులు స్థిరపడుతుండటంతో వృద్ధి పుంజుకోవడానికి తోడ్పాటు లభిస్తోందని దాస్ వివరించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బాకీల సమస్య గణనీయంగా తగ్గిందన్నారు. బ్యాంకుల రుణ వితరణ పెరుగుతోందని చెప్పారు. భారత ఆర్థిక సుస్థిరతను కొనసాగించేందుకు ఆర్‌బీఐ సదా క్రియాశీలకంగా, అప్రమత్తంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

నగదు కొరత..
రూ. 2 వేల కరెన్సీ నోట్ల మార్పిడి రెండో రోజున కొన్ని బ్యాంకుల్లో నగదు నిల్వలు ఖాళీ అయిపోవడంతో తాత్కాలికంగా ప్రక్రియను ఆపివేయాల్సి వచ్చింది. తిరిగి కరెన్సీ చెస్ట్ నుంచి భర్తీ చేసేంత వరకూ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, మార్పిడి కోసం కరెన్సీ కొరత ఉందంటూ పెద్దగా ఫిర్యాదులేమీ రాలేదని వివిధ బ్యాంకుల సీనియర్ అధికారులు తెలిపారు. తమ శాఖలన్నింటికీ నిరంతరాయంగా రూ. 500, రూ. 200, రూ. 100 నోట్లను సరఫరా చేస్తూనే ఉన్నామని వివరించారు.

7 శాతం పైనే వృద్ధి..
గత ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగో త్రైమాసికాల్లో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్న నేపథ్యంలో వృద్ధి రేటు ముందుగా అంచనా వేసిన 7 శాతం కన్నా అధికంగానే ఉండవచ్చని దాస్ చెప్పారు. 2022–23కి సంబంధించిన ప్రొవిజనల్ అంచనాలు మే 31న వెలువడనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసినట్లు దాస్ వివరించారు. అంతర్జాతీయ సవాళ్లను భారత ఎకానమీ దీటుగా ఎదురు నిల్చిందని.. భౌగోళికరాజకీయ, అంతర్గత సమస్యలను అధిగమించేందుకు అవసరమైనంతగా విదేశీ మారక నిల్వలను సమకూర్చుకుందని శక్తికాంత దాస్ చెప్పారు.

భారత్‌లో అవకాశాలు అపారం

- ఇన్‌ఫ్రా, సెమీకండక్టర్, ఇంధన రంగాల్లో ఇన్వెస్ట్ చేయండి
- ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు పీఎం మోదీ పిలుపు



సిడ్నీ: భారత్‌లో డిజిటల్ ఇన్‌ఫ్రా, టెలికం, సెమీకండక్టర్లలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా అక్కడి ప్రముఖ కంపెనీల సీఈవోలతో ప్రధాని ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్‌లో అవకాశాల గురించి తెలియజేశారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఇన్‌ఫ్రా, ఐటీ, ఫిన్‌టెక్, టెలికం, సెమీకండక్టర్, అంతరిక్షం, పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ హైడ్రోజన్, విద్య, ఫార్మా, హెల్త్‌కేర్, వైద్య ఉపకరణాల తయారీ, మైనింగ్, టెక్స్‌టైల్, వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి తెలిపారు. భారతీయ కంపెనీలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. టెక్నాలజీ, నైపుణ్యాలు, శుద్ధ ఇంధనాల విషయంలో భారత కంపెనీలతో సహకారం ఇతోధికం చేసుకోవాలని కోరారు. నిబంధనల అమలును సులభతరం చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. పీఎల్ఐ ప్రోత్సాహకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను సరళతరం చేసినట్టు వివరించారు. హాన్‌కాక్ ప్రాస్పెక్టింగ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గినా రైన్‌హార్ట్, ఫార్టెస్క్యూ ఫ్యూచర్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఆండ్రూ ఫారెస్ట్, ఆస్ట్రేలియా సూపర్ సీఈవో పాల్ ష్రోడర్ ప్రధానితో సమావేశంలో పాల్గొన్నారు. 2000 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ వరకు ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు 1.07 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్టు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇరు దేశాలు మధ్యంతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం తెలిసిందే. గతేడాది డిసెంబర్ 29 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భారత్‌కు ఆస్ట్రేలియా 13వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది.

విద్య, ఉద్యోగ సమాచారం

అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ పరీక్ష (ఏఎస్ఆర్‌బీ)-2023

న్యూఢిల్లీలో ఉన్న అగ్రికల్చరల్ సైంటిస్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. 2023 సంవత్సరానికి గాను అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ద్వారా వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 260
- » **విభాగాలు:** ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, యానిమల్ బయోటెక్నాలజీ, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ఎకనామిక్ బోటనీ, అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఫ్రూట్ సైన్స్, వెటర్నరీ పబ్లిక్ హెల్త్, ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిష్ ప్రాసెసింగ్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ తదితరాలు.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 21 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.57,700 నుంచి రూ.1,82,400 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.07.2023
- » **దరఖాస్తులకు చివరితేది:** 26.07.2023.
- » **పరీక్ష తేది:** అక్టోబర్/నవంబర్ 2023.
- » **వెబ్‌సైట్:** www.asrb.org.in

ఐఐఎఫ్‌టీ, న్యూఢిల్లీలో ఎంఏ కోర్సులో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ).. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఏ(ఎకనామిక్స్–స్పెషలైజేషన్ ఇన్ ట్రేడ్ అండ్ ఫైనాన్స్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** 50శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం). వయసు: వయోపరిమితి నిబంధన లేదు.
- » **ఎంపిక విధానం:** అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.06.2023.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 24.06.2023.
- » **ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ప్రారంభ తేది:** 10.07.2023
- » **తరగతులు ప్రారంభతేది:** 16.08.2023.
- » **వెబ్‌సైట్:** www.iift.ac.in

సశస్త్ర సీమా బల్‌లో 914 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

న్యూఢిల్లీలోని హోంమంత్రిత్వ శాఖకు చెందిన సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ).. హెడ్ కానిస్టేబుల్(గ్రూప్ సి నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 914

- » **కేటగిరీల వారీగా ఖాళీలు:** హెడ్ కానిస్టేబుల్స్(ఎలక్ట్రీషియన్)–15, హెడ్ కానిస్టేబుల్స్(మెకానిక్–పురుషులు)–296, హెడ్ కానిస్టేబుల్స్(స్టీవార్డ్)–02, హెడ్ కానిస్టేబుల్స్(వెటర్నరీ)–23, హెడ్ కానిస్టేబుల్స్(కమ్యూనికేషన్)–578.
- » **అర్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** హెచ్‌సీ(మెకానిక్) పోస్టులకు 21 నుంచి 27 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పే స్కేల్:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, డాక్యుమెంటేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- » **వెబ్‌సైట్:** www.ssbrectt.gov.in

నిఫ్టెమ్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు

హర్యానాలో సోనిపట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- » **బీటెక్(ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్): కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
- » **అర్హత:** ఇంటర్మీడియట్(10+2)ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(మెయిన్స్)2023 అర్హత సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** సీఎస్ఏబీ నిర్వహించే సెంట్రల్ కౌన్సెలింగ్ ద్వారా ఎంపికచేస్తారు.
- » **ఎంటెక్: విభాగాలు:** ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.
- » **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంబీఏ: కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
  విభాగాలు: ఫుడ్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్/ఫైనాన్స్/ఇంటర్నేషనల్ బిజినెస్.
  అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.
- » **పీహెచ్‌డీ: విభాగాలు:** అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, బేసిక్ అండ్ అప్లైడ్ సైన్సెస్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
- » **వెబ్‌సైట్:** www.niftem.ac.in

వినూత్న కెరీర్.. ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్!

హత్యలు, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు.. ఇలా నేరం ఏదైనా..క్రిమినల్స్‌ను గుర్తించడంలో ఫోరెన్సిక్ నిపుణుల నివేదికలు అత్యంత కీలకం! కానీ..దేశంలో ఫోరెన్సిక్ నిపుణుల కొరత అధికంగా ఉంది!! దీంతో ఫోరెన్సిక్ విభాగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు కేంద్ర హోంశాఖ పరిధిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఈ విద్యాసంస్థ అందించే కోర్సులు పూర్తిచేసుకుంటే.. ఫోరెన్సిక్ రంగంలో వినూత్న అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. తాజాగా.. 2023-24 ప్రవేశాలకు సంబంధించి ఎన్‌ఎఫ్‌ఏటీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
ఈ నేపథ్యంలో... ఎన్‌ఎఫ్ఎస్‌యూ అందించే కోర్సులు, క్యాంపస్‌లు, ఎంపిక ప్రక్రియ, ప్రవేశ పరీక్ష విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

- » నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ అడ్మిషన్ నోటిఫికేషన్
- » ఫోరెన్సిక్ సైన్స్, క్రిమినాలజీ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో కోర్సులు
- » నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్(ఎన్‌ఎఫ్‌ఏటీ) ద్వారా ప్రవేశాలు
- » ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులతో ఉపాధి అవకాశాలకు మార్గం



ఫోరెన్సిక్ సైన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్రిమినాలజీ, సైకాలజీ, బిహేవియరల్ సైన్స్ తదితర విభాగాల్లో నిపుణులను తీర్చిదిద్దే ఉద్దేశంతో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ పలు కోర్సులు అందిస్తోంది. జాతీయ ప్రాధాన్యం గల సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) హోదా ఉన్న ఈ వర్సిటీలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. విస్తృత కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు.

9 క్యాంపస్‌లు.. 2,462 సీట్లు

మూడేళ్ల క్రితం ఏర్పాటైన ఎన్ఎఫ్ఎస్‌యూ.. ప్రస్తుతం తొమ్మిది(గుజరాత్, ఢిల్లీ, గోవా, త్రిపుర, భోపాల్, పుణె, గువహటి, మణిపూర్, ధర్వాడ్) క్యాంపస్‌ల ద్వారా పీహెచ్‌డీ, పీజీ, బీటెక్, బీఎస్సీ, బీఏ, ఎంబీఏ, లా, క్రిమినాలజీ, సైకాలజీ తదితర వినూత్న కోర్సులు అందిస్తోంది. ఇందులో పీహెచ్‌డీ మొదలు పీజీ డిప్లొమా వరకు.. పలు విభాగాల్లో 2,462 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఇంటిగ్రేటెడ్ కోర్సులు

ఎన్ఎఫ్ఎస్‌యూ..ఇంటిగ్రేటెడ్ కోర్సులు కూడా అందిస్తోంది. అయిదేళ్ల వ్యవధిలో.. బీఎస్సీ+ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్), బీటెక్+ఎంటెక్ సీఎస్ఈ(సైబర్ సెక్యూరిటీ), బీఏ+ఎంఏ(క్రిమినాలజీ), బీబీఏ+ఎంబీఏ(ఫోరెన్సిక్ ఆడిటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్), బీబీఏ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీఎస్‌సీ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్) కోర్సులను అందిస్తోంది. వీటికి ఇంటర్మీడియెట్ అర్హతగా నిర్దేశించారు. ఎల్ఎల్‌బీ కోర్సులకు సంబంధించి క్లాట్ ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశిస్తున్నారు.

కోర్సులు-అర్హతలు

- **ఎమ్మెస్సీ:** ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ, మల్టీ మీడియా ఫోరెన్సిక్స్; ఎమ్మెస్సీ సైబర్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ–డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎమ్మెస్సీ హోంల్యాండ్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ(ఫోరెన్సిక్ ఫుడ్ అనాలిసిస్ స్పెషలైజేషన్), క్లినికల్ సైకాలజీ, న్యూరో సైకాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, టాక్సికాలజీ; ఎమ్మెస్సీ కెమిస్ట్రీ(ఫోరెన్సిక్ అనలిటికల్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్); ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్(ఎన్విరాన్‌మెంటల్ ఫోరెన్సిక్స్ స్పెషలైజేషన్); ఎమ్మెస్సీ ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్లు.
- **అర్హత:** ఆయా కోర్సులను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 55 లేదా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంఏ కోర్సులు:** మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం(ఫోరెన్సిక్ జర్నలిజం స్పెషలైజేషన్), పోలీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, క్రిమినాలజీ(ఫోరెన్సిక్ సైకాలజీ స్పెషలైజేషన్); **అర్హత:** 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- **ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు:** బీఎస్సీ+ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్; **అర్హత:** ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌లలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **బీటెక్+ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ): అర్హత:** ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్టులుగా చదవడంతోపాటు కెమిస్ట్రీ/బయాలజీ/ఇన్ఫర్మేషన్ ప్రాక్టీసెస్/బయోటెక్నాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్/ బిజినెస్ స్టడీస్/ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సబ్జెక్టులతో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి.
- **బీఏ+ఎంఏ(క్రిమినాలజీ): అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **బీబీఏ+ఎంబీఏ(ఫోరెన్సిక్ ఆడిట్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్స్): అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **బీబీఏ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్),బీఎస్సీ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్): అర్హత:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు క్లాట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంటెక్ ప్రోగ్రామ్‌లు:** ఎంటెక్(సైబర్ సెక్యూరిటీ), ఎంటెక్–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్(సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్); ఎంటెక్ సివిల్ ఇంజనీరింగ్(ఫోరెన్సిక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్); ఎంటెక్ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఎంటెక్–అప్లైడ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.
- **అర్హత:** ఆయా కోర్సులను అనుసరించి బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఈసీఈ) లేదా ఎంసీఏ కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులు:** ఎంబీఏ–ఫోరెన్సిక్ ఆడిటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, ఎంబీఏ–బిజినెస్ అనలిటిక్స్, ఎంబీఏ–హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, అర్హత: 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంబీఏ సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్: అర్హత:** ఐటీ/కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో బీఎస్సీ లేదా సైబర్ ఫోరెన్సిక్/కంప్యూటర్ ఫోరెన్సిక్/సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టులతో బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.

ఫార్మసీ-పీజీ కోర్సులు

- ఎం.ఫార్మసీ(ఫోరెన్సిక్ ఫార్మసీ స్పెషలైజేషన్), ఎం.ఫార్మసీ(ఫార్మాస్యుటికల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్పెషలైజేషన్); అర్హత: 55 శాతం మార్కులతో బి-ఫార్మసీ ఉత్తీర్ణత ఉండాలి; -ఎమ్మెస్సీ ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ: అర్హత: సైన్స్/ఫార్మసీ/మెడిసిన్/ఇంజనీరింగ్‌లలో 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

'లా' ప్రోగ్రామ్స్

- **ఎల్ఎల్ఎం(సైబర్ లా అండ్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్), ఎల్ఎల్ఎం(క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్): అర్హత:** ఎల్ఎల్‌బీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు పీజీ-క్లాట్ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎల్ఎల్‌బీ(ఆనర్స్): అర్హత:** 45 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఎన్ఎఫ్ఏటీ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ఉండాలి.

ఇతర కోర్సులు

- **డిప్లొమా ఇన్ కెనైన్ సైన్స్: అర్హత:** డిప్లొమా ఇన్ పోలీస్ డాగ్ హ్యాండ్లింగ్ ఉత్తీర్ణత లేదా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు డాగ్ హ్యాండ్లర్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి.
- **ఎం.ఫిల్(క్రిమినల్ సైకాలజీ): అర్హత:** సైకాలజీ స్పెషలైజేషన్‌తో ఎంఏ లేదా ఎమ్మెస్సీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **పీహెచ్‌డీ:** ఫోరెన్సిక్స్ అండ్ అలైడ్ సైన్సెస్.
- **వివిధ విభాగాల్లో పీజీ డిప్లొమా కోర్సులు: అర్హత:** ఆయా కోర్సులను అనుసరించి బ్యాచిలర్/పీజీ స్థాయిలో..బయాలజీ, బయో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ/ఫోరెన్సిక్ సైన్సెస్/మెడిసిన్/ఫార్మసీ/అగ్రికల్చర్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/కెమిస్ట్రీ /బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఈసీఈ)/ఆయుష్ కోర్సులలో 50 లేదా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.

ఎన్ఎఫ్ఏటీ స్కోర్‌తో ప్రవేశం

- దాదాపు 60కిపైగా కోర్సులను అందిస్తున్న ఎన్ఎఫ్ఎస్‌యూ.. వీటిల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఎన్ఎఫ్ఏటీ నిర్వహిస్తోంది. వంద ప్రశ్నలతో వంద మార్కులకు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. పరీక్ష సమయం గంటన్నర.
- పీజీ డిప్లొమా కోర్సులకు నిర్దేశిత విద్యార్హతల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఈ కోర్సుల అభ్యర్థులు ఎన్ఎఫ్ఏటీకి హాజరవ్వాల్సిన అవసరం లేదు. ఎం.ఫిల్, పీహెచ్‌డీ కోర్సులకు ఎంట్రన్స్ టెస్ట్‌తో పాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

కొలువులు ఖాయం

- ఫోరెన్సిక్ కోర్సుల ఉత్తీర్ణులకు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్, ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్, ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్, ఫోరెన్సిక్ స్పీచ్ ఎక్స్‌పర్ట్స్, పాథాలజిస్ట్, ఫోరెన్సిక్ ఆడిటింగ్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.
- ప్రభుత్వ రంగంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సీబీఐ, ఐబీ వంటి ప్రభుత్వ శాఖల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.
- ప్రైవేట్ రంగంలో ఫార్మాస్యుటికల్ సంస్థలు, ఆస్పత్రులు, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. వీటితో పాటు విద్యా రంగంలోనూ అధ్యాపకులుగా కెరీర్ ప్రారంభించొచ్చు. • ఫోరెన్సిక్ విభాగంలో కొలువులు సొంతం చేసుకున్న వారికి నెలకు రూ.50 వేల వరకు వేతనం లభిస్తోంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 29, 2023
- **ఎన్ఎఫ్ఏటీ పరీక్ష తేదీ:** జూలై 1, 2 తేదీల్లో
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nfsu.ac.in, www.nta.ac.in

క్లుప్తంగా...

లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పెద్దపల్లిలో ఓ రెస్టారెంట్‌లోని లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు వెళ్తున్న మంత్రి.. స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి జిల్లాకేంద్రంలోని కూనారం చౌరస్తాలో తన అనుచరుని రెస్టారెంట్‌కు వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు లిఫ్టును ఆశ్రయించారు. సామర్థ్యం మించిపోవడంతో లిఫ్ట్ తలుపులు మూసుకున్నా.. ఎటూ కదల్లేదు. పోలీసులు కాసేపు శ్రమించి తలుపులు తెరిచారు. అనంతరం మంత్రి నవ్వుకుంటూ బయటికొచ్చి 'పెద్దపల్లి గుర్తుండిపోతుంది..' అంటూ చెన్నూర్ పయనమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రేపు ఎన్‌సీఎస్సీ జాబ్‌మేళా



సాక్షి, హైదరాబాద్: నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ (ఎన్‌సీఎస్సీ) ఫర్ ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం విద్యానగర్‌లోని ఎన్‌సీఎస్సీ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ భూక్యా కాసిమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విప్రో, టెక్ మహీంద్రా తదితర పది రకాల కంపెనీల్లో దాదాపు 645 ఉద్యోగాలకు ఈనెల 26వ తేదీన మెగా జాబ్‌మేళా ద్వారా అర్హులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040–27408555 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎంసెట్ ఫలితాలు



సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ ఫలితాలు గురువారం విడుదలవుతాయి. ఉదయం 9.30 గంటలకు విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేస్తారు. ఈ నెల 10 నుంచి 14 వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఎంసెట్ పరీక్ష జరిగింది. రెండు విభాగాలకు కలిపి 3,01,789 మంది పరీక్ష రాశారు. ఎంసెట్ ఫలితాలను సాక్షి ఎడ్యుకేషన్ డాట్ కాం వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

డిసెంబర్ 3న 'క్లాట్'

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం కోసం కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్)–2024ను డిసెంబర్ 3న నిర్వహించనున్నారు. లా యూనివర్సిటీల కన్సార్టియం ఈ మేరకు భేటీ అయి నిర్ణయం తీసుకుంది. సిలబస్, దరఖాస్తు, కౌన్సెలింగ్ తేదీలు, ఇతర వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఓ ప్రకటనలో వెల్లడించింది.

నేడు యూఎస్ అంబాసిడర్ రాక

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో అమెరికా అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి హైదరాబాద్ నగరానికి రానున్నారు. గురువారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ నగరానికి చేరుకుంటారు. భారత్‌లో అంబాసిడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన హైదరాబాద్‌కు వస్తున్నారు. గురువారం నగరానికి వస్తున్న ఆయన ఆదివారం తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈనెల 26న కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

ఉరుములు, మెరుపుల రేడియేషన్‌కు పేలిన సెల్‌ఫోన్

ఒకరి మృతి.. మరో ఇద్దరికి గాయాలు



సంస్థాన్ నారాయణపురం: ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్న సమయంలో ఫోన్ మాట్లాడుతుండగా రేడియేషన్ ప్రభావంతో ఫోన్ పేలిపోయింది. ఫోన్ మాట్లాడిన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు ఎల్లంకి వెంకటేశం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. యాదాద్రి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్‌లో ఓ రైతు పొలం దున్నడానికి వచ్చాడు. తనకు సాయపడేందుకు సోదరుడు శేఖర్‌ను ఫోన్ చేసి మరీ రప్పించుకున్నాడు. కాగా, శేఖర్ వచ్చేటప్పుడు తన కుమారుడు ప్రవీణ్‌ను కూడా వెంట తీసుకొచ్చాడు. వారు వచ్చిన అరగంటకే వర్షం రావడంతో శేఖర్, వెంకటేష్, ప్రవీణ్‌లు దగ్గరలో ఉన్న పురాతన భవనంలోకి వెళ్లారు. ఇంతలో శేఖర్‌కు ఫోన్ వచ్చింది. మాట్లాడుతుండగా ఉరుములు, మెరుపులు వచ్చాయి. రేడియేషన్‌తో మొబైల్ పేలిపోయింది. శేఖర్ అక్కడికక్కడే మృతిచెందగా వెంకటేష్‌కు, ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రాఘవేంద్ర పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముఖం చూశాకే ముందుకు!



ఏదో పనిమీద ఓ ఆఫీసుకు వెళ్లారు. మీకన్నా ముందు ఉన్న ఓ వ్యక్తి ప్రవేశ ద్వారం వద్దకు వెళ్లగానే డోర్ ఆటోమేటిగ్గా తెరుచుకుంది. మీకు మాత్రం తెరుచుకోలేదు. అక్కడి సెక్యూరిటీ సిబ్బంది వచ్చి తీస్తేనే తెరుచుకుంది. ఇది 'ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ'మహిమ. మీకన్నా ముందు వెళ్లిన వ్యక్తి ఆ ఆఫీసులో ఉద్యోగి. ద్వారం దగ్గర ఉన్న 'ఫేషియల్ రికగ్నిషన్'కెమెరా అతడిని గుర్తించి డోర్ తెరిచింది. మీరు బయటివారు కాబట్టి తెరవలేదు. కేవలం ఉద్యోగుల కోసమే కాదు అపరిచితులు, అనుమానితులు, నేరస్తులపై నిఘా కోసం వాడే ఈ టెక్నాలజీకి ఇటీవల హైదరాబాద్‌లో ఆదరణ పెరుగుతోంది.

- హైదరాబాద్‌లో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీకి ఆదరణ
- వచ్చేదెవరు, వెళ్లేదెవరో నిత్యం పరిశీలన
- అనుమానితుల కదలికలపై నిఘా కోసం కూడా..
- విమానాశ్రయం, పోలీసు అకాడమీ, బస్‌భవన్ వంటి చోట్ల ఏర్పాటు
- ఇంకా వినియోగం పెరగాల్సి ఉందంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్‌టీ) వినియోగం పెరుగుతోంది. ఇప్పటికే విమానాశ్రయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కీలక సంస్థలలో ఉద్యోగుల ప్రవేశ, నిష్క్రమణ కోసం ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. తాజాగా అపరిచితుల ప్రవేశం, అనుమానితుల కదలికల నేపథ్యంలో.. ప్రైవేట్ పార్టీలు నిర్వహించే గేటెడ్ కమ్యూనిటీలు, క్లబ్‌లు, పబ్‌లకు కూడా ఎఫ్ఆర్‌టీ వినియోగం విస్తరించింది. సైబర్ నేరాలు, అనుమానితుల కదలికలు పెరిగిన నేపథ్యంలో దీని వినియోగం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెప్తున్నారు.

ఎఫ్ఆర్‌టీ సామర్థ్యం ఎంతంటే?

నాలుగు కెమెరాలు, ఒక వీడియో మేనేజ్‌మెంట్ సర్వర్, నాలుగు లైసెన్స్‌లు, సర్వర్ స్టోరేజీ, బ్యాకప్‌తో కూడిన ఎఫ్ఆర్‌టీ ఉపకరణానికి రూ.3లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చవుతుంది. 200 నుంచి 10 వేల వరకు ముఖాలను, 5 వేల వేలిముద్రలను స్టోర్ చేసుకోవచ్చు. ఇన్‌కార్డ్ ఎఫ్ఆర్‌టీ పరికరాలైతే నియంత్రిత యూనిట్లలో డేటా విడిగా నిల్వ ఉంటుంది. ఎఫ్ఆర్‌టీ పరికరాలను అధీకృత నిర్వాహకులు మాత్రమే.. పర్సనల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (పిన్), పాస్‌వర్డ్, వేలిముద్రల సాయంతో మాత్రమే యాక్సెస్ చేయగలుగుతారు. వీటిలోని డేటా ఎన్‌క్రిప్ట్ చేయబడి ఉండటం వల్ల హ్యాకర్ల నుంచి కూడా భద్రత ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో ఎఫ్ఆర్‌టీ లేదా బయోమెట్రిక్‌లను నేరుగా నియంత్రించే చట్టం లేదు. ఎలక్ట్రానిక్ రికార్డులు, ముఖ గుర్తింపు సహా వ్యక్తిగత డేటాను సేకరించే లేదా నిల్వ చేసే విధానం 'ఇన్ఫర్మేషన్ చట్టం–2000'పరిధిలోకి వస్తాయని కేంద్ర హోం శాఖ గతంలోనే స్పష్టం చేసింది.

ముఖ్యమైన ప్రదేశాల్లో ఎఫ్ఆర్‌టీ

రాష్ట్రంలోని పలు కీలక కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రధాన కార్యాలయం, సెంట్రల్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్, హైదరాబాద్ పోలీసు ప్రధాన కార్యాలయం, తెలంగాణ పోలీసు ప్రధాన కార్యాలయం, సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తదితర చోట్ల ఎఫ్ఆర్‌టీ నిఘా ఉంది.

ఎలా పని చేస్తుంది అంటే..

ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ వ్యవస్థలో అవసరమైన మేర కెమెరాలు, 7 ఇంచుల ఎల్‌సీడీ స్క్రీన్, మైఫేర్ అనే రీడింగ్ మాడ్యుల్ కాంటాక్ట్‌లెస్ కార్డు ఉంటుంది. మాస్క్ లేకుండా ఉన్నవారి ముఖాలను 3 మీటర్ల దూరం నుంచే ఈ వ్యవస్థ గుర్తిస్తుంది. ఒక్కొక్కరి ముఖాన్ని 0.2 సెకన్లలోపే రీడ్ చేసి.. ఇప్పటికే ఫీడ్ చేసి ఉన్న ఫొటోలు, వీడియోల్లోని డేటాతో పోల్చుతుంది. సదరు వ్యక్తి ఎవరనేది నిర్ధారిస్తుంది. ఒకవేళ కొత్త వ్యక్తులు అయితే వెంటనే అలర్ట్ చేస్తుంది. అనుమానితులు, బ్లాక్‌లిస్టులో ఉన్న వ్యక్తులను గుర్తిస్తే.. సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తుంది.

ముఖాన్ని గుర్తించాక వారిని లోపలికి అనుమతించేందుకు 'టర్న్ స్టయిల్ గేట్లు'తెరుచుకుంటాయి.

ఈ ఉపకరణాలన్నీ ఇంటర్నెట్‌తో కాకుండా లోకల్ ఏరియా నెట్‌వర్క్ (ఎల్‌ఏఎన్)తో అనుసంధానమై ఉంటాయి. డేటా ఎన్‌క్రిప్ట్ అయి ఉంటుంది.

అవగాహన లేక పరిమిత స్థాయిలో వినియోగం



– రాజశేఖర్, ఎండీ, బృహస్పతి టెక్నాలజీస్

అనుమానాస్పద, అపరిచిత వ్యక్తులు, నేరస్తుల ప్రవర్తనను ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ముందుగానే గుర్తించి అప్రమత్తం చేస్తుంది. దీంతో నేరాల శాతం తగ్గుతుంది. అయితే విదేశాలతో పోలిస్తే మన దగ్గర ఎఫ్ఆర్‌టీ వినియోగం తక్కువే. ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవటంతో వినియోగం పరిమితంగా ఉంది.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు షెడ్యూల్

జూన్ 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ .. జూన్ 19 చివరి తేదీ



వి.వెంకటరమణ

సాక్షి, హైదరాబాద్: బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను బాసర ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ వి.వెంకటరమణ బుధవారం ప్రకటించారు. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల చేసి, 5వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుల సమర్పణకు జూన్ 19 చివరి తేదీగా నిర్ణయించారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు జూన్ 24 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం జూన్ 26న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు.

పారదర్శకంగా ప్రవేశాలు

అత్యంత పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ ప్రవేశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఈసారి హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను 15 నిమిషాల్లో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. మొదటి రెండు సంవత్సరాలు ఏడాదికి ఒకసారి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది 33 వేల దరఖాస్తులు వచ్చాయని, ఈసారి కూడా అదే స్థాయిలో దరఖాస్తులు రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు.

నిజామాబాద్ ఐటీ టవర్‌లో ఆర్జీయూకేటీ సెంటర్

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వీసీ వెంకటరమణ చెప్పారు. వర్సిటీని పూర్తిగా ఆధునీకరించడంతో పాటు సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. మంత్రి కేటీఆర్ మార్గదర్శకాల మేరకు నిజామాబాద్ ఐటీ టవర్‌లో ఆర్జీయూకేటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి

హైకోర్టులో పిటిషన్.. నేడు విచారణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయంజాల్‌కు చెందిన గ్రూప్–1 అభ్యర్థి బి.వెంకటేశ్ సహా 38 మంది పిటిషన్ దాఖలు చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శి, పేపర్ లీకేజీపై విచారణ చేస్తున్న సిట్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. పేపర్ లీకేజీ కారణంగా అక్టోబర్‌లో నిర్వహించిన ప్రిలిమ్స్‌ను రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే జూన్ 11న మళ్లీ ప్రిలిమ్స్‌ను నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రిలిమ్స్‌ను రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేస్తూ అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రూప్–1, 2, 3, 4 పరీక్షల కోసం ఎదురుచూస్తున్నామని, ఈ పరీక్షలకు కొంత సమయం ఇవ్వాలని అధికారులను కోరామని, తమ విజ్ఞప్తిని వారు పరిగణనలోకి తీసుకోలేదని వెల్లడించారు.

ఎర్రర్.. టైమ్ అవుట్!

గురుకుల బోర్డు వెబ్‌సైట్‌తో అభ్యర్థులకు తిప్పలు

- ఉద్యోగాలకు దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు
- చివరిరోజూ వెంటాడిన ఇబ్బందులు
- పలు కేటగిరీలకు నేటితో ముగిసిన దరఖాస్తు ప్రక్రియ
- వేలాది మంది అభ్యర్థులు దరఖాస్తులకు దూరం
- ఫీజు చెల్లించినా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడంలో విఫలం

సాక్షి, హైదరాబాద్: వెబ్‌సైట్ సతాయింపులు, సర్వర్ సమస్యలు గురుకుల కొలువుల అభ్యర్థులకు తలనొప్పిగా మారాయి. వీటిని పరిష్కరించడంలో తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) విఫలమైంది. దీంతో వేలాది మంది దరఖాస్తుకు దూరం కావాల్సిన పరిస్థితి దాపురించింది. సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో పీజీటీ, ఆర్ట్ టీచర్, క్రాఫ్ట్ టీచర్, లైబ్రేరియన్ (స్కూల్స్), ఫిజికల్ డైరెక్టర్ (స్కూల్స్) కొలువులకు దరఖాస్తు ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగిసింది. కానీ గడువు ముగిసే చివరి నిమిషంవరకు సాంకేతిక సమస్యలు వెంటాడాయి. దీంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. బోర్డు వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ వాటిని పరిష్కరించని అధికారులు, గడువు తేదీ పొడిగింపుపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మరో రెండ్రోజుల్లో మ్యూజిక్ టీచర్, టీజీటీ దరఖాస్తు ప్రక్రియ సైతం ముగియనుంది. అప్పటివరకు ఇవే సమస్యలు పునరావృతమైతే పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఎదురుకానుంది.

తొలిరోజు నుంచీ ఇదే తీరు...

టీఆర్‌ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తొలిరోజు నుంచే కొనసాగుతూ వచ్చాయి. రాష్ట్ర గురుకుల సొసైటీల పరిధిలోని 9,231 ఉద్యోగాల భర్తీకి గత నెల 5వ తేదీన బోర్డు ఏకకాలంలో 9 నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో భాగంగా గత నెల 17వ తేదీ నుంచి గురుకుల జూనియర్ కాలేజీలు, గురుకుల డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ ఉద్యోగ దరఖాస్తులను స్వీకరించింది. నెల రోజుల పాటు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకునే ప్రతి అభ్యర్థి ముందుగా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఓటీఆర్ నమోదు, ఆ తర్వాత దరఖాస్తుల సమర్పణకు ఉపక్రమించిన అభ్యర్థులకు గురుకుల వెబ్‌సైట్ చుక్కలు చూపించింది. సాంకేతిక సమస్యలు, సర్వర్ సతాయింపుతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ నెల 17వ తేదీతో ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు గడువు ముగియగా.. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తుకు దూరమయ్యారు. తాజాగా గురుకుల పాఠశాలల్లో పీజీటీ, ఆర్ట్ టీచర్ తదితర పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగియగా.. సాంకేతిక సమస్యలు కొనసాగడంతో దీనికీ మెజారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. కొందరైతే ఫీజులు చెల్లించినప్పటికీ దరఖాస్తును సబ్మిట్ చేసే అవకాశం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.



దరఖాస్తు సబ్మిషన్ తర్వాత సాంకేతిక సమస్యతో ఎర్రర్ అని చూపిస్తున్న దృశ్యం

వివరాలు ఎంట్రీ చేశాక ఎర్రర్!

గురుకుల వెబ్‌సైట్‌లో ప్రధానంగా రెండు దశల్లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ముందుగా ఓటీఆర్ నమోదుకు సంబంధించి ఆధార్ వివరాలు ఎంట్రీ చేసిన వెంటనే వివరాల పేజీ తెరుచుకోవాల్సి ఉంటుంది. కానీ ఎర్రర్ అంటూ డిస్‌ప్లే అవుతుండటంతో తిరిగి వెబ్‌పేజీని తెరవాల్సివస్తోంది. ఇలా పలుమార్లు ప్రయత్నిస్తేనే ఓటీఆర్ ప్రక్రియను పూర్తి చేయగలిగినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. కొందరైతే ఓటీఆర్ నమోదుకే రోజుల తరబడి ప్రయత్నించినట్లు తెలిపారు. ఓటీఆర్ నమోదు తర్వాత ఫీజు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఫీజు చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసి దరఖాస్తులో వివరాలను ఎంట్రీ చేసి సబ్మిట్ చేసే సమయంలో సర్వర్ ఎర్రర్, రిక్వెస్ట్ టైమ్ అవుట్ అంటూ వస్తోంది. మెజారిటీ అభ్యర్థులకు ఇదే అనుభవం ఎదురవుతుండడంతో గురుకుల బోర్డు హెల్ప్ డెస్క్‌కు ఫోన్ ద్వారా, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదులు అందిస్తున్నారు. కానీ హెల్ప్‌డెస్క్‌కు ఫిర్యాదులు, వినతులతో ఉపయోగం లేదని రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌కు చెందిన పీజీటీ అభ్యర్థి ఎస్.పాండురంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తు గడువు పెంపు లేనట్టే..!

కాలేజీల్లో ఉద్యోగాలకు దరఖాస్తు గడువును గురుకుల బోర్డు పెంచలేదు. దీంతో పీజీటీ, ఆర్ట్ టీచర్ తదితర పోస్టులకు దరఖాస్తు విషయంలోనూ గడువు పెంచే అవకాశం ఉండకపోవచ్చని తెలుస్తోంది. దీనిపై స్పందించేందుకు బోర్డు అధికారులు నిరాకరిస్తున్నారు.

రామప్పపై ఏఎస్‌ఐ మంట!

ఆలయానికి ఐదు కి.మీ. దూరంలోనే బొగ్గు గనులకు సింగరేణి ప్రతిపాదనలు

- ఎన్‌ఓసీ జారీకి అభ్యంతరం లేదన్న ఏఎస్‌ఐ.. ఈ తీరుపై పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ ఆగ్రహం
- గనులతో రామప్ప ఆలయానికి ప్రమాదం తప్పదని హెచ్చరిక
- యునెస్కో గుర్తింపు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన
- సాంకేతిక నివేదిక కోసం ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐలకు విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ సమీపంలో సింగరేణి సంస్థ ప్రతిపాదించిన 'పీవీ నరసింహారావు భూఉపరితల గనుల (ఓపెన్ కాస్ట్ మైన్)' అంశం వివాదానికి కారణమైంది. ఇప్పటికే ప్రతిపాదిత గనులతో అక్కడికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి ముప్పు వస్తుందన్న అభ్యంతరాలు ఉన్నాయి. అలాంటిది బొగ్గు గనుల ఏర్పాటు కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీపై కేంద్ర పురావస్తుశాఖ సానుకూల నిర్ణయం తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

యునెస్కో గుర్తింపు పొందిన కట్టడం

రామప్ప దేవాలయం ఇటీవలే యునెస్కో నుంచి ప్రపంచ వారసత్వ సంపద హోదా గుర్తింపు దక్కించుకున్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో ఆ ఘనత సాధించిన తొలి కట్టడంగా రామప్ప ఆలయం రికార్డు సృష్టించింది. దీనికి సమీపంలోనే సింగరేణి బొగ్గు గనుల తవ్వకాలకు ప్రతిపాదనలు వచ్చాయి. దీనికి సంబంధించి బెంగళూరులోని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ప్రాంతీయ కార్యాలయం ఎన్‌ఓసీ జారీకి సానుకూలత వ్యక్తం చేసింది. నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైనింగ్ ఇంజనీరింగ్‌లను సంప్రదించి.. సింగరేణి హామీల ఆధారంగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు పేర్కొంది. కానీ దీనిపై రామప్ప ఆలయ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్న 'ది పాలంపేట ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' విస్మయం వ్యక్తం చేసింది. ప్రతిష్టాత్మకమైన యునెస్కో గుర్తింపు సాధించిన తరుణంలో, దానికి విఘాతం కలిగించే ఏ చిన్న చర్యను కూడా ఉపేక్షించకుండా అభ్యంతరం చెప్పాల్సిన ఏఎస్ఐ.. అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటని మండిపడింది. ఈ అథారిటీలో కీలక సభ్యత్వమున్న కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. మరోవైపు బొగ్గు గనులు ప్రారంభమైతే రామప్ప ఆలయానికి జరిగే నష్టం ఏమిటో తేల్చాలని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లను పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ కోరింది. దీనితోపాటు బొగ్గు గనులతో జీవావరణం, సామాజిక, ఆర్థిక ప్రభావంపై అధ్యయనం చేయాలని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్‌ను కోరాలని నిర్ణయించింది. ఈ సంస్థలు తేల్చే అంశాల ఆధారంగా బొగ్గు గనుల తవ్వకం ఆధారపడి ఉంది.

మూడు కీలక అంశాలతో..

పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ భేటీలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు పక్షాన ప్రొఫెసర్ పాండురంగారావు ప్రధానంగా మూడు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. బొగ్గు గనుల తవ్వకం వల్ల రామప్ప ఆలయానికి ప్రమాదం పొంచి ఉందని స్పష్టం చేశారు.

శాండ్ బాక్స్ పునాదుల్లోంచి ఇసుక జారిపోయే ప్రమాదం



రామప్ప దేవాలయాన్ని నాటి కాకతీయ నిపుణులు శాండ్ బాక్స్ టెక్నాలజీతో నిర్మించారు. భూకంపాలు వంటి కుదుపులు ఏర్పడ్డా.. నిర్మాణానికి ఇబ్బంది రాకుండా పునాదుల్లో ఇసుకను నింపారు. ఆలయ ప్రదక్షిణ పథం నుంచి దిగువకు దాదాపు 18 అడుగుల మందంతో ఇసుక ఉంది. ఈ ఇసుక పదిలంగా ఉంటేనే నిర్మాణం స్థిరంగా ఉంటుంది. రామప్ప ఆలయానికి 5 కిలోమీటర్ల దూరంలో 300 మీటర్ల లోతు వరకు బొగ్గు గనులను తవ్వితే.. భూమి పొరల్లో నీటి ప్రవాహ దిశను మార్చే కదలికలు (హైడ్రాలిక్ గ్రేడియంట్స్) ఏర్పడుతాయి. రామప్ప ఆలయం ఎగువన దాదాపు 3 టీఎంసీల సామర్థ్యమున్న రామప్ప చెరువు ఉంది. హైడ్రాలిక్ గ్రేడియంట్స్ వల్ల చెరువు నీళ్లతో ఆలయ పునాదుల్లోని ఇసుకను కోత గురై.. క్రమంగా ఆలయ పునాదులు అస్థిరమయ్యే ప్రమాదం ఉంది.

గని ఉన్నంత కాలం కంపనాల ప్రభావం

బొగ్గు గనుల్లో నిరంతరం పేలుళ్లు జరుపుతూ ఉంటారు. 300 మీటర్ల లోతు వరకు తవ్వే క్రమంలో జరిపే పేలుళ్ల భూమి పొరల్లో కంపనాలు సృష్టిస్తాయి. రామప్ప ఆలయ నిర్మాణం నాజూకుగా ఉంటుంది. పేలుళ్ల కంపనాల వల్ల రాళ్లలో కదలికలు ఏర్పడి కట్టడం ధ్వంసమయ్యే ప్రమాదం ఉంటుంది.

బొగ్గు తరలింపు ధూళితో ఆలయ నిర్మాణానికి ప్రమాదం

ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్.. సమీపంలోని నూనె శుద్ధి కర్మాగారాల కాలుష్యం వల్ల దెబ్బతింటున్నట్టు ఇప్పటికే తేలింది. ఇప్పుడు రామప్పకు గనుల తవ్వకం, లారీల్లో బొగ్గు తరలింపుతో.. ధూళి కణాలు రామప్ప ఆలయం మీద పడుతూ.. రసాయనిక చర్యకు కారణమవుతాయి. ఇది నిర్మాణానికి ప్రమాదం తెచ్చి పెడుతుంది.

నా కోడిని చంపేశారు

- పోలీసు ఠాణాకు టర్కీ కోడి పంచాయితీ
- రూ.1,000 జరిమానాతో ముగిసిన వివాదం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'నా కోడిని చంపేశారు.. చర్య తీసుకోండంటూ'.. ఒక వ్యక్తి పోలీసు స్టేషన్ మెట్లెక్కాడు. కరీంనగర్‌లో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంగర్ నాఖాచౌరస్తా సమీపంలోని ముబ్బ షీర్ (30).. అదే ప్రాంతానికి చెందిన సాబిర్ (60) ఉదయం 11 గంటలకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మానకొండూరు మండలం అన్నారం నుంచి టర్కీ కోడిని కొనుగోలు చేసి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నానని.. బుధవారం పొరుగింటి సాబిర్ కట్టెతో కొట్టి చంపాడని ముబ్బ షీర్ బోరున విలపిస్తూ సీఐ సీఐ దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. తానేమీ చేయలేదని సాబిర్ తొలుత బుకాయించాడు. కానీ సీఐ గట్టిగా అడిగే సరికి.. కట్టెతో మెల్లిగా కొట్టానని.. కొద్ది దూరం బాగానే పరుగెత్తిన కోడి.. తర్వాత కుప్పకూలిందని వివరించాడు. ఇంతలో వృద్ధుడి కొడుకు వచ్చి తన తండ్రివల్ల తప్పు జరిగిందని.. చనిపోయిన కోడికి పరిహారం ఇస్తానని చెప్పాడు. కోడి ఏడుకిలోల బరువు ఉంటుందని.. రూ.7 వేల పరిహారం ఇవ్వాలని బాధితుడు ముబ్బ షీర్ పట్టుబట్టాడు. చివరికి రూ.వెయ్యి పరిహారం ఇచ్చేందుకు రాజీ కుదరడంతో పంచాయితీ ముగిసింది. పోలీసు స్టేషన్‌కు వచ్చిన అర్జీదారులు ... కోడి పంచాయితీ తెలిసి నవ్వుకున్నారు.

కూతురు పెళ్లి చూసి.. కన్నుమూసి

పెళ్లి పందిట్లో కుప్పకూలిన తండ్రి



ఎలిగేటి శంకర్ (ఫైల్)

గోదావరిఖని: కూతురి పెళ్లిని కళ్లారా చూసిన కాసేపటికే.. ఒక తండ్రి కుప్పకూలి కన్నుమూశాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఈ సంఘటనపై స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన ఎలిగేటి శంకర్ (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తన కూతురు వివాహాన్ని బుధవారం స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిపించారు. పెళ్లితంతు ముగిసిన కొద్దిసేపటికే ఒక్కసారిగా కుప్పకూలారు. బంధువులు అతన్ని హుటాహుటిన గోదావరిఖనిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. వివిధ పత్రికల్లో పాత్రికేయునిగా పనిచేసిన శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. పెళ్లిబాజాలు మోగిన ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.